
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్

సంపుటి 19 - సంచిక 07
**డిశంబర్ 2014**

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**

## జ్ఞానం

జ్ఞానమే ప్రకాశం, అజ్ఞానమే అంధకారం. జీవనమార్గమంతా అజ్ఞానమనే అంధకారంతో ఆవరించి ఉన్నప్పుడు జీవనయాత్రను విజయవంతంగా కొనసాగించడానికి వెలుగు కావాలి. కానీ ఈ అజ్ఞానాంధకారాన్ని బాహ్య వెలుగుతో తొలగించుట సాధ్యం కాదు, ఆంతరిక వెలుగు కావాలి. మన సొంతప్రకాశమైతేనే నమ్మినబంటుగా ఉంటుంది. ఏ కారణం చేతైనా ఇతరులు ఇచ్చే ప్రకాశాన్ని నమ్ముకుంటే మోసపోక తప్పదు.

సూఫీ సాధువు ఫరీద్ తన శిష్యునితో, "జ్ఞానాన్ని సంపాదించు. అంతకు మించిన మార్గం లేదు " అని ఉపదేశించారు. శిష్యుడు వినమ్రంగా, "బాబా! రోగి ఎప్పుడు వైద్యుడి దగ్గరకే వెళ్తాడు, స్వయంగా వైద్యశాస్త్రం నేర్చుకుని కూడా తనకు తాను ఉపచారం చేసుకోడు. మీరు నాకు మార్గదర్శకులు, గురువు. మీరు నన్ను ఉద్ధరిస్తారని నాకు ఖచ్చితంగా తెలుసు. మరి నాకు జ్ఞానం ఆర్జించవలసిన అవసరం ఏమిటి" అని అడిగాడు.

ఇది విన్న ఫరీద్ బాబా గంభీరంగా ఒక కథ చెప్పారు, "ఒక ఊళ్ళో ఒక వృద్ధుడు ఉండేవాడు. కంట్లో శుక్లాల కారణంగా అతను గుడ్డివాడైపోయాడు. అతని కొడుకులు అతనికి చికిత్స చేయిద్దామనుకున్నారు కానీ ఆ వృద్ధుడు అందుకు ఒప్పుకోలేదు. "నాకు కళ్ళతో పనేంటి. నాకు మీ అమ్మ, మీరు 8 మంది కొడుకులు, కోడళ్ళు ఉన్నారు. ఇంట్లో మొత్తం 34 కళ్ళు నాకుండగా నా రెండు కళ్ళు లేకపోతే మాత్రం ఏమిటి?" అంటూ మొండికేశాడు. కొన్నాళ్ళయ్యాక ఒక రాత్రిపూట ఇంటికి నిప్పంటుకుంది. అందరు తమ ప్రాణాలు కాపాడుకోవడానికి పరిగెత్తారు, ఆ సమయంలో ఆ వృద్ధుడు ఎవరికీ గుర్తు రాలేదు. అతడు నిప్పులో కాలి బూడిదైపోయాడు.

ఈ కథ చెప్తూ ఫరీద్ తన శిష్యుడికి ఇలా ఉపదేశించాడు, "నాయనా! అజ్ఞానంతో జీవించాలని కోరుకోకు. జ్ఞానం మన సొంత కళ్ళతో సమానం. ఇది తప్ప వేరే దారి లేదు. సత్యం శాస్త్రాలతో పొందజాలం. దానిని మనం స్వయంగా పొందాలి. అసహాయుడైన మనిషికి ఒక్కగానొక్క ఆసరా జ్ఞానం ఒక్కటే."

*– అఖండజ్యోతి, ఏప్రిల్ 2011*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**కాస్త ప్రోత్సాహం, తగిన వాతావరణం కల్పిస్తే పిల్లలు అద్భుతాలు చేయగలుగుతారు**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** జ్ఞానం 3
2. **విషయసూచిక-సద్గురువాణి :** సఫలత 4
3. **వేదమంత్రం :** నిరంతర కృషితోనే ప్రగతి 5
4. **శబ్దబ్రహ్మ - నాదబ్రహ్మ - 3:** శబ్దశక్తి చూపించే మంచి-చెడు ప్రభావము 6
5. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 30 :** స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతి-3 10
6. **కుండలినీ మహావిజ్ఞానం-15 :** సర్పిణి యొక్క జాగరణ-శక్తి యొక్క ఊర్ధ్వగమనం 14
7. **భావసంవేదనల గంగోత్రి - 6 :** కార్యశూరతకు జనని - సంవేదన 17
8. **జీవన దేవత సాధన, ఆరాధన - 4 :** ప్రజ్ఞాయోగం 19
9. **గీతా జయంతి ప్రత్యేకం :** పరమాత్మ చేతిలో యంత్రాలుగా మారాలి 21
10. **అహింస - వీరుల ఆభరణం** 23
11. **చేతనత్వ విజ్ఞానం :** అచేతన గర్భంలో దాగి ఉన్న భాండాగారం 25
12. **దైనందిన జీవితంలో క్రియాశీల టెలీపతి** 29
13. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** గాయత్రీ పరివార్ ఉద్దేశ్యం - పీడ, పతనముల నివారణ-3 31
14. **నా వారితో నా మాట :** ఆరోగ్యంగా ఉండాలి 35
15. **5 రోజుల వ్యక్తిత్వ పరిష్కార సాధన శిబిరంపై నివేదిక** 38
16. **స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 8** 45
17. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 47




## సద్గురు వాణి

### సఫలత

సఫలతకు ఆధారములు తీవ్రమైన ఇచ్ఛ, తత్పరత, సక్రియత, క్రియాశీలత. ఇవి లేకుండా ఎవరు చెప్పుకోదగ్గ సఫలతను ప్రాప్తించుకోలేరు. సుఖదుఃఖములకు, మంచి చెడు పరిస్థితులకు, ఉన్నతి-పతనములకు ముఖ్య కారణం మనిషి చేసుకున్న కర్మలే అని అర్థం చేసుకోవాలి. కానీ ఇచ్ఛరూపం (కోరిక)లో బీజం వేసుకుంటే కర్మ వృక్షరూపంలో ఉత్పన్నమవుతుంది. ఇచ్ఛవలన ప్రేరణ లభిస్తుంది, ప్రేరణ వలన కర్మ జరుగుతుంది.


## యుగశక్తి గాయత్రి

**చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా పంపించండి.**

బ్యాంకు పేరు: ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ

ఖాతాపేరు : **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**

ఖాతానెం. : **32506416087**

IFSC Code : **SBIN-0013272**

అట్లే మని ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కాని చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 50/- చందాకు అదనంగా పంప ప్రార్థన. అట్లు పంపించని వారి చందాకాలము దామాషా పద్ధతిలో తగ్గించబడును. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలాన జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుతూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము**, హెచ్.పి. రోడ్, మూసాపేట

అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.

ఫోన్: 040-23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| విడి ప్రతి రూ॥ **15/-** | **3** సం॥ చందా రూ॥ **420/-** |
| సం॥ చందా రూ॥ **150/-** | **10** సం॥ చందా రూ॥ **1300/-** |


సంకల్పంతో నుదిటి రాతను మార్చుకోవచ్చు

వేదమంత్రం

# నిరంతర కృషితోనే ప్రగతి

**ఉత్ క్రామాతః పురుష మావ సత్థా**
**మృత్యోః పడ్వీశమవమజ్జమానః ।**
**మా ఛ్ఛిత్థా అస్మాల్లోకాదగ్నేః**
**సూర్యస్య సందృశః ॥ (అథర్వవేద 8/1/4)**

**భావార్థం:** ఓ మనుష్యులారా! మీరు వర్తమాన పరిస్థితితో సంతుష్టి చెందకూడదు. శరీరం, ఆత్మబలము ద్వారా పురుషార్థము చేయండి, ముందుకు వెళ్ళండి.

**సందేశం:** ప్రగతికి ఏదైనా పరిమితి ఉంటుందా? ప్రపంచంలో ఎంత జ్ఞాన విజ్ఞానమున్నదో దానిని ఎవరైనా తెలుసుకోగలిగారా? వేదముల గూఢ రహస్యాల సముదాయమును ఎవరైనా పొంద గలిగారా? మనుష్యుడు నేడు కూడా ప్రపంచ రహస్యాలను అన్వేషిస్తూనే ఉన్నాడు. ప్రతిదినం ఏదో ఒకటి కనుక్కుంటూనే ఉన్నాడు. ప్రగతికి, ఉన్నతికి ఇదే ఆధారం. లే, నడు, పడు, మళ్ళీలే ముందుకు వెళ్ళు. మళ్ళీమళ్ళీ ఇదే చెయ్యాలి. నిరంతరం చేస్తూ ఉండు. ధైర్యం వదిలి పెట్టవద్దు. నెమ్మది నెమ్మదిగా శిఖరం చేరుకుంటావు. పడిపోయినప్పుడు గాబరా పడవద్దు. సాఫల్యం కోసం ప్రయత్నం పూర్తి మనస్సుతో చేయలేదని తెలుసుకోవాలి. మళ్ళీ రెట్టింపు ఉత్సాహంతో నిమగ్నుడవు కావాలి.

ఇదంతా మాటలతో అవుతుందా? శరీరబలం, ఆత్మ బలం లేకుండా ఇది సంభవమవుతుందా? లేదు. ఇందు కోసం తపస్సు, సంయమం. బ్రహ్మచర్యంతో శరీరాన్ని ఎంతో పుష్టిగా చేసుకోవచ్చు. దానితో ప్రాపంచిక బాధలను తేలికగా అధిగమించవచ్చు. గాంధీజీ తన శరీరాన్ని లోహంలాగా తయారు చేసుకున్నాడు. ఇంగ్లాండులోని చలి కూడా ఆయన నగ్నశరీరాన్ని ప్రభావితం చేయలేకపోయింది. శరీరంపై అటువంటి నియంత్రణయే సంయమ సాధనను సరళం చేస్తుంది. ఇంద్రియాలను వశం చేసుకొనుటలో ఇది మొదటి మెట్టు. దీనివలన ఆత్మబలం ఇనుమడిస్తుంది, మనస్సు అనే గుఱ్ఱం అటుఇటు పరుగెత్తదు. గొప్పవారు కావటానికి ఆత్మశక్తి అత్యంత ఆవశ్యకం. దీనితో అన్ని శక్తులు ఆర్జించవచ్చు. ధనబలము, బుద్ధిబలముచేత లౌకిక ప్రగతి, భౌతిక సుఖం లభించవచ్చు. కానీ ఆత్మబలం చేత అన్నీ లభిస్తాయి. ఎవరి ఆత్మబలం శక్తివంతమో వారు జీవన ఆదర్శాల సిద్ధాంతాలతో ఉత్తరోత్తర ప్రగతిపొందుతారు.

ప్రతినిమిషం, ప్రతిక్షణం, నిరంతరం మన లక్ష్యం వైపు ముందుకు సాగుతూ, ప్రపంచం చేసిన ఉపకారానికి మన జీవితం మొత్తాన్ని సమర్పించేందుకు తత్పరతతో ఉండాలి. అందరికీ ప్రకాశం, వేడి, శక్తుల అనుదానం చేస్తూ, ప్రపంచంలోని బురదనంతా తొలగించే కార్యములో నిమగ్నమైన సూర్యుడు నిరంతరం పురుషార్థంతో ముందుకు సాగుతాడు, తనకంటూ ఏమీ స్వార్థం ఉండదు. మనము, జీవితంలో సూర్యదేవుని మన ఆదర్శంగా తీసుకోవాలి. జీవిత సాఫల్యం యొక్క రహస్యం ఇదే.

నరుడు ప్రయత్నిస్తే నారాయణుడు అవుతాడు. మన ఋషులు, మనీషులు సమస్త ప్రపంచానికి ఈ హామీ ఇచ్చారు. మార్గదర్శనం చేశారు. అయితే ఈ కృషి ఎలా చేయాలి? దీని ఆధారభూతతత్త్వం ఏమిటి? దేవత్వ గుణాలను మన ఆచరణ లోకి తెచ్చుకొనే ప్రయత్నాలలో మందకొడితనం రాకుడదు. అప్పుడే నరుడు నారాయణుడయ్యే ప్రయత్నంలో సఫలత లభిస్తుంది. సూర్యునితో సమానంగా ప్రగతికోసం నిరంతర కృషి చేయుటయే జీవితం. ఇదే మనందరి కర్తవ్యం.

★★★

## పండుగలు

**డిసెంబర్ 2014**

| | |
|---|---|
| 02-12-2014 | గీతా జయంతి |
| 06-12-2014 | దత్తాత్రేయ జయంతి |
| 25-12-2014 | క్రిస్మస్ |

**జనవరి 2015**

| | |
|---|---|
| 01-01-2015 | ఆంగ్ల సంవత్సరాది |
| 15-01-2015 | సంక్రాంతి |
| 24-01-2015 | వసంత పంచమి |
| 26-01-2015 | రిపబ్లిక్ డే |

**మన భవిష్యత్తు మన చేతులలో, చేతలలో ఉంటుంది**

శబ్దబ్రహ్మ - నాదబ్రహ్మ - 3

# శబ్దశక్తి చూపించే మంచి-చెడు ప్రభావము

స్థూలశబ్దములను వినగలము. వినిపించే ఆ శబ్దములకు తమదైన ఒక ప్రసారక్షేత్రముంటుంది. ఈ పరిధిలోకి వచ్చే ధ్వనులను మాత్రమే మనము వినగలము. ప్రతి సెకండుకు సుమారు 20 నుండి 20,000 కంపనములు ప్రసరింపబడే క్షేత్రపరిధిలోనివాటిని మాత్రమే మనిషి వినగలడు. అనగా మన చెవులు ఈ పరిధిలో వెలువడే శబ్దములను మాత్రమే ఆలకించగలవు. దీనిని మించిన లేదా తక్కువ స్థాయిలో కంపించే శబ్దములను వినగలిగే శక్తి మన చెవులకు లేదు. 20 హెర్ట్జ్ తరంగదైర్ఘ్యము గలవాటిని ఇన్ఫ్రాసోనిక్ అని; 20,000 కంటే ఎక్కువ తరంగ దైర్ఘ్యము గలవాటిని అల్ట్రాసోనిక్ అని పిలుస్తారు.

మనుష్యులను మరియు వస్తువులను ధ్వనులు తరచుగా అసాధారణ స్థాయిలో ప్రభావితం చేస్తాయి. స్థూల లేక శ్రవ్య ధ్వనుల ప్రభావము ప్రత్యక్షముగా కనిపిస్తుంది. అయితే శ్రవణాతీతము మరియు సామాన్యమైనవని తలచబడే ధ్వని తరంగాలు సైతము అమితమైన ప్రభావమును చూపిస్తాయి.

వియన్నాకు చెందిన ప్రొ॥ గావ్‌రాండ్ 'మార్‌సిల్స్' అను సంస్థలో ఒక ఇంజనీర్. అతను తన గదిలోకి వెళ్ళి కూర్చున్నప్పుడు అలజడికి లోనయ్యేవాడు. ఆ గది ఎంతో శుభ్రముగా ఉండి, గాలి-వెలుతురు బాగా ప్రసరింపబడుతున్నా అతనికి ఆ గదిలో ఉన్నప్పుడు తరచుగా వాంతి అయ్యేది. అసలు ఎందుకిలా జరుగుతున్నది అన్న విషయము అతనికి అంతుపట్టలేదు. అతను ఎన్నో యంత్ర పరికరముల సహాయముతో దీని వెనుక గల కారణమును పట్టుకోవటానికి తీవ్రప్రయత్నములు చేశాడు. కానీ ఆ ప్రయత్నములన్నీ నిష్ఫలమయ్యాయి. ఒకనాడు అతను గోడను ఆనుకుని కూర్చున్నప్పుడు అతిసూక్ష్మ కంపనములు అతనికి అనుభూతిలోకి వచ్చాయి. అవి ఎక్కడినుండి వస్తున్నాయని పరిశీలించగా ఎదురుగా కనిపిస్తున్న A.C యంత్రంనుండి అత్యంత సూక్ష్మమైన ఆ తరంగములు వెలువడుతున్నాయని తెలిసింది. దీనినుండే ఆ గదంతా ఇన్ఫ్రాసోనిక్ ధ్వని తరంగములు ప్రసరింపబడుతున్నాయి. ఆ కంపనముల తరంగ దైర్ఘ్యమును కొలచినప్పుడు అది 6 హెర్ట్జ్‌గా నమోదయ్యింది. అతను ఆ గదినుండి బయటకు వచ్చినప్పుడు మాత్రము ఎటువంటి ఇబ్బందీ ఎదురయ్యేది కాదు, కానీ ఆ గదిలోకి వెళ్ళినప్పుడు ఆ తరంగాల ప్రభావము కనిపించేది.

ఈ సంఘటన తరువాత గావ్‌రాండ్ తన పదవికి రాజీనామ చేసి 'సూక్ష్మతరంగముల' మీద పరిశోధనలు చెయ్యటములో మునిగిపోయాడు. ప్రారంభములో కొన్ని విజయములను సాధించిన పిమ్మట 'మానవుడి మనస్సు-శరీరముల మీద శ్రవణాతీత ధ్వనుల ప్రభావము ఏవిధంగా ఉంటుంది?' అన్న విషయమును తెలుసుకోవడము కోసం మరింత ఉత్సాహముతో తన ప్రయోగాలను కొనసాగించాడు. ప్రయోగాల కొరకు అతను ఒక భారీ ఇన్ఫ్రాసోనిక్ ధ్వని యంత్రమును తయారుచేసి ఒక పశువు మీద ప్రప్రథమముగా దానిని ప్రయోగించాడు. ఆ యంత్రం తిరగటం ఆరంభం కాగానే ఆ పశువు విలవిలలాడుతూ నేలకొరిగి చనిపోయింది. ఆ పశువుని పోస్ట్‌మార్టమ్ చేసినప్పుడు ఆ యంత్రం నుండి వెలువడిన తరంగములు పశువు శరీరములోకి చొచ్చుకు పోగానే లోపలి అవయవము లన్నీ సగం మేర ద్రవ రూపములోకి మారిపోయి పశువు మరణమునకు కారణమయ్యాయి అని తెలిసినది.

ఈ దుస్సంఘటన జరిగిన నాటినుండి ఆ శాస్త్రవేత్త ప్రయోగ సమయములో మరింత అప్రమత్తతతో వ్యవహరించసాగాడు. ఈసారి అతను ఒక విశాలమైన మైదానములో ప్రయోగము చేపట్టాలని నిర్ణయించుకున్నాడు. అందువలన ప్రయోగము చేయటానికిగాను అతను ఒక బంకర్‌ను ఏర్పరచి, కొద్దిమంది పర్యవేక్షకులను అందులోకి దింపి, యంత్రము ద్వారా నెమ్మది నెమ్మదిగా తరంగాలను ప్రసరింపజేయుట మొదలుపెట్టాడు. కొద్ది క్షణములలోనే పరీక్షాస్థలమునకు అరమైలు దూరంలో ఉన్న భవనముల కిటికీలన్నీ బీటలుపడటమేకాదు, భవనాల పునాదులు కూడా కదిలిపోయి అవి ప్రక్కకి ఒరిగి పోయాయి.

**దేశం అభివృద్ధి చెందాలంటే మొదట పల్లెసీమలు అభివృద్ధి చెందాలి**

ప్రయోగములో పాలుపంచుకున్నవారిని ఆ ప్రయోగపు అనుభూతులను చెప్పమన్నప్పుడు వారంతా 'మాకు అశాంతి, ఉద్విగ్నత కలిగి తలనొప్పి వచ్చింది' అని వాపోయారు.

ఈనాడు ఆకాశహర్మ్యాలను సైతము క్షణాలలో నేల మట్టము కావించగలిగే సూక్ష్మకంపనములను వెలువరించే యంత్రములు ఆవిష్కరించబడినాయి. పై ఉదాహరణలన్నీ సూక్ష్మధ్వనుల శక్తిని మనకు తేటతెల్లము చేస్తున్నాయి.

ఈ అత్యంత సూక్ష్మధ్వనులే భూకంపం వచ్చేముందుకూడా భూమి లోతుల లోలోపల అలజడి రేగుతున్నది అన్న విషయమును సూచిస్తాయి. ఇటువంటి ప్రమాదములు జరగటానికి కొన్ని గంటలముందే మానవేతర ప్రాణులు అనగా కుక్క, పిల్లి, కుందేలు మరియు కొన్నిరకముల పురుగులలో ఒక విధమైనటువంటి అలజడి చెలరేగి అవి అటుఇటు పరుగులు తీస్తుండటము సర్వత్రా గోచరించే విషయమే! నిజానికి మానవేతర ప్రాణులలో సూక్ష్మతరంగాలను గ్రహించగలిగే అద్భుత సామర్థ్యము ఉంటుంది. తత్కారణముగానే భావి సంఘటనల తాలూకు అనుభూతి కలుగుతుంది వాటికి. కనుక సమయము మించిపోకముందే అవి సురక్షితస్థానములకు పారిపోతాయి. ఇటువంటి ప్రమాదములనుండి బయట పడేందుకు జపనీయులు 'బంగారుచేప' (Goldfish) సహాయము తీసుకుంటారు. భూకంపము వచ్చేముందు ఈ చేపలో ఒక విచిత్రమైన అశాంతి కనపడుతుంది. దీనిని చూసి వారంతా తమతమ ఇళ్ళనుండి బయటకు పరుగులుతీసి ప్రాణాలను రక్షించుకుంటారు. స్త్రీలు, చిన్నపిల్లలు కొంతమేరకు ఈ సూక్ష్మ తరంగాలను అనుభూతిచెందగలరు. పురుషులతో పోల్చి నప్పుడు వీరు ఎక్కువ సమర్థవంతముగా ఆ సూక్ష్మతరంగాలను అనుభూతి చెందుతారు.

కొన్ని సంవత్సరముల క్రితము ఈజిప్ట్‌దేశము ఇట్టి సూక్ష్మ కంపనముల సహాయముతోనే అమెరికా రక్షణవ్యవస్థను రూపొందించే శాస్త్రవేత్తలను ఖంగుతినిపించింది. ఆ తరువాత అమెరికా శాస్త్రవేత్తలు ఈజిప్ట్ అమలుపరచిన ఈ దాడి వెనుక గల రహస్యాలను తెలుసుకుని ఆ కంపనముల దుష్ప్రభావమును నశింపజేసేందుకు వాటికి విరుద్ధముగా పనిచేసే తరంగాలను ఈజిప్ట్‌పైన ప్రయోగించి, దాడిని త్రిప్పికొట్టారు.

కొన్నిరోజులకు ముందు బొంబాయికి చెందిన ఒక వ్యక్తిని గురించి పత్రికలలో ప్రచురితమయ్యింది. ఓ అజ్ఞాతవ్యక్తి సూక్ష్మమైన రేడియో తరంగాలను తనమీద ప్రసరింపజేయుట ద్వారా తనను వేధిస్తున్నాడని ఆ వ్యక్తి ఒక అభియోగాన్ని చేశాడు. అజ్ఞాతవ్యక్తి తనమీద రేడియో సంకేతాలను ప్రసరింప చేసినప్పుడు తన మనస్సు అశాంతికి, అలజడికి లోనై పలుమార్లు ఆత్మహత్య చేసుకోవాలనే చెడు ఆలోచన చెలరేగేదని వాపోయాడు.

ప్రపంచపటములో దక్షిణమున కనిపించే సాంటోరినీ ద్వీపములో ఏ పర్యాటకుడు ఒక్కరోజుకు మించి నిలవలేడనే వార్త బాగా ప్రాచుర్యములో ఉన్నది. ఆ ద్వీపములో అడుగు పెట్టగానే ఏదో తెలియని భయము, నిరాశ, ఉదాశీనత మరియు విచిత్రమైన నిష్క్రియతలు పర్యాటకుడిని చుట్టు ముడతాయి. ఈ సాంటోరినీలోనే అట్లాంటిస్ కాలము వికసించింది అని ప్రజలు నమ్ముతారు. క్రీ.పూ. 1450లో ఆ ద్వీపములోని అధిక భాగము జలగర్భములో కలిసిపోయింది. భూగర్భములో చోటు చేసుకున్న మార్పు-చేర్పుల కారణముగా ఇక అప్పటి నుండి ఒక సూక్ష్మధ్వని అక్కడ జాగృతమై, క్రియాశీలముగా ఉన్నది. భూకంపమును గుర్తించే యంత్రము ఈ తరంగముల క్రియాశీలతను రూఢీపరుస్తున్నది.

ఏది ఏమైనప్పటికీ ఇన్ఫ్రాసోనిక్ ధ్వనులు ఆరోగ్యమునకు ప్రమాదకరమైనవి అన్నది ఈనాడు శాస్త్రవేత్తలచే ధ్రువీకరించ బడిన ఒక సత్యము. అయితే అన్నిరకములైన సూక్ష్మధ్వనులు దుష్ప్రభావమునే కలుగజేస్తాయి అన్నది కూడా వాస్తవము కాదు. పలు పశుపక్షులలో ఆ శ్రవణాతీత ధ్వనులు ఉండటమును గుర్తించారు. వీటి సహాయముతోనే అవి సుదూరములో ఉన్న తన సహచరి / సహచరుడికి ఆవశ్యకమైన సందేశమును పంపిస్తాయి. గబ్బిలము అల్ట్రాసోనిక్ తరంగాల ద్వారానే తన దారిలో ఎదురయ్యే అవరోధములను పసిగట్టి వాటిని అధిగమిస్తుంది. ఫిన్‌హ్వేల్ (సముద్రజలచరము) మైళ్ళ దూరములో గల స్వజాతిప్రాణులకు వీటిద్వారానే సంకేతాలు పంపిస్తుంది. ఇప్పుడు ఏనుగులలో కూడా అటువంటి సూక్ష్మ తరంగములు ఉంటాయని గుర్తించారు. శాస్త్రవేత్తలు ఈ దృష్టితో ప్రయోగములు చేస్తున్నప్పుడే 'అకస్మాత్తుగా ఏనుగుల గుంపు

**పల్లెలు బాగుంటేనే దేశం బాగుండేది**

ఒక నిర్దిష్టదిశ వైపుగా ఎందుకు సాగిపోతుంది' అన్న రహస్యము వీడింది. **అజపాగాయత్రి చేస్తున్నప్పుడు కూడా ఒకరకమైన సూక్ష్మకంపనములు ఉత్పన్నమై చక్రములను, ఉపత్యికలను మరియు గ్రంథులను ప్రభావితము చేస్తాయి.**

వాస్తవానికి మనందరము పరాధ్వని యొక్క విశాల సాగరములో జీవిస్తున్నాము. మనకు తెలిసినా-తెలియక పోయినా ఆ పరానాదము మన యొక్క మనస్సు శరీరములను ప్రభావితము కావిస్తుంటుంది. శబ్దశక్తి నుండే ఈ యావత్సృష్టి ఆవిర్భవించినదని భారతీయులు విశ్వసిస్తారు. అతి ప్రాచీన కాలములో ఋషులు విన్నటువంటి వైదికఋక్కులను అందానికి నిలువెత్తు నిదర్శనముగా నిలుస్తూ భారతభూమి ఉత్తరాన నెలవై ఉన్న హిమాలయపర్వతములలో ఈనాడు కూడా మనము యథాతథముగా మన సూక్ష్మకర్ణేంద్రియముల సహాయముతో ఆలకించగలము అని చెప్తున్నారు. ప్రాకృతిక రహస్యాల గుట్టువిప్పి చెప్పేవారి అభిప్రాయము ప్రకారము ఏ సంఘటన అయినా జరగటానికి కొంతకాలము ముందే వాతావరణములో సూక్ష్మ కంపనము రూపములో సృజించ బడుతుంది. **మనము ఏది మాట్లాడినా అది నశించిపోదు, అది సూక్ష్మధ్వని రూపంలో సజీవంగా ఉంటుందని నేటి విజ్ఞాన శాస్త్రము చాటిచెప్తున్నది.** మహాభారతయుద్ధరంగాన శ్రీకృష్ణుడు తన చెలికాడైన అర్జునుడికి భగవద్గీతను బోధించాడు. అలాగే అంపశయ్యపై పరుండిన భీష్మాచార్యుడు ద్రౌపదికి కొన్ని మంచి విషయములను ఉపదేశించాడు. ఒకవేళ మనము ఆ సూక్ష్మ తరంగములను వెతికి పట్టుకోగలిగితే ఈనాడు కూడా గీతా బోధను, భీష్ముని ఉపదేశములను చక్కగా ఆలకించ గలము అని నొక్కి వక్కాణిస్తున్నారు.

శబ్దమునుండే ఈ సృష్టి ఆవిర్భవించినదని మన శాస్త్రములు ఘోషిస్తున్నాయి. శబ్దశక్తి ద్వారానే ఈ విశ్వబ్రహ్మాండము యొక్క కార్యనిర్వాహకశక్తి యొక్క సమస్త వ్యవస్థ సంచాలితము గావించబడుతూ ఉంటుంది. మేగ్నటిక్ రెజోనెన్స్ ఇమేజింగ్, సోనోగ్రాఫీ వంటివాటిద్వారా వ్యాధి నిర్ధారణ చేసి, చికిత్స చేయుటలో గొప్ప విజయములను సాధించగలిగినది నేటి విజ్ఞానశాస్త్రము. అయితే ఇదేరకముగా శబ్దశక్తి అనే ఇంధనమును ఉపయోగించి శరీరములో నిబిడీకృతమై ఉంటూ సూక్ష్మ కార్యములను నిర్వహించగల విభిన్నభాగములను వికసింపజేస్తే నగణ్యమైన ఈ భౌతికశరీరము ద్వారా అసంభవమనిపించే కార్యములు సైతము సంభవము కాగలవు. **ప్రాచీన కాలములో ఈ శబ్దశక్తిని ఉపయోగించే ఋషులు, మునులు మహోన్నత యోగసిద్ధులను హస్తగతము చేసుకున్నారు.** ఆ శబ్దశక్తితోపాటు ఈనాడు విజ్ఞానము కూడా మనకు బాసటగా నిలుస్తున్నది. ఒకవేళ సరైన దిశలో వీటిని ప్రయోగించినట్లయితే మహత్త్వపూర్ణమైన ఉపలబ్ధులను సాధించి సమస్త మానవ జాతికి లాభాలను అందించవచ్చును.

శబ్దశక్తి ఒకవైపు ప్రాణులకు జీవనప్రదాయనిగా నిలుస్తుంది, మరోవైపు అదే శక్తి ప్రాణులను మరణానికి చేరువ చేస్తుంది. నిజానికి ఈ మహాశక్తిని సదుపయోగము చేసుకుని లాభపడాలి. కానీ సర్వత్రా దీనికి వ్యతిరేకమైన ప్రతిక్రియలు జరగటము గోచరిస్తున్నది. '**కోలాహలరహిత వాతావరణము నెలకొనేవిధంగా** నేటి భౌతికప్రగతి మరియు వైజ్ఞానిక అభివృద్ధి ద్వారా మనిషిని సమున్నతస్థాయికి చేర్చగలిగేందుకు కావలసిన సరంజామ సమకూర్చిపెట్టబడాలి' అన్న విషయము విస్మరించ బడినది. ఈ విషయమును దృష్టిలో పెట్టుకోనప్పుడు ప్రగతి పేరున సాధించినదంతా వృథా అయిపోతుంది, జీవితము ప్రమాదపు అంచులకు చేరుకుంటుంది. పట్టణీకరణము మితిమీరిపోతున్నది, పెద్దపెద్ద కర్మాగారములు, భారీపరిశ్రమలు పెచ్చుమీరిపోతున్నాయి. రైల్వేవ్యవస్థ భూమినంతా ఆక్రమిస్తున్నది. పరుగులు-ఉరుకులు పెడుతున్న మోటర్ వాహనముల సంఖ్య రోజురోజుకు పరిమితిని మించిపోతున్నది. ఇవన్నీ ఏకమై ఎలాంటి ప్రమాదకరమైన పరిస్థితులను నిర్మిస్తున్నాయంటే అవి అత్యంత భయంకరమైనవి అని చెప్పక తప్పదు. మానవుడు సాధించిన భౌతిక-వైజ్ఞానిక ప్రగతివలన విస్తారమైన సంపదలు, ధనము మరియు ఆడంబరములు లభించి తీరుతాయి. కానీ జీవనవికాసానికి కావలసిన మూల భూతమైన ఆవశ్యకతలు మాత్రము అత్యధికంగా నశించి పోతుంటాయి.

నగరాలలోని రహదారుల మీద పరుగులు తీసే వాహనాల వలన సుమారు 60-70 డెసిబల్స్ శబ్దము ఉత్పన్నమౌతుంది. పెద్ద పెద్ద కర్మాగారములలోని యంత్రములు 100 డెసిబల్స్ ధ్వనిని కలిగిస్తుంటాయి. సామాన్య విమానములు ఎగురు

**మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబాలు, సమాజం బాగుంటాయి**

తున్నప్పుడు కూడా ఇంతే ధ్వని చెలరేగుతుంది. జెట్ విమానములైతే చెవులు చిల్లులుపడే శబ్దమును కలిగిస్తాయి. అసలు అవి పైకి ఎగిరేటప్పుడే దిక్కులుపిక్కటిల్లే విధంగా150 డెసిబల్స్ శబ్దమును వెలువరిస్తాయి. ఎవరైనా పిడికిలి బిగించి లాగిపెట్టి కొట్టినప్పుడు బాధతో విలవిల లాడినంతగా ఈ శబ్దము చెవులకు హానిని కలిగిస్తుంది.

100 డెసిబల్స్‌కు మించిన శబ్దము వెలువడితే కనుక తక్షణమే దానిని అరికట్టటానికి, అలాగే దానిని వీలైనంతగా స్వల్పస్థాయికి తగ్గించటానికి విదేశాలలో ఒక క్రమబద్ధమైన పద్ధతిలో విస్తృత ప్రయత్నములు సాగుతున్నాయి. లౌడ్‌స్పీకర్స్ ద్వారా అనావశ్యకమైన గోలను సృష్టించి ఇతరులకు ఇబ్బందిని కలిగించరాదు. ఎవ్వరైనాసరే ఒక సరియైన కారణము చూపకుండా లౌడ్‌స్పీకర్స్‌ని ఉపయోగించటమును అనుమతించరాదు. ముఖ్యంగా నిద్రకు ఆవశ్యకమైన నిశ్శబ్ద వాతావరణము అవసరమైన రాత్రివేళ వీటిని అసలు అనుమతించరాదు.

శాంతంగా ఉన్న జలాశయములో ఒక కంకరరాయిని విసిరినచో తరంగాలు ఉత్పన్నమై, అవి క్రమముగా ఒడ్డు దిశగా సాగిపోతాయి. అదేవిధంగా ఆకాశమంతటా ఆవరించి ఉన్న ఈథర్‌తత్త్వములో ఏదైనా ధ్వని ప్రవేశించినప్పుడు శబ్ద తరంగములు ఉత్పన్నమౌతాయి. నీటి అలలు కేవలము ఉపరితలం మీద కదలాడుతుంటాయి. కానీ ధ్వని తరంగములు ఒక ఆవరణను నిర్మించుకుంటూ ఆటలాడే బంతివలె నలు దిశలా ముమ్ముందుకు సాగిపోతుంటాయి. ఈ ధ్వని తరంగములే కంపనములు లేదా అలజడులు అని పిలువబడతాయి. ఒక పెద్ద రాయిని బలంగాను, వేగంగాను నీటిలోకి విసిరినప్పుడు ఎన్నెన్నో అలలు ఉవ్వెత్తున ఎగసిపడతాయి. అయితే రాయి కనుక చిన్నదిగా, తేలికగా ఉంటే కనుక అలలు కూడా చిన్నవి గానే ఉంటాయి. సరిగ్గా ఇదే రీతిలో శబ్దము భీకరముగానో లేక చిన్నదిగానో ఉంటే ధ్వని తరంగముల శక్తి కూడా తదనుగుణముగా హెచ్చుతగ్గులకు లోనవుతూ ఉంటుంది.

ఒక లిప్తపాటులో ఎన్ని ధ్వనికంపనములు చెలరేగాయి అన్నదాని ఆధారముగా శబ్దశక్తిని లెక్కిస్తారు శబ్దవిజ్ఞానులు. ఒక సెకెండులో 20 కన్నా తక్కువ మరియు 20,000 ను మించిన తరంగదైర్ఘ్యము గల శబ్దతరంగాలను వినలేని రీతిలో మానవచెవి నిర్మాణము జరిగినది. సర్వసాధారణముగా ఒక 1000 నుండి 5000 మధ్య గల ధ్వనితరంగాలను మాత్రమే మానవుడు సులభంగా వినగలడు. ఎన్నెన్నో పశుపక్ష్యాదులు వీటికన్నా స్వల్పమైన లేక వీటిని మించిన ధ్వనులను సైతము వినగలవు. గబ్బిలము 20,000 కంటే ఎక్కువగా ఉండే కంపనాలను కూడా వినగలదు. చేపలకు చెవులు ఉండవు. చేప చెవులు లేకుండానే తన మస్తిష్కము సహాయముతో శబ్దప్రవాహం ఆధారముగా ఆవశ్యకమైన విషయములను ఆకళింపు చేసుకుంటుంది. *(సశేషం)*

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం 19 (1.9) నుండి*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## స్వర్గప్రాప్తికి రాజమార్గం

*వైష్ణవ మత స్థాపకులైన శ్రీరామానుజుల వారి దగ్గరకు ఒక గృహస్థు వచ్చాడు. "మహాత్మా! ఈ లోకం నుండి స్వర్గం చేరుకోవడానికి సులువైన మార్గమేదైనా ఉన్నదా? సెలవియ్యండి" అన్నాడు పాదాభివందనం చేస్తూ.*

*ఆచార్యుల వారు దరహాస వదనులై ఎందుకు లేదు? కావాలనుకున్నవారికి రామమార్గమే సిద్ధంగా ఉన్నది. నీవు ఏ కొంచెం సంపాదించినా న్యాయం తప్పకుండా సంపాదించు. ఖర్చు పెట్టే సమయంలో కూడా నీవు చేసే వ్యయంతో కొంతైనా ఇతరులకు ఉపయోగపడేలా చూడు. స్వర్గం నీకు దగ్గరవుతుంది" అన్నాడు.*

*గృహస్థుకు గుండె పట్టినట్లుంది." ఆచార్యా! సులువు మార్గాన్ని కోరితే మీరు కఠినమైన మార్గాన్ని చూపారు. మీరు చెప్పిన మార్గాన్ని అనుసరించటం చాలా కష్టం." అని నిట్టూర్చాడు.*

*ఆచార్యులు దృఢ చిత్తంతో చెప్పారు. "ఎవ్వరైతే నరకాన్ని చవిచూడకుండా స్వర్గానికి చేరుకోవాలనుకుంటారో వారికి ఈ మార్గం అత్యంత సులువైనది."*

*"అటువంటి వారికే ఈశ్వరప్రాప్తి లభిస్తుంది. సాధన చెయ్యి". అని నిండుగా దీవించి పంపారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*


**మనకు మంచి చెప్పేవారు దొరకడం మన అదృష్టం**

# స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతి - 3

## ప్రారబ్ధాన్ని అతిక్రమించిన సంఘటన

జపం పూర్తికాకపోతే ఆందోళన చెందవద్దని ఒకరోజున మార్గదర్శక సత్తానుండి ఆదేశం లభించింది. తన కర్మను, స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతిని కూడా, అనుష్ఠానంగా పరిగణించవలసిందని ఆయన ఆదేశించారు. అయినా, శ్రీరామ్ నిర్ణీత సమయంలో సంధ్యకు, వాంఛిత సంఖ్యలో జప-ధ్యానములకు తగినంత సమయాన్ని కేటాయించేవాడు. ఎప్పుడైనా కొంత మిగిలిపోతే మిగిలిపోయేది.

జరార్ నుండి తిరిగి వచ్చేటప్పుడు సాయంకాల జపం పూర్తికాలేదు. మిగిలిపోయిన జపానికి మరునాటి ఉదయం తగు సమయాన్ని కేటాయించాడు. ఉదయం ఎనిమిది గంటలు అయింది. జపం పూర్తయిన తర్వాత నివేదన జరగవలసి ఉన్నది. సమర్పణ పాఠాన్ని ఇలా ఉచ్చరించాడు - **ఇతి సంధ్యోపాసనాఖ్యేన కర్మణాం శ్రీపరమేశ్వరః ప్రీయతాం న మమ।** శ్రీ పరమేశ్వరః ప్రీయతాం న మమ అలా పఠించగానే, అంతర్ మనస్సులో ఒక బోధ మేలుకొన్నది. తన ఆత్మచేతనయే చెప్తున్నట్లు, జపం, తపం పరమేశ్వరుని ప్రీతి కోసం అయినప్పుడు, ప్రారబ్ధాన్ని క్షయం చేయడానికి దానిని ఎందుకు వినియోగించాలి?



నిన్న దొనోరియాజీ వద్ద కూర్చొని చేసిన ప్రార్థన, ధ్యాన ధారణలకు సంబంధించిన ప్రశ్న అది.

ఆ క్షణంలోనే సమాధానం వచ్చింది -

ప్రారబ్ధాన్ని క్షయం చేయడానికి కాక, రాష్ట్ర యజ్ఞంలో ఆహుతుల ఇచ్చే వ్యక్తుల యోగ క్షేమం కోసం అది జరిగిందని.

మళ్ళీ ప్రశ్న వచ్చింది -

ఏది ఏమయినా - నీ సాధనను లౌకిక ప్రయోజనాల కోసం వినియోగించకూడదు. పరమేశ్వరుడు నిర్మించిన కర్మఫల విధానంలో జోక్యం కలిగించుకోవడమే అవుతుంది ఇది. నీ తపస్సు కూడా తగ్గిపోతుంది.

ఈ ప్రశ్నదే పైచేయి అయింది. మీమాంస కొద్దిగా పెరిగింది. ఎదురుగా ప్రతిష్ఠితమైన గాయత్రీమాత వెలుగును పరికించాడు. కొంతసేపు ఏకాగ్రతతో అలా పరికిస్తూ ఉండిపోయాడు.

ఆ విగ్రహంలో చిరునవ్వులాంటిది కనిపించింది. పెదిమలు కదులుతున్నట్లు తోచింది. అస్పష్టమైన ధ్వని వస్తోంది. కానీ, చెప్తున్నది ఏమిటో స్పష్టం కావడం లేదు. ఆ ఉద్బోధన ఇది -

**ప్రారబ్ధాన్ని అతిక్రమించడానికి సాధకుడు సాధన చేస్తాడు.** చివరికి అందరు పరమాత్మలో లీనం కావలసిందే. దానిని సహజరీతిలో జరగనిస్తే ఎవరికీ సాధన చేసే అవసరమే ఉండదు. కానీ, ప్రకృతిపై విజయాన్ని పొందాలి. ప్రకృతి నిర్మించిన బంధనాల నుండి విముక్తి పొందాలి, మన పురుషార్థం ద్వారా విముక్తి పొందాలి.

సమాధానం లభించింది. నివేదన పూర్తయిన వెంటనే శ్రీరామ్ తిరిగి ప్రార్థన చేశాడు - మాతా! దొనోరియాజీకి ఆరోగ్యం ప్రసాదించు; ఆయనకు జీవితాన్ని, శక్తిని ప్రసాదించు.

ప్రార్థన పూర్తయింది. ఆ ప్రార్థన గాయత్రీమాతకు వినిపించిందనే విశ్వాసం కూడా ఏర్పడింది.

మూడునాలుగు రోజుల తర్వాత - శ్రీ దొనోరియా యోగక్షేమాలు తెలుసుకోవడానికై తన మిత్రులతోపాటు జరార్‌కు వెళ్ళాలని శ్రీరామ్ ఆలోచించసాగాడు. సహచరుల గోష్ఠిలో దీనిని గురించిన చర్చ జరిగింది. సూరజ్‌పాల్ ఆగడాలను అంతం చేయడానికి వ్యూహరచన కూడా ఆ గోష్ఠిలో జరిగింది. ఆ వ్యూహం ప్రకారం - దొనోరియాజీనే అందుకు అగ్రగామిని చేయాలి. ఆ గ్రామంలో నివసించే వ్యక్తి ప్రతిఘటిస్తే విజయం మరింత నిశ్చితం అవుతుంది.

మంచి వినకపోవడం మన దురదృష్టం

శ్రీరామ్ వారి ఇంటికి వెళ్ళి చూసాడు. ఆయన పరిస్థితిలో పూర్తి మార్పు రాలేదు. కానీ పూర్వంకన్నా మెరుగయింది. దొనోరియాజీకి స్పృహ వచ్చింది. శ్రీరామ్ బృందం వారి ఇంటికి వెళ్ళినప్పుడు ఆయన నిద్రపోతున్నాడు. ఇంటిలోని వారిని ఆయన పరిస్థితి గురించి అడిగి, శ్రీరామ్ వైద్యుని వద్దకు వెళ్ళాడు. ఆయనను అడిగారు. ఆయన ఇలా అన్నాడు.

"భగవంతుడు కరుణించాడు. ఇన్ని రోజులు కోమాలో ఉన్న తర్వాత ఆశ కొద్దిగానే ఉంటుంది."

శ్రీరామ్ ఆయనను ఇలా అడిగాడు.

"దొనోరియాజీ తలమీద చాలా దెబ్బలు తగిలాయి. ఆ గాయాలు మానడానికి ఎన్ని రోజులు పడుతుంది?"

వైద్యుడు ఇలా జవాబిచ్చాడు –

"8–10 రోజులు పట్టవచ్చు. మొదట్లో ఎలాంటి ఆశలేక పోయింది. స్పృహ తిరిగి వచ్చింది కనుక, ఈ విషయం అంచనా వేయగలుగుతాము."

వైద్యుని వద్ద కొద్ది సమయం గడిపి, శ్రీరామ్ విప్లవవాది అయిన తన మిత్రుని వద్దకు వచ్చాడు. ఆయన నిద్రలేచాడు. స్పృహ వచ్చిన తర్వాత రోజులో చాలాసార్లు నిద్ర వస్తోంది. ఆయన శ్రీరామ్‌ను చూసాడు. చూడగానే గుర్తుపట్టాడు. ప్రణామం చేయాలని లేవబోయాడు. పడుకుని ఉండవలసిందిగా శ్రీరామ్ ఆయనకు చెప్పాడు.

శ్రీరామ్ ఆయనతో ఇలా అన్నాడు.

"భారతమాతకు మీ అవసరం ఉంది. ఆమె ఆశీస్సులు మీకు జీవితాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి."

### అత్యాచార రాజ్యంతో పోరాటం

ఆ మాట విని దొనోరియాజీ చిరునవ్వు నవ్వాడు. ఆయన నోటి నుండి గంభీర ప్రకటన ఇలా వెలువడింది –

"త్వరగా కోలుకోవాలి. ఎందుకంటే – మా గ్రామంలోని అత్యాచార రాజ్యాన్ని అంతం చేయాలి."

సూరజ్‌పాల్ నడుపుతున్న అత్యాచార రాజ్యం ప్రస్తావన అది. సంభాషణ చాలాసేపు సాగింది. సంయుక్త పరగణాలలో, ఇతర ప్రాంతాలలో, సంస్థానాలలో జరుగుతున్న ఉద్యమాల పరిస్థితిపై చర్చ అందులో హెచ్చుగా ఉన్నది. మాటల మధ్య – జరార్ జాగీర్దారును ఓడించే విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది. శ్రీరామ్ ఇలా సూచించాడు. "పది పన్నెండు రోజులలో మీ ఆరోగ్యం కుదుటపడితే, మీరు సూరజ్‌పాల్ భవంతి ఎదుట కూర్చోండి; మీతోపాటు ఇతరులు కూడా కూర్చుంటారు; వచ్చిపోయేవాళ్ళకు మీమీద జరిగిన అత్యాచారం గురించి చెప్పండి."

దొనోరియాజీ ఉత్సుకత కనబరచారు. "పది పన్నెండు రోజుల తర్వాత ఎందుకు? ఆ పని ఇప్పుడే ఎందుకు చేయకూడదు?" – అని ప్రశ్నించారు.

ఆయనలోని ఉత్సాహం చూచి గోపీనాథ్ ఇలా అన్నాడు–

ఇప్పుడు కూర్చొనవచ్చు. గాయాలు ఇంకా అలాగే ఉన్నాయి. వీటిని చూస్తే జనం బాగా ప్రభావితులు అవుతారు."

గోపీనాథ్ చెప్పిన ఈ ఆలోచన అందరికీ నచ్చింది. అయినా మూడు నాలుగు రోజులు ఆగడం అవసరమని అంతా భావించారు. ఆ భవంతి బయట జ్యేష్ఠమాసపు ఎండలో గుడారం వేయడం ప్రమాదరహితం కాదు. ఏమైనా ధర్నాకు సన్నాహాలు చేయడానికి మూడు నాలుగు రోజుల సమయం అవసరం.

ప్రజలకు సమస్యను వివరించడానికి, పోస్టర్లు తయారు చేయడానికి మూడు నాలుగు రోజులు పట్టింది. శ్రీరామ్ ఈ వ్యవస్థ అగ్రభాగాన ఉన్నాడు. సూరజ్‌పాల్ అత్యాచారాలను వర్ణిస్తూ పెద్ద పెద్ద అక్షరాలతో పోస్టరు తయారుచేశాడు. ఆ ఆగడాలను అంతం చేయడం ధర్నా లక్ష్యమని ఆయన ఆ పోస్టరులో వ్రాశాడు. జాగీర్దారు భవంతికి సుమారు 25 అడుగుల దూరంలో చిన్న వేదికను నిర్మించారు. దానికి అచ్ఛాదన ఏర్పరచారు. ధర్నా ప్రారంభమయ్యే రోజున రావలసిందిగా ఆగ్రా నుండి శ్రీకృష్ణదత్త పాలీవాల్‌ను ఆహ్వానించాడు. ఆయన రావడంతో, ఆయనతోపాటు ఇతర నాయకులు కూడా వచ్చారు. ఇలా పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొనడంతో, సూరజ్‌పాల్ ఖంగుతిన్నాడు. గూండాలచేత ధర్నా ఎత్తివేయించడానికి ప్రయత్నిస్తే, ప్రజా వ్యతిరేకత పెల్లుబుకుతుందనే భయం పట్టుకుంది అతడికి. ఆగ్రా నుండి నాయకులు వచ్చారు. పాలీవాల్‌జీ వంటి ప్రాంత

**తేలికగా వచ్చేది తేలికగా పోతుంది**

స్థాయి నాయకుడు కూడా వచ్చారు కనుక, ఎలాంటి బలప్రయోగం జరిపినా, వ్యతిరేక ఫలితాలు వస్తాయని అతడు గ్రహించాడు.

ధర్నా ప్రారంభమైన తర్వాత శ్రీరామ్ వెళ్ళిపోయాడు. రెండు మూడు రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షించడానికి వచ్చేవాడు. ధర్నా సమాచారం పత్రికలలో ప్రచురితం అవుతూ వచ్చింది. ధర్నా స్థలానికి ప్రజల రాకపోకలు పెరిగాయి. సూరజ్‌పాల్ దురాగతాలు అందరికీ తెలిసినవే. కానీ, గతంలో ఎవరు దానిని గురించి చర్చించేవారు కారు. దౌనోరియాజీ గుడారం లోకి ఎవరెవరు వస్తున్నారో, వారు ఏమి మాట్లాడు కుంటున్నారో సూరజ్‌పాల్ తన గూఢచారుల ద్వారా తెలుసు కుంటున్నాడు. ఇలా వచ్చే ప్రతి వార్తతో అతడి అహంకారంపై ఒక్కొక్క దెబ్బ పడుతూ వచ్చింది.

పది పన్నెండు రోజులు గడిచాయి. అతడు శ్రీరామ్‌తో సంప్రదింపులు ప్రారంభించాడు. తాను స్వయంగా ముందుకు రాలేదు. ఒక మధ్యవర్తిని పంపాడు. శ్రీరామ్ ఇలా జవాబు పంపించాడు.

"మీరు స్వయంగా దౌనోరియాజీ వద్దకు వెళ్ళండి. ఆయన చెప్పే మాటలు శ్రద్ధగా వినండి. ఆయనకు సంతృప్తి కలిగేలా జవాబు చెప్పండి."

అలా చేస్తే తన పరువు పోతుందని సూరజ్‌పాల్ భావించాడు. కానీ, గ్రామంలో తనపై తిరుగుబాటు వస్తుందని భయపడ్డాడు. ప్రజల మనస్సులు మారుతున్నాయని తన గూఢచారుల ద్వారా అందుతున్న సమాచారాన్ని బట్టి అతడికి స్పష్టమవుతోంది.

### జాగీర్దారుకు కనువిప్పు

ప్రభుత్వ వర్గాలలోని తన శ్రేయోభిలాషులను అతడు సలహా అడిగాడు. దౌనోరియాజీతో, ఆయన మిత్రులతో రాజీ చేసుకోవడమే విజ్ఞత అని వారు సలహా ఇచ్చారు. రాజీకీ, సంప్రదింపులకు రూపురేఖలు తయారుచేసే బాధ్యత శ్రీరామ్‌కు అప్పగించబడింది. విజయం సాధించినందుకు శ్రీరామ్ దౌనోరియాను అభినందించాడు. ఒక చిన్న సంప్రదింపుల కార్యక్రమం ఏర్పాటు చేశారు. అందులో సూరజ్‌పాల్ దౌనోరియా చేత లస్సీ త్రాగించాడు. ఆయన తన కుమారుడు లాంటివాడని అన్నాడు. ఎలాంటి సహకారం కావాలన్నా నా భవంతి తలుపులు ఎప్పుడు మీకు తెరచే ఉంటాయి అని అన్నాడు.

గతంలో జరిగిన దానికి సూరజ్ పాల్ క్షమాపణ కోరలేదు. కోరతాడని ఎవరూ ఆశించలేదు. సహకారం ఇవ్వడానికి అతడు చేసిన వాగ్దానంలోనే క్షమించమనే భావన ఉన్నది.

ఈ సంఘటన తర్వాత జమీందారు ఆగడాలు దాదాపు అంతమైనాయి. అతడి సాయుధ గూండాల దుశ్చర్యలు కూడా చాలావరకు ఆగిపోయాయి. విజయోత్సవం జరపాలని కొందరు మిత్రులు సూచించారు. శ్రీరామ్ దానిని ఆమోదించ లేదు. "విజయోత్సవం జరపడం వల్ల సూరజ్‌పాల్ అహం దెబ్బతింటుంది. అలా జరగడంలో ఔచిత్యం లేదు. ఒకరిని ఓడించటం మన లక్ష్యం కాదు. న్యాయంతో, శాంతితో కూడిన వాతావరణాన్ని ఏర్పరచడం మన లక్ష్యం. ఆ వాతావరణం ఏర్పడడం ప్రారంభమయింది అది చాలు" ఇది శ్రీరామ్ వ్యక్తం చేసిన అభిప్రాయం.

గత సంవత్సరం ప్రారంభమైన సహాయనిరాకరణ ఉద్యమం ప్రభావం ఇంకా ఉన్నది. 1931లో 'గాంధీ-ఇర్విన్ ఒప్పందం' జరిగింది. ఆ తర్వాత ఉద్యమం దాదాపు నిలిపివేయబడింది. ప్రభుత్వం కూడా దమనచర్యలను వదులుకున్నది. ఎదురు బదురుగా కూర్చుని వ్యవహారాలను పరిష్కరించే మార్గం అవలంభించబడింది. దమన విధానపు చట్టాలు ఉపసంహరిం చబడ్డాయి. హింస, విధ్వంసం ఆరోపణలు ఉన్నవారిని మినహాయించి రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేశారు. ఈ విధంగా ఉద్యమం, అరెస్టుల వేడి తగ్గింది. అయితే సహాయ నిరాకరణవల్ల మేలుకొన్న చైతన్యం ప్రగాఢం అవుతూ వచ్చింది.

### "సైనిక్" పత్రికకు సహకారం

ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొన్న రోజులలో "సైనిక్" పత్రిక విజృంభించింది. ఉద్యమం వార్తలు ప్రచురించే ప్రముఖ మాధ్యమం అది. గాంధీ - ఇర్విన్ ఒప్పందం తర్వాత జాతీయ భావనలపై అంకుశం ప్రయోగించబడలేదు. అయితే, ఉద్యమం మందకొడిగా సాగుతోంది. ఫలితంగా సైనిక్ పత్రిక కూడా కొంత మందగించింది. పాలకుల కోపానికి గురి అవుతామేమో అనే భయంతో కొందరు కార్యకర్తలు పత్రికను వదిలివేశారు. ఈ భయం నిరాధారమైనదే అయినా, సంశయ

**కష్టపడి సంపాదించుకున్న దాని విలువ ఎక్కువ**

గ్రస్తులైన నలుగురైదుగురు పత్రిక వదలి వెళ్ళిపోయారు. వార్తలలో తీవ్రత, సంచలనం తగ్గడంతో, పత్రికలో ఉద్యమ ప్రచారం కూడా కొద్దిగా తగ్గింది.

ఈ పరిస్థితులలో పాలీవాల్‌జీ శ్రీరామ్‌తో ఇలా అన్నారు. "వీలుంటే మీరు కూడా కొద్ది సహకారం అందించండి." ఎలాంటి సహకారం కావాలో అడగడం శ్రీరామ్‌కు అవసరం అనిపించలేదు. అతను "సరే" అన్నాడు. శ్రీరామ్‌ను సంపాదకీయ విభాగంలో నియమించారు. నియామక పత్రాలు, వేతనాదుల నిర్ణయం ఆనాటి పరిపాటి కాదు. కుటుంబంలోని అతిథులు గానో, బంధువులుగానో సంస్థలలో వ్యక్తులను చేర్చుకునేవారు.

శ్రీరామ్ కూడా "సైనిక్" కుటుంబంలో సభ్యుడు అయ్యాడు.

## ఆగ్రాలో నివాసం

ఆవల్‌ఖేడా నుండి ప్రతిరోజు వచ్చి వెళ్ళాలని మొదట్లో ఆలోచించాడు. కొద్దిరోజులు అలా జరిగింది కూడా. అయితే, ఆ తర్వాత ఆగ్రాలోనే బసచేయడం అవసరం అయింది. ఇందుకు తాఈజీ అనుమతి లభించడం లేదు. కనుక, ఆగ్రాకు రోజు వచ్చే క్రమాన్ని కొద్ది సమయం నిలిపివేశాడు. వ్యాసాలు, శాశ్వత ప్రాముఖ్యం కలిగిన వార్తలు, విశేషాలు మున్నగువాటిని ఆవల్‌ఖేడాలోనే తయారుచేసేవాడు. మూడవరోజునో, నాలుగవ రోజునో ఆగ్రా వచ్చి వాటిని ఇచ్చేవాడు. అంతకు ముందు ఇచ్చిన వ్యాసాల ప్రూఫ్‌లు అక్కడే కూర్చుని దిద్దేవాడు, ఇంటికి తిరిగివచ్చేవాడు. శ్రీరామ్ ఇలా వెళ్ళివస్తూ ఉండడం, ఆగ్రాలో ఉద్యమాదులలో తీరికనేది లేకుండా పాల్గొంటూ ఉండడం – ఇదంతా తాఈజీ గమనిస్తున్నది. వారానికి రెండు మారులు శ్రీరామ్ ఆగ్రా తప్పకుండా వెళ్ళివస్తున్నాడు. ఆగ్రాకు మరికొన్ని మారులు వెళ్ళవలసి వచ్చేది కూడా. ఇలా ఆయన తీరికనేది లేకుండా పనిలో నిమ్నగం కావడం చూసి, తాఈజీ ఒక రోజున శ్రీరామ్‌ను తనవద్ద కూర్చోబెట్టుకున్నది. నుదురు చేతితో నిమురుతూ ఇలా అడిగింది.

"బాగా చిక్కిపోయావు. తిండి సయించడం లేదా?"

"అలాంటిదేమీ లేదు. కడుపునిండా తింటున్నాను. రోజంతా పని చేస్తున్నాను. చిక్కిపోతే, ఈ పనంతా ఎలా చేయగలుగు తాను?" అని శ్రీరామ్ జవాబిచ్చాడు. తాఈజీ ఈ జవాబును ఏ మాత్రం పట్టించుకోలేదు. ఆమె ముందుగానే తన మనస్సులో ఏదో ఏర్పాటు నిర్ణయించుకుని కూర్చున్నది. శ్రీరామ్ స్పష్టీకరణను వినకుండా ఆమె ఇలా అన్నది –

"వెళ్ళి రావడంలో చాలా ఇబ్బంది కలుగుతోంది కదూ! నన్ను నేను నచ్చజెప్పుకుంటాను, పాలీవాల్‌జీతోపాటే ఉండు."

"అలాగే" అని శ్రీరామ్ అన్నాడు. తాఈజీ తన కన్నీరు తుడుచుకున్నది. "ఆయన ఇక్కడికి వచ్చినప్పుడు చూసాను. చాలా మంచివ్యక్తి. ఆయనకు చేయూత ఇవ్వు." కొంచం ఆగి ఆమె ఇలా అన్నది.

"మధ్యమధ్యలో ఇక్కడికి వస్తూ ఉండు. వారంలో ఒక రోజు ఇక్కడ తప్పక ఉండాలి."

ఈ నిర్దేశం ఇచ్చిన తర్వాత ఆమె భవంతిలోని గుమాస్తా గారితో ఆగ్రాలో ఏర్పాట్లు చూడమని చెప్పింది. ఏర్పాట్లు ఏమి చేయాలి? తనతోపాటుగా ఉండవలసిందని పాలీవాల్‌జీ ప్రతిపాదించారు. అయినా స్వంతంగా బస ఏర్పాటు చేసుకోవడమే మంచిదని తాఈజీ అభిప్రాయం.

ఆగ్రాలో నివసించడం ప్రారంభించిన తర్వాత, శ్రీరామ్ ఆవల్‌ఖేడాలోని కార్యక్రమాల నాయకత్వాన్ని గోపీనాథ్‌కు అప్పగించాడు. ఏ విషయంలో అయినా సలహా కావలసి వస్తే అతడు "సైనిక్" పత్రిక కార్యాలయానికి రావచ్చు, లేదా తననే ఆవల్‌ఖేడా పిలిపించుకుని మాట్లాడవచ్చు. అదీ ఏర్పాటు. శ్రీరామ్ కలం ఇప్పుడు పాత్రికేయ మార్గం పట్టింది, చదవడంలో, వ్రాయడంలో ఏకాగ్రతతో నిమగ్నం అయ్యాడు. "సైనిక్" అప్పుడు పత్రిక కార్యాలయం మాత్రమే కాదు; స్వరాజ్య సమర సేనానులకు ఆశ్రయ స్థలం కూడా. అక్కడ ఆ సేనానులు సమావేశాలు జరిపేవారు; వ్యూహరచన చేసేవారు; రాత్రి బాగా పొద్దుపోతే అక్కడే నిద్రపోయేవారు కూడా.

*(సశేషం)*


**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి !**


**చదివించండి !!**


**ఇవ్వవలసినది ఇస్తే, పొందవలసినది పొందుతాం**

కుండలినీ మహావిజ్ఞానం-15

# సర్పిణి యొక్క జాగరణ-శక్తి యొక్క ఊర్ధ్వగమనం

షట్చక్రాలను ఆరు సంపదలుగా వర్ణించారు. ఆధ్యాత్మిక భాషలో వాటిని శమం, దమనం, ఉపరతి, తితీక్ష, శ్రద్ధ, సమాధానములుగా చెప్పబడ్డాయి. శమం అంటే శాంతి. శమం అంటే టెన్షన్, ఉద్వేగం, సంతాపం, ఆవేశముల శమనం. దమనం అంటే ఇంద్రియములకు సంబంధించిన ఆవేశముల దమనం. వాటిని నిరోధించకలిగే సామర్థ్యము. ఉపరతి అంటే దుర్గుణాలతో పోరాడగలిగే సాహసము. తితీక్ష అంటే మంచి మార్గంలో వెళ్తున్నప్పుడు ఎదురయ్యే కష్టాలను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యము. శ్రద్ధ అంటే సన్మార్గంలో సత్ప్రయోజనములలో ప్రగాఢ నిష్ఠ, విశ్వాసముల సమన్వయం. సమాధానం అంటే లోభము, వ్యామోహము, గర్వం, తొందరపాటు నుంచి విముక్తి. షట్చక్రముల జాగృతి సాధకుని గుణ కర్మ, స్వభాములను వికసింప చేస్తుంది.



సోమరసము యొక్క సతత ప్రవాహం

షట్చక్ర బేధనము, కుండలినీ శక్తి జాగరణ విజ్ఞానము, విరాట్ బ్రహ్మాండముల – వ్యష్టిగత లఘు పిండముల వియోగాన్ని దూరం చేసి, పరస్పర సంబంధం కలిగేటట్లు చేయగలిగే ప్రఖర పరాక్రమమును జాగృతం చేసే ఒక సర్వాంగ పూర్ణవిద్య.

ఆది శంకరాచార్యుల వారు తమ గ్రంథం "సౌందర్య లహరి"లో చెప్పిన ఎనిమిది సిద్ధులు ఆరు చక్రముల, సహస్రారం అంతరాత్మ జాగరణతో ప్రాప్తిస్తాయి. ఇవి (1) జన్మ సిద్ధి – పూర్వ జన్మల జ్ఞానము (2) శబ్దజ్ఞాన సిద్ధి – చెవులకు వినపడే శబ్దముల వెనుక దాచిపెట్టబడిన ఉద్దేశ్యము (3) శాస్త్ర సిద్ధి – శాస్త్ర వచనముల వాస్తవిక జ్ఞానము (4) సహన శక్తి – కష్టములను, ఆపదలను ఎదుర్కొనగలిగే శక్తి సామర్థ్యములు (5) తాపశక్తి–ఇతరుల తిట్లను, కోపాలను సహించగలిగే సామర్థ్యము (6) శాపశక్తి–వాక్‌శుద్ధి, శాపం లేక వరదానం ఇవ్వగలిగే శక్తి (7) విద్యాశక్తి – ఏ విద్యలయితే ఇతరుల ద్వారా చదువుకుని నేర్చుకోవాలో – అవి తన లోపలి నుండి తెలియుట (intuition) (8) విజ్ఞాన శక్తి – విశ్వ బ్రహ్మాండములోని గుహ్యమైన రహస్యములను తెలుసుకునే సామర్థ్యము.

శంకరాచార్యులవారు తమ కుండలినీ స్తవనంలో భావభరిత శబ్దములలో ఇలా స్తుతించారు – "నేను ఏమీ తెలియని బాలుడిని. నాకు లభించినదంతా నీ అనుగ్రహం అనే పాలు త్రాగడం వల్లనే".


కుండలినీ శక్తి గురించిన వర్ణన అన్య ధర్మాలను అనుసరించే వారు కూడా వర్ణించారు. ఇందులో సూఫీ–భారతీయ దర్శనాలకు దగ్గరగా ఉంటుంది. దారాశికో (షాజహాన్ జ్యేష్ఠ పుత్రుడు) సూఫీ మతాన్ని అనుసరించాడు, ఉపనిషత్తులను బాగా అధ్యయనం చేశాడు. అతను తంత్రం, యోగ గ్రంథములను చదివి వాటిని పారసీ భాషలోనికి అనువదించాడు. ఆయన వ్రాసిన పుస్తకం "రిసాల–ఎ– హుకర్మనామా"లో మూడు కేంద్రముల వర్ణన వస్తుంది. అవి దిల్–ఎ–నీలోఫరి. అవి వస్తుతః బ్రహ్మగ్రంథి, విష్ణుగ్రంథి, రుద్రగ్రంథి. వీటిని సహస్రారం, అనాహతం, మూలాధారములకు సమానమైనవిగా భావించవచ్చు. షేక్ మహమ్మద్ ఇక్బాల్ తన పుస్తకం "ది డెవలప్‌మెంట్ ఆఫ్ మెటా ఫిజిక్స్ ఇన్ పర్షియా" లో వర్ణించిన విషయాలు హిందూ ఆధ్యాత్మికత దర్శనం ఎంతవరకు వ్యాపించాయో, అన్య మతముల వారు కూడా వీటి మీద అధ్యయనం చేశారో తెలుపుతాయి. ఆల్ చిరూనీ అనే విద్వాంసుడు పతంజలి యోగా సూత్రములను, సాంఖ్యా సూత్రములను 11వ శతాబ్దంలో అరబ్బు భాషలోకి అనువదించాడు.

**కష్టపడకుండా ఫలితం రాదు**

టిబెట్టు యొక్క గ్రంథాలలో మానవ శరీరంలోని ప్రముఖ శక్తి కేంద్రాలు మస్తిష్కము, కంఠము, హృదయం, సోలార్ ప్లెక్సస్, జననేంద్రియములలో ఉన్నాయని చెప్పబడ్డాయి. గ్రీకు సాహిత్యంలో కూడా మనుష్య శరీరంలో ఆరు శక్తి కేంద్రాల వర్ణన లభిస్తుంది.

యోగశాస్త్రములలో వర్ణించబడిన చక్రములు, కమలములను శరీర శాస్త్రజ్ఞులు అంతఃస్రావ గ్రంథులుగా (endocrine glands) అటానమిక్ గాంగ్లియగా (auto- nomic ganglia) చెప్పారు. జపాన్ పద్ధతిలో "క్యాసోస్" అనే పేరుతో చెప్పబడ్డ నామములు, రూపములు మన చక్రములు, గ్రంథులతో సరిపోతాయి. సుప్రసిద్ధ మనోవైజ్ఞానికుడు బెంజమిన్ వాకర్ తన పుస్తకం "ఇన్‌సైక్లోపీడియా ఆఫ్ ఈసోటరిక్ మైండ్" లో అంతఃస్రావ గ్రంథుల నుండి వెలువడే రసధారలు, చక్రముల నుండి వెలువడే శక్తి మనుష్యుని ఉన్నతిని పతనములను నిర్ధాయిస్తాయని, గుణకర్మ స్వభావాలకు, వ్యక్తిత్వ నిర్మాణములో మహత్వపూర్ణ భూమిక నిర్వహిస్తాయి'' అని చెప్పారు.

కుండలిని ప్రాణాగ్ని. దీనిలో ప్రాణ కుండం నివురుగప్పిన నిప్పువలె ఉంటుంది. అది ప్రజ్వలింపబడినప్పుడు ఆరు లోకములను భేదన చేస్తూ ఏడవదైన బ్రహ్మలోకములోకి చేరుతుంది. అప్పుడు దాని రూపం బ్రహ్మాగ్నిగా మారుతుంది. ప్రాణాగ్ని శరీరంలోని, మనస్సులోని విశిష్ఠతలను వికసింపచేస్తుంది. సోమరసాన్ని వర్షిస్తుంది. దేవతలు, ఋషులు ఈ సోమరసాన్నే పానం చేస్తారు. బ్రహ్మర్షి గణాలు పరమాత్మలో ఆత్మను హవనం చేసి జీవబ్రహ్మల అద్వైతస్థితిని, ఏకత్వాన్ని స్థాపిస్తారు. ఈ ఆధ్యాత్మిక యజ్ఞం విస్తారపూర్వకంగా వర్ణించబడింది. దానిని ఆత్మయజ్ఞమని పిలువబడింది.



**షట్ చక్రముల జాగరణ - కుండలినీ ఊర్ధ్వగమనం**

ప్రాణాగ్ని శరీరం యొక్క భౌతిక క్షమతలను అంతరాత్మలోని దివ్యవిభూతుల నుండి ఆకర్షిస్తుంది. అమృత రూపమైన సోమరసాన్ని రసాస్వాదన చేస్తుంది, క్షుద్రతను మహానతగా పరివర్తన చేస్తుంది.

కుండలినీ శక్తి, సహస్రారం శివుడు. శివుని శక్తుల సమన్వయంతో రెండు వరదానములు ఉత్పత్తి అవుతాయి. సద్బుద్ధికి అధిష్ఠాన దేవత గణేశుడు, శక్తిపుంజం కార్తికేయుడు. సాధకుడు శరీరాన్ని వైశ్వానర మహామాయతో నిండినట్లు చూస్తాడు. బ్రహ్మరంధ్రంలో దివ్యచేతన యొక్క అజస్ర అనుదానం గంగావతరణ రూపంలో ప్రత్యక్షంగా దర్శనం ఇస్తుంది. వీటి సమన్వయం భూలోకవాసులకు సోమరసంగా, స్వర్గంలో నివసించేవారికి అమృతంగా లభిస్తుంది. ఆధ్యాత్మిక తత్వజ్ఞానంలో సోమరసం, అమృతం ఒకేస్థాయికి చెందిన రెండు పదార్థములుగా భావించబడినాయి.

మస్తిష్కంలో సహస్రారం ఉన్నచోట చూస్తే కపాలం యొక్క ఎముకల మధ్య నిండిన పదార్థం సామాన్యంగా కనిపించినా దాని వాస్తవిక మహిమ, గరిమ చాలా విస్తృతమైనది. దాని యొక్క పెద్ద భాగాన్ని సైలెంట్ లేక డార్క్ ఏరియా (silent or dark area)గా చెప్పబడుతుంది. ఇది మస్తిష్కంలో 87 నుండి 93 శాతం ఉంటుంది. ఈ సైలెంట్ ఏరియాలో కుడి పెరైటల్ కార్టెక్స్ (right parietal cortex), కార్పస్ కలోసమ్ (corpus callosum), లింబిక్ సిస్టమ్ (limbic system) మొదలైనవి ఉన్నాయి. దివ్యశక్తుల కేంద్రములు వీటిలో ఉన్నాయి. మనోవిజ్ఞానవేత్తలు చేతన-అచేతన మాత్రమే పరిశోధించ గలరు. కానీ ఇది సూపర్ చేతనత్వానికి సంబంధించినది. ప్రస్తుతం మనోవిజ్ఞానవేత్తల పరిశోధనల పరిధిలో లేదు.

కుండలినీ యోగము అసలు హఠయోగం లోనికే వస్తుంది. హఠయోగం తంత్రవిద్యకు అతి సమీపంగా ఉంటుంది. దీనితో మోహనం, ఉచ్చాటనం, వశీకరణ మొదలైన విద్యల సహాయంతో ఎవరి పైన అయినా ఆక్రమణ కూడా చెయ్యవచ్చు, వారికి హాని కలిగించవచ్చు.

**కష్టపడి సంపాదించుకున్న సంపద కలకాలం నిలుస్తుంది**

ఇంగ్లాండు యొక్క స్కాట్‌లాండ్ యార్డ్ (scotland yard) సి.ఐ.డి. ఆఫీసర్ రాబర్ట్ ఫేజియన్ ఆఫ్రికాలో ఉన్నప్పుడు అతి భయంకరమైన తాంత్రిక ప్రయోగాలు చూశాడు. వీటిలో కొన్ని ప్రాణఘాతకమైనవి కూడా ఉన్నాయి. వీటిని తన పుస్తకంలో విస్తారపూర్వకంగా వర్ణించాడు.

అందువలన ఈ సాధనలలోని సౌమ్యభాగములు మాత్రమే ఇక్కడ కనిపిస్తాయి. మిగిలినవి రహస్యంగా ఉంచబడ్డాయి. ఇవి అపాత్రుల చేతిలో పడితే అనర్థాలు జరుగుతాయి. డైనమైటుతో కొండలు పగులగొట్టి చదును చేసి ఉపయోగించు కోవచ్చు. దానితోనే విద్యాలయాలను, ఆసుపత్రులను, పెద్ద పెద్ద భవంతులను కూల్చవచ్చు. అందువలనే అనర్థములు జరుగకుండా కొన్ని విధానాలను రహస్యంగా ఉంచవలసి వస్తుంది. సముద్ర మంథనం కథ మనకు పురాణాలలో కనిపిస్తుంది. దేవతలు రాక్షసులు కలసి సముద్ర మంథనం చేస్తారు, ఫలస్వరూపంగా 14 బహుమూల్య రత్నాలు లభించాయి. ఈ కథ కుండలినీ యోగానికి సంబంధించినదే.

కుండలినీ యొక్క యోని గుహ్వరం (గుహ)లో ఒక మట్టి-కుండం (**तल छट-कुण्ड**) ఉన్నది. దీనినే కూర్మం అని అంటారు. మేరుదండమే మందర పర్వతం. ఇడ-పింగళలు కవ్వపు తాడు మంథనం (చిలకడం) వలన శక్తి ఉత్పన్నం అవుతుంది. కామ కౌతుకంలో (సంతోషం) కూడా మంథనం జరుగుతుంది, కుండలినీ యోగంలో ప్రాణమంథనం జరుగుతుంది. దీనిలో నుంచి విషం రావచ్చు, అమృతం కూడా రావచ్చు. ఈ రహస్యమైన విద్యను తాంత్రిక వామాచారంలో ప్రయోగించి ఇతరులకు హాని చేస్తే అది విషమవుతుంది. దానినే ఆత్మకళ్యాణం, విశ్వకళ్యాణం కొరకు ప్రయోగించితే అమృతం అవుతుంది. సజ్జనులు సదుపయోగం చేస్తారు, దుర్జనులు దురుపయోగం చేస్తారు. అందువలన ఆ విధి విధానం మీద ఒక తెర వేసి ఉంచబడింది. ఆ తెరను తీసివేసే విధానాలు కూడా ఉన్నాయి.

నిదురించే సర్పాన్ని మేలుకొల్పితే అది లేపినవానిపై బుస కొడుతుంది. దురుపయోగం చేయడం సర్పాన్ని రెచ్చగొట్టటం వంటిదే. చమత్కారములు చూపించేందుకు, ఎవరిపైన అయినా హాని చేసేందుకు దుర్జనులు దానిని ఉపయోగిస్తారు. సాధకులలో కామోత్తేజన కూడా పెరుగుతుంది, వారు ఆ ఆవేశంతో వ్యభిచారం కూడా చేయవచ్చు.

హెన్రీ ఆస్లే వ్రాసిన "నోట్సు ఆన్ స్పిరిట్యువల్ ఫిజియాలజి (notes on spiritual physiology) లో స్త్రీ పురుషులలో కామోత్తేజన వెన్నెముక చివరి భాగం సాక్రోకాక్సీజియల్ (sacrococcygeal) లో ఉత్పన్నం అవుతుంది. ఈ క్షేత్రం యొక్క శిథిలత పైన లేక ఉత్తేజన పైన కాముకత చాలా వరకు ఆధారపడి ఉంటుంది. ఈ క్షేత్రంలో గడబిడ జరిగితే కాముకత అతిగా ఉండవచ్చు లేక నపుంసకుడుగా అవవచ్చు. అందువల్లనే మూలబంధం, శక్తిచాలిని ముద్ర, వజ్రాసనం, పద్మాసనం మొదలైనవి ఈ క్షేత్రమును సశక్తముగా ఉంచడానికే యోగసాధనలలో ప్రాముఖ్యత ఇచ్చారు. ఈ పద్ధతుల ద్వారా కుండలినీ సాధనలో కుండలినీ ప్రవాహం ఊర్ధ్వగామి అవుతుంది. లేకపోతే అధోగామి అయి ధాతువులను అనవసరంగా పోగొట్టుకుని అల్పాయువులోనే ముసలివానివలె శక్తిహీనుడిగా అవుతాడు.

కుండలిని శబ్దార్థం "చుట్ట చుట్టుకుని కూర్చోవడం" సర్పిణి చుట్ట చుట్టుకుని పడుకుని ఉన్నప్పటికి దాని పడగ ఎత్తుగానే ఉంటుంది. ఇదే దాని అగ్రభాగం. అది పరిగెత్తడం అక్కడే ప్రారంభిస్తుంది. జాగృతం కాగానే అది బ్రహ్మరంధ్రంలోని సహస్రారంతో, మస్తిష్కం యొక్క గ్రే మేటర్ (grey matter) తో, జాగృతి కేంద్రం స్ఫుల్లింగ్‌ల సముదాయం "రెటిక్యులర్ యాక్టివేటింగ్ సిస్టం" (reticular activating system) లోనికి వెళ్ళి అతుక్కుపోతుంది. ఈ విజ్ఞానమే శివాలయాలలో స్థాపించబడిన ప్రతిమలలో చూడవచ్చు. జలం దేనిలో నింపబడి ఉంటుందో అదే కుండలిని. శివుని స్వరూపం కైలాస పర్వతంవలె, స్ఫటికలింగం వలె గోళాకారం కలది. అది పానుపట్టంలో ఉంటుంది.

కుండలినీ జాగరణ యొక్క తాత్పర్యం, మనుష్యుడు అహంకార యొక్క పరిధిని చిన్నది చేసుకోవడం కాదు. నిద్ర మత్తులో కూడా జోగకూడదు. మెలకువతో పనిచేస్తూ సంకీర్ణ స్వార్థపరులను కూడా జాగృతం చేసి సన్మార్గంలో నడిపించ గలగాలి. కుండలినీ సాధనతో సహస్రార కమలంలో ఆసీనుడైన సదాశివుని చేరుకోవడం కొరకు తపన పడాలి. అప్పుడే సాధకుని సాధన సార్థకం అవుతుంది.

*- అఖండజ్యోతి, జనవరి 1987*

**చేటు తెచ్చే చేదు జ్ఞాపకాలలో కుంగిపోకూడదు**

భావసంవేదనల గంగోత్రి-6

# కార్యశూరతకు జనని - సంవేదన

లోపల ఉన్న ఆత్మదేవతను మేల్కొన్న తరువాత ఏదో ఒకటి చేయకుండా ఉండలేము. సాధనములు, సౌకర్యములు లేవు, మేము నిస్సహాయులము, అసమర్థులము అని చెప్పే సాకులన్నీ ఆ దేవత ఒళ్ళు విరుచుకోగానే పారిపోతాయి.

నాజరత్ నివాసి అయిన ఏసుక్రీస్తు వద్ద ఏమున్నది! తండ్రి యూసఫ్ గ్రామములో ఒక మామూలు వడ్రంగి. తల్లి చదువురానిది. పెంపకము గొర్రెలకాపరుల మధ్య జరిగింది. ఆయన పి. హెచ్.డి, డి.లిట్ డిగ్రీలు సంపాదించలేదు. ఆత్మ ప్రకాశ సందేశమును అందించగలిగే గొప్పతనం ఆయనలో ఏముంది? యుగములు గడచినా ఆయన మరుగున పడలేదు. ఆయన వెలుగు విస్తరిస్తున్నది, మరింతగా విస్తరిస్తున్నది. ఎందువల్ల?

ఎన్ని కొరతలు ఉన్నప్పటికీ ఆయనలో కరుణ అనే ఆంతరంగిక సంపద ఉన్నది. అందువలన స్వార్థరాహిత్యము, నిర్లోభము, త్యాగము ఆయన జీవన సహచరులు అయ్యాయి. అదే ఆయన సర్వస్వము. ఆ బలంతోనే ఆయన రోదించే వారి కన్నీరు తుడవడం ప్రారంభించాడు. దుఃఖితుల ముఖాలపై చిరునవ్వులు వెలిగించాడు.

ఒక రోజున ఆయన సముద్రపు ఒడ్డున నడుస్తున్నారు. ఒడ్డున కొందరు చేపలు పట్టేవారు పోట్లాడుకోవడం చూశారు. సంగతి ఏమిటని వారిని అడిగి తగాద కారణము తెలిసికొన్నారు. తగాద రొట్టె గురించి అని తెలిసింది.

"అరే! ఇంతేనా! మీరందరు మీమీ రొట్టెలను ఒకచోట పోగుచేసి, కలిసి తినుట ప్రారంభించండి". అందరు ఆయన చెప్పిన దానికి అంగీకరించారు. రొట్టెల పోగులోనుండి ఒక్కొక్క రొట్టె తీసుకుని తినసాగారు. మధ్యలో ఆయన ప్రేమ పూర్వకముగా వారికి ఇలా నచ్చచెప్పసాగారు – "మన గురించే కాక, ఇతరుల గురించి కూడా శ్రద్ధతీసుకోవాలి. ఆకలిగొన్న ప్రతివారికి రొట్టెపై హక్కు ఉన్నది. కడుపునిండాక కూడా దానిని తన దగ్గర దాచి ఉంచుకోవటం అపరాధము". అందరు తిన్న తరువాత చూస్తే ఇంకా రెండు రొట్టెలు మిగిలినాయి. ఇది ఎలా జరిగింది? అందరికీ ఆశ్చర్యము కలిగింది. ఆయన ఇలా వివరించారు – "వ్యక్తిగత జీవితములో, కుటుంబ–సామాజిక జీవితములో గల సమస్యలకు కారణము నిర్దయ. దాని పరిష్కారము ఒక్కటే సామరస్యము. ఇది లేకపోతే సమస్యల చిక్కుముడి మరింతగా బిగుసుకుంటుంది. విప్పే మార్గమే ఉండదు." అందరు ఆ మాట ఒప్పుకున్నారు. వీరే క్రీస్తుకు మొదటి శిష్యులు.

ఆయన ఉపదేశముల, ఆయన చూపిన అద్భుతముల ఖ్యాతి పెరుగసాగాయి. అది ఎంత బాగా వ్యాప్తి అయిందంటే ఆయన శవానికి ప్రాణం పోస్తారు అని చెప్పుకోసాగారు. ఈ మాటలో నిజమున్నది. ఆయనవద్ద సంవేదనలతో నిండిన అమృతకలశము ఉన్నది. గుండెలోతులను సూటిగా తాకి మాటలద్వారా ఆయన ఆ అమృతాన్ని చల్లి మనుషులకు జీవం పోసేవారు.

ఒక ధనిక యువకుడు ఒకసారి ఏసుక్రీస్తును ఇలా అడిగాడు "ప్రభూ! స్వర్గరాజ్యం పొందటానికి ఏమి చేయాలి?" అప్పుడు ఏసుక్రీస్తు ఇలా పలికాడు – "పవిత్ర ఆత్మ నీలో దిగలేదు. జీవితావసర వస్తువులను తప్ప మిగిలిన సంపదనంతటనీ అమ్మివేయి. లభించిన ధనముతో ప్రతివ్యక్తిలో ఉన్న దుఖాన్ని దూరంచెయ్యి. నీ లోపల, బయట స్వర్గరాజ్యము ప్రకటితమవుతుంది". ధనిక యువకుడు ఇదంతా విని దిగులు చెంది, దుఃఖముతో వెళ్ళిపోయాడు. తన అపారమైన సంపదపై వ్యామోహమును అతడు వదలలేకపోయాడు. ఏసుక్రీస్తు అది విని నవ్వుతూ అందరితో ఇలా పలికాడు. సూది రంధ్రములో నుండి ఒంటె దూరగలగవచ్చు, కానీ ధనాన్ని కూడబెట్టేవాడు స్వర్గంలో ప్రవేశము పొందలేడు."

ఒకసారి ఏసుక్రీస్తు భయపడుతూ బ్రతుకుతున్న జనులు గల గ్రామమునకు వెళ్ళాడు. వారు భయంభయంగా ఏదోవిధముగా జీవితము వెళ్ళదీస్తున్నారు. అడిగితే వివరాలు తెలిసాయి. జేకస్ అనే క్రూరుడు ఉన్నాడు. సారాయి దుకాణము నడుపుట వాడి పని. పేదలను, కూలీలను మొదట సారా త్రాగటానికి ప్రోత్సహించి తరువాత వారిని కొట్టి, తన్ని డబ్బు వసూలు చేయటము అతని అలవాటు.

దుర్వ్యసనాల వలలో చిక్కుకున్నవారి వద్ద పెట్టుబడి ఎక్కడిది? ఒకవేళ ఉన్నా అది మెల్లిమెల్లిగా ఖాళీ అవుతుంది. పేదవానికి అది అలవాటయితే అతని కుటుంబములో శాంతి నశించి పోతుంది. కుటుంబసభ్యులను ఆకలిదప్పులలో వదలి, వ్యసనాలలో ధనాన్ని, శారీరిక శక్తిని వృథా చేసుకుంటాడు. జేకస్ అలాంటివారికి అప్పులు ఇచ్చి మరల నిర్దయగా వసూలు చేసుకునేవాడు. అంతేకాక చక్రవర్తి అతనికి పన్నులు వసూలు

**మేలు చేసే తీపి జ్ఞాపకాలతో పొంగిపోవచ్చు**

చేసే పని అప్పగించాడు. పన్నులు వసూలుచేయు సమయములో అతని రూపమే మారిపోతుంది. అతను కొరడా ఝళిపించుట చూసి జనులు ఇంట్లోకి పోయి దాక్కునేవారు. పొలాలలోకి, అడవులలోకి పారిపోతుండేవారు. పట్టుబడినవారు యమ యాతనలను భరించవలసివచ్చేది.

కథంతా విని ఏసుక్రీస్తు తన దగ్గర ఉన్న శిష్యులవైపు చూసి ఇలా పలికాడు. – "ఒకే ఒక్క నిర్దయ వందలమందిని హింసించు చున్నది. విషయం అంతటితో ఆగటం లేదు. వ్యసనపరులు తమ భార్యాబిడ్డల జీవితమును నరకముగా తయారుచేస్తున్నారు. దీనికి ఒకేఒక పరిష్కారము ఉన్నది. అతడిలో ఎలాగోలా మంచితనాన్ని నింపాలి."

"కానీ, ఎలా?" శిష్యులు అడిగారు.

"నేను స్వయముగా జేకస్ ఇంటికిపోయి, అతనిలో నిద్రించిన, వాడిపోయి ముడుచుకుని పోయిన మానవతా సంవేదనను మేల్కొల్పుతాను."

"తమరా!" అందరూ కళ్ళు పెద్దవి చేసి ఆయనవైపు చూసారు.

"నేను కాకపోతే ఇంకెవరు?..."

ఎవరి వద్దా సమాధానం లేదు.

జేకస్‌కు ఆయన గురించి తెలిసింది. అతడు వెంటనే అడవి వైపుకి వెళ్ళే కార్యక్రమము తయారు చేసుకున్నాడు. అతడికి క్రీస్తును కలవటం ఇష్టం లేదు. అయస్కాంతం వంటి ఆయన వ్యక్తిత్వాన్ని గురించి అతడు ఇప్పటికే విన్నాడు. ఏసుక్రీస్తు అతని ఇంటికి వెళ్ళేసరికి అతడు అడవి వైపు వెళ్ళాడని తెలిసింది. ఏసుక్రీస్తు ఎందుకు వదులుతాడు? ఆయనా బయలుదేరాడు. అతనిని వెతుకుతూ అతను ఉన్నచోటికి వెళ్ళాడు. అతడు ఆయనను చూసి చాలా కంగారుపడ్డాడు. ఆయన అతనిని హృదయానికి హత్తుకున్నపుడు అతని కంగారు చరమదశకు చేరింది. అతడు నిశ్చేష్టుడు అయ్యాడు. ఆయన అతనిని చెట్టు నీడలో కూర్చోబెట్టి అతని క్రూరత్వాన్ని ఎంత కరుణరస భరితముగా వర్ణించారంటే – అతడి నిర్దయ కరిగిపోయింది. అతనితో ఆయన ఇలా అన్నాడు. – "కాస్త నీవు ఊహించిచూడు. ఇదే దురవస్థ నీకు, నీ స్వజనులకు చుట్టుకుంటే నీకు ఎలా ఉంటుంది?"

క్రీస్తు రెప్ప వేయకుండా అతని కళ్ళలోకి చూస్తూ ఉన్నారు. జేకస్ కళ్ళు దించేసుకున్నాడు. కొద్ది క్షణాల తరువాత అతడు తన మౌనాన్ని విడచి ఇలా అన్నాడు–"ప్రభూ! ఇప్పటి వరకు నేను గ్రుడ్డివాడిని. మీరు నాకు దృష్టిని ప్రసాదించారు. నేను ఎప్పుడూ ఈ విధంగా ఆలోచించలేదు. ఈనాటి నుండి మీరు చెప్పినదే చేస్తాను. నా సంపాదన అంతా దరిద్రనారాయణుని సేవకు అర్పిస్తాను."

అసాధారణము, అద్భుతము! చెట్టు చాటున దాగి ఉన్న శిష్యులు ఇదంతా చూసి దిగ్భ్రమ చెందారు. చాటు నుండి బయటకు వచ్చి యేసుక్రీస్తును ఆశ్చర్యచకితులై ఇలా అడిగారు – "ప్రభూ! ఈ అద్భుతం ఎలా జరిగింది?" ఆయన చిరునవ్వు నవ్వుతూ ఇలా పలికిరి – "పవిత్ర ఆత్మ అవతరణ ద్వారా. ఈ 'హోలీ ఘోష్టు' మరొకటి కాదు. జాగృతమైన భావ సంవేదనలు. అవి కొందరిలో క్రియాశీలంగా ఉంటాయి కొందరిలో మొద్దుబారి ఉంటాయి. మూర్ఛపోయి ఉంటాయి. మేల్కొనిన ఆత్మల బాధ్యత ఇతరులను మేల్కొల్పడము."

ఇలా చెప్పి ఆయన అతనిచేత శిలువ ధరింపజేశాడు. దాని రహస్యాన్ని తెలుపుతూ ఆయన ఇలా అన్నారు – "హృదయంపై వ్రేలాడుతున్న ఈ శిలువ ఆ హృదయం ఆదర్శ భావాలతో పూర్తిగా నిండి ఉన్నది అనే విషయాన్ని సూచిస్తుంది. అంతేగాక మేము దీనికోసం చావడానికి, శిలువ బాధ ఓర్చుకొనుటకు నవ్వుతూ నవ్వుతూ సిద్ధంగా ఉన్నాము అనే భావాన్ని కూడా సూచిస్తుంది."

తరువాత ఆయన స్వయముగా ఆ బాధను సహించాడు. శిలువపై వ్రేలాడాడు. ఆ ఈశ్వరపుత్రుడు ఇలా అన్నాడు – "మేము స్వయంగా ఈ కష్టాన్ని ఓర్చుకుంటున్నాము, మీరంతా జీవించి ఉండడానికి. మీరు మీ నిర్దయను వదలివేసినప్పుడే నా జీవన ఆహుతికి సార్థకత." ఆయన ఇంకా అన్నాడు – "ఎవరు తమ స్వార్థము కొరకు జీవిస్తారో వారు దానిని కోల్పోతారు. ఎవరు నాకొరకు తమ జీవితాన్ని త్యాగం చేస్తారో వారు దానిని పొందుతారు." మానవతా స్పందనను తన జీవితములో నిలుపుకున్న యేసుక్రీస్తు మరణించలేదు. సూక్ష్మరూపమునుండి విరాట్ స్వరూపుడు అయినాడు. ప్రపంచములోని 2/3 వంతు మంది ప్రజలకు ప్రభువుగా విరాజిల్లుతున్నాడు.

మన అంతరంగపు లోతులలో కూడా ఆయన దాగి ఉన్నాడు. ఆయన బయటకు రావాలి అంటే పొరుగువారి బాధ మన బాధ కావాలి. ఎదుటివారి కష్టం మన మనస్సును బాధిస్తే మనం ఈశ్వరునితో ఐక్యం కాబోతున్నట్లు భావించాలి. భగవంతుడు ఎప్పుడు వచ్చినా వేదనగా మారి వస్తాడు. లోపల బయట మనతో ఏకం కావాలని ఆయన ఆతురత చెందుతున్నాడు. మరి ఆయన ఎలా ప్రవేశించాలి? ప్రవేశము నిషిద్ధము అని మనము బోర్డు పెట్టుకున్నాము కదా! ప్రవేశము నిషిద్ధము అనే బోర్డు మరేమీ కాదు–నిర్దయ. అది తొలగిపోగానే జీవితమంతా స్వర్గపు వెలుగుతో నిండిపోతుంది.

*– అనువాదం: డి.వి.ఆర్. మూర్తి*

**ఎప్పుడు ఎవరితో అవసరం పడుతుందో తెలియదు**

## జీవన దేవత సాధన, ఆరాధన - 4

# ప్రజ్ఞాయోగం

పదార్థం కంటే శరీరం, శరీరం కంటే ఆత్మ మహత్తరమైనవి. ఇదేవిధంగా – సమృద్ధి, సంపన్నతల స్థాయి; ప్రగతి, యోగ్యతల స్థాయి, ఆత్మిక ప్రచండత, ప్రతిభల స్థాయి ఒకదాని కంటే ఒకటి ఉన్నతమైన మెట్లపై ఉన్నాయి. అంతర్గత విశ్వాసాలే వ్యక్తి ఆలోచన, శీలం, వ్యవహారాలను సంస్కరిస్తాయి; వ్యక్తిత్వాన్ని ప్రచండం, ప్రామాణికం, ప్రతిభావితం చేస్తాయి; అనేక సాఫల్యధారలకు జన్మనిస్తాయి.

ఆత్మబలం ఆధారంగా అన్ని ఇతర శక్తులను అందుకొన వచ్చు; లభించిన వాటిని సదుపయోగపరచవచ్చు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ, వ్యక్తిత్వ ఉత్కృష్టత ఆధారంగా వాటిని అనుకూలంగా మార్చుకొనవచ్చు. ప్రపంచ చరిత్రలో లెక్కలేనంతమంది వ్యక్తుల ప్రారంభ పరిస్థితి నికృష్టంగా ఉండేది. జరుగుబాటు తక్కువగా ఉండేది. ప్రగతి సాధనాలను సమకూర్చుకోవడం ఇంకా కష్టంగా, దాదాపు అసంభవంగా కనిపించేది. అయినా, వారు తమ వ్యక్తిత్వంలోని నిజాయితీపై ఆధారపడి అందరిచే విశ్వసించబడి, ఆకర్షించబడ్డారు. తమ ఆకర్షణతో వ్యక్తులను, సాధనాలను పరిస్థితులను అనుకూలంగా మార్చుకున్నారు. వారు తమ పురుషార్థంతోపాటు ఆ సద్భావాన్ని కలబోసుకున్నారు, ఉన్నతమైన స్థాయికి చేరుకున్నారు, చివరకు సాఫల్య శిఖరాగ్రాన్ని చేరుకున్నారు. ఇదంతా వ్యక్తిత్వ ఉత్కృష్టత ఫలితమే. ఇదంతా ఆత్మబలం చేసిన అద్భుతం.

మరోప్రక్క – అన్ని అనుకూలతలు ఉన్నప్పటికీ కొంత మంది తమ దుర్బుద్ధి కారణంగా రోజురోజుకు నష్టపోయి దిగజారిపోయిన సందర్భాలు కనిపిస్తాయి. పూర్వీకులు సంపాదించిన ధనాన్ని వారు దుర్వ్యసనాలలో పాడు చేసుకున్నారు. సోమరితనం, నిర్లక్ష్యాలలో చిక్కుకొని తమ శక్తులను, సంపదలను నాశనం చేసుకున్నారు. ఎన్నో అనాచారాలకు బానిసలై, వారు దుర్గతిని అనుభవించవలసి వచ్చింది. ఇలా వారి మానసిక గుణ, కర్మ స్వభావాలలోని నికృష్టత వలన అనేక సౌకర్యాలున్నప్పటికీ వాటిని అన్నింటిని కోల్పోయారు.

చైతన్యం యొక్క శక్తి అన్నింటికంటే గొప్పది. మనిషే రైలు, ఓడలు, పరిశ్రమలు నిర్మించాడు. విజ్ఞానం నిత్యం కొత్త ఆవిష్కరణలను చేస్తూ ఉన్నది. మతం, దర్శనం, ఆచారాలు, ఆలోచనలు కూడా మనిషి చేతనే నిర్మించబడినాయి. భగవంతునికి సాకారరూపాన్ని కల్పించటం, స్థాపించడం అతని బుద్ధి కౌశల్యమే. అనాగరికమైన ఈ ధరాతలాన్ని సౌకర్యాలతో, సౌందర్యాలతో, వస్తువులతో నింపింది మనిషే. ఇక్కడ 'మనిషి' అంటే శరీరం కానీ, వైభవం కానీ కాదు. విశేషతలు చైతన్యంతో కలిసి ఉంటాయి. వీటిని ప్రయత్నంతో పెంచుకోవచ్చు. శరీరాన్ని బలిష్టంగా కానీ, దుర్బలంగా కానీ, తయారు చేసుకోవడం తరచు మనిషి అనుసరించే విధి- విధానాలపై ఆధారపడి ఉంటుంది. మనిషి సంపన్నుడు కావడం, బీదవాడు కావడం అతని చేసే పనుల వల్లనే. అభివృద్ధి, పతనం చేతల ద్వారానే జరుగుతాయి. మనిషి తన అదృష్టాన్ని తానే నిర్మించుకుంటాడు. ఇక్కడ మనిషి అనగా ఆత్మచైతన్యమే. అదే ప్రగతిశీలతకు పుట్టిల్లు. ఆ క్షేత్రంలోనే పతన, పరాభవాల యొక్క విషబీజాలు నాటుకుంటాయి. సద్గుణవంతులు లేమిలో కూడా సుఖ, శాంతుల వాతావరణాన్ని ఏర్పరచుకుంటారు. అంతఃచేతన సమున్నతమైనప్పుడు పూర్తి వాతావరణం, చుట్టూ ఉన్న ప్రపంచం సుఖం, శాంతులతో నిండి ఉంటాయి. దోష దుర్గుణాలతో నిండిన మనస్సు కలవారు మంచి పరిస్థితులలో కూడా దుర్గతి, పతనాల కఠోర దుఃఖాన్ని అనుభవిస్తారు.

వైభవాన్ని పొందటానికి అనేక పద్ధతులను నేర్చుకోవడం, నేర్పడం జరుగుతుంది. శరీరాన్ని రోగరహితం చేయడానికి వ్యాయామశాలలు, ఆరోగ్య కేంద్రాల నుండి ఆసుపత్రుల వరకు అనేక వ్యవస్థలను చూస్తాము. ఇందుకోసమై విద్య, పారిశ్రామిక, వైజ్ఞానిక, పాలనా వ్యవస్థలు అనేకం ఉన్నాయి. కానీ చైతన్యాన్ని సంస్కరించి వికసింపచేయడానికి సార్థకం, సమర్థవంతం, సర్వోపయోగకరం అయిన ఆధారాలను నిర్మించే వ్యవస్థలు అరుదు.

ప్రజ్ఞాయోగం ఇటువంటి ఒక విద్య. దీనిని వ్యావహారిక భాషలో "జీవన సాధన" అని అనవచ్చు. దీనిలో జపం,

**అందరితో మంచిగా ఉండటం ఎప్పటికైనా మంచిది**

ధ్యానం, ప్రాణాయామం, సంయమనం వంటి విధానముల వ్యవస్థ ఉన్నది. కానీ ఇది అంతవరకే పరిమితం కాదు. ధ్యాన ధారణ స్థాయిలోని అన్ని కర్మకాండలు ఉపాసనలో వచ్చేస్తాయి. దీనితోపాటు జీవితంలోని ప్రతిరంగంలో మానవ ప్రతిభను పెంపొందించే, అడ్డంకులను తొలగించే అన్ని ప్రక్రియలు కలిపి ఉంచబడ్డాయి. శరీరసంయమనం, సమయసంయమనం, అర్థసంయమనం, ఆలోచనా సంయమనం దీనిలో అంతర్భాగాలే. దుర్గుణాలను, కుసంస్కారాలను వదిలించుకోవడానికి ఇందులో ప్రాధాన్యం ఇస్తారు. భవిష్యత్తులో అధిక వివేకవంతులు, శీలవంతులు, పురుషార్థ పరాయణులు తయారుకావడానికై ఆలోచనను, అభ్యాసాన్ని అందించడం ఇందులో అనివార్యం. నిజానికి ఈ సమగ్రతయే జీవన సాధనలోని విశేషం. కర్తవ్య రంగంలో ధార్మికత, విశ్వాసరంగంలో ఆత్మపరాయణత, ఆధ్యాత్మిక రంగంలో దూరదృష్టిని, వివేకశీలతను, ఉత్కృష్ట ఆదర్శవాదాన్ని అలవరచుకో వలసిందని సాధకునకు చెప్తారు. సర్వతోముఖమైన ఈ ప్రక్రియలలో సముచితమైన జాగరూకతను పాటించడం ద్వారానే ఆత్మసంస్కరణ లభిస్తుంది. ఇది ప్రతి ఒక్కరికీ సరళమైనది, సాధ్యమైనది, సహజమైనది.

ఆత్మసంస్కరణకు ఇతర మార్గాలు ఉండవచ్చు. కాని ప్రజ్ఞా యోగం అన్నిటికంటే తేలిక, హేతుబద్ధం, వ్యవస్థితం అయినది. అభ్యాసంతో పొందిన పలువురి అనుభవం ఈ వాస్తవాన్ని బలపరుస్తోంది.

ఆత్మిక ప్రగతి ప్రాముఖ్యతను మనం అర్థం చేసుకోవాలి. ఒక వ్యక్తి లేదా దేశం యొక్క ఉన్నతి సంపద, విద్య, నైపుణ్యం మొదలైన వాటి వరకే పరిమితం కాదు. శిష్టాచారంతో నిండిన వ్యక్తిత్వమే దాని పుట్టిల్లు. దాని ఆధారంపైనే పలువిధములైన ప్రగతి సాధ్యపడుతుంది; వివిధ వ్యవస్థలు శ్రేష్ఠంగా తయారవుతాయి. సమర్థతకు కేంద్రబిందువు ఇదే. ఈ ఒక్క మహిమ ఆధారంగా ప్రయోజనకరమైన ఏ దిశలో అయినా ముందు ఉండవచ్చు. ఆత్మబలం లోపించినప్పుడు సంకుచిత స్వార్థపరత్వం ఆవరిస్తుంది; లోకోపకరమైన, ఆదర్శవంతమైన గొప్ప ప్రయోజనాలను సాధించలేము. ఈ లోకోక్తి దీనికి పూర్తిగా వర్తిస్తుంది: "**ఏకై సాధే సబ్ సధే, సబ్ సాధే సబ్ జాయ్.**" అనగా – ఏదైనా ఒక్కటి సాధిస్తే అన్నీ సాధించగలము; అన్నీ ఒకేసారి సాధించాలంటే ఏదీ సాధించలేము.

అనేక రకాలైన శక్తియుక్తులను, విశేషతలను సంపాదించిన వ్యక్తి తన నైపుణ్యం బలంతో సంపదను సమకూర్చుకొనవచ్చు. చౌకబారు పొగడ్తలు కూడా పొందవచ్చు. కానీ, మానవ ప్రతిభ అనే గీటురాయిపై అంతా డొల్ల అని తేలుతుంది. నకిలీ నాణెపు మెరుపు ఎవరినైనా భ్రమలో ఉంచగలుగుతుంది. కానీ సభ్య, సుసంస్కృత, సజ్జన, సమున్నత అనే పదాలకు అర్హుడైన మహామానవుడు మాత్రమే సునిశ్చితమైన ప్రగతిని సాధించ గలుగుతాడు.

సంత్ పరంపరకు చెందిన అనేకమంది మహాపురుషులు, లోకోపకారులు, యుగనిర్మాతలు సాధించిన ప్రబల పురుషార్థాలకు ప్రముఖ కారణం వారి ఆంతరిక ఉత్కృష్టతే. దాని ఆధారంతోనే వారు నిజజీవితంలో ఆత్మసంతోషం, లోకంలో గౌరవం, దైవీఅనుగ్రహం నిరంతరం వర్షిస్తున్న అనుభూతిని పొందుతారు; తమ వ్యక్తిత్వం రూపంలో, తమ కార్యశూరత రూపంలో వారు పతనమైనవారిని ఉద్ధరించడానికి, ఉన్నతులను మరింత ఉన్నతులుగా చేయడానికి అనుకరించ దగిన ఉదాహరణలను భావితరాల వారికి వదలివెళ్తారు. జీవన లక్ష్యాన్ని సాధించడం అంటే ఇదే. జీవనసార్థక్యం ఇదే. ప్రజ్ఞాయోగం అనే జీవనసాధన మహత్తరమైన ఈ ప్రయోజనాన్ని నెరవేర్చుతుంది.

*– అనువాదం: ఊటుకూరి సత్యనారాయణ గుప్త*

## కీర్తి కాంక్ష

*నిస్వార్థ సమాజసేవ గురించి అదే పనిగా చెప్పే వ్యక్తి కొద్దిపాటి సేవచేసే వ్యక్తి దగ్గర తన గొప్పదనాన్ని ప్రదర్శించుకుంటూ అన్నాడు – "నేను సమాజం కోసం చాలా చాలా చేశాను. కానీ ప్రతిఫలంగా ఏమీ కోరను. ఆఖరుకు కీర్తిని కూడా కోరను."*

*ఆయన చెప్పటం పూర్తి కాగానే ఒక కాగితం తెచ్చి చూపారు. దాని మీద ఈక్రింది విధంగా వ్రాయబడి ఉంది.*

*"నిజంగా మీరు చెప్పిన మాటల్లో కీర్తికాంక్ష లేదా? ప్రజల మనస్సుల్లో నిస్వార్థ సేవకునిగా ముద్రింపబడాలని లేదా?" ఆ ప్రశ్న పత్రానికి జవాబు ఎలా ఇవ్వాలో తెలియక ఆ వ్యక్తి మౌనం వహించాడు.*

*అనువాదం: పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**ఇతరులు చేసిన ఉపకారాన్ని ఎన్నడూ మరువకూడదు**

# పరమాత్మ చేతిలో యంత్రాలుగా మారాలి

**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ (గీత 11.33)**

*అర్థం:* శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడితో, "సవ్యసాచి! నీవు నిమిత్తమాత్రుడివి కమ్ము" అన్నాడు. నిమిత్తమాత్రుడిగా పని చేయడమంటే నిస్వార్థంగా, నిష్కామ భావంతో పనులు చేయడం; ప్రముఖమైన, గొప్ప పనుల కోసం జీవితాన్ని ధారపోయడం. ఆ పనులన్నింటికీ భగవంతుడే కర్త అని గుర్తించాలి. తనని తాను ఆ భగవంతుడి శక్తికి వాహకుడిగా భావించాలే తప్ప కర్తగా కాదు. మనం శరీరం ద్వారా పనులు చేస్తామే తప్ప శరీరం తనంతట తాను ఏ పనిచేయదు, దానికి ఆదేశాన్ని ఇస్తే అప్పుడది పాటిస్తుంది అంతే. అదేవిధంగా భగవంతుడి ప్రేరణను పొందినప్పుడు, తన మాధ్యమంగా వారి పని చేసినప్పుడు, అప్పుడు మాత్రమే అతను భగవంతుని పనులకు నిమిత్తమాత్రుడు కాగలడు.



వ్యక్తి కర్తగా ఏదైనా పనిచేస్తే అప్పుడు అతనిలో అహంకారం అంకురిస్తుంది. అతను పని పూర్తి చేయడానికి, తనకు కావలసిన ఫలితం పొందటానికి పూర్తి బాధ్యత తన నెత్తిమీద వేసుకుంటాడు. పనికి కర్తగా ఉండడం వల్ల, అహం మేల్కోడం వల్ల, "నేను" అనే భావం రావడం వల్ల వ్యక్తి తన చుట్టూ గిరిగీసుకుని అందులోనే చిక్కుకుంటాడు.

అహంకారమే వ్యక్తికీ, భగవంతుడికీ మధ్యనుండే తెర. అహంకారభావం రాగానే వ్యక్తి ప్రాపంచిక పరిధిలో ఇరుక్కుంటాడు, అతని శక్తిసామర్థ్యాలకు కూడా హద్దులు ఏర్పడతాయి. అనంతశక్తిని పొందగలిగే యోగ్యత లభించదు. దానితో అహంకారం రాగానే ప్రగతికి తలుపులు మూసుకు పోతాయి. జీవితంలో నికృష్టత మిగిలిపోతుంది. వ్యక్తిలో క్షుద్రత తలెత్తుతుంది. జీవితాంతం అలాగే గడపవలసి వస్తుంది.

అహంకారం వల్ల మనిషిలో అన్ని దుర్గుణాలు ఒక దాని తరువాత ఒకటి వచ్చి చేరుతుంటాయి. స్వార్థంతో కూపస్థ మండూకం (నూతిలో కప్ప)లాగా తన సరిహద్దులు తానే ఏర్పర్చుకుంటాడు.

అహంకారి చూడడానికి శక్తిమంతుడిగా కనిపించినా అతని వ్యవహారంలో గర్వం, పొగరు స్పష్టంగా కనిపిస్తాయి. నిజానికి అతను బలహీనుడు. ఎందుకంటే అహంకారం మాటిమాటికీ అతనిని గాయ పరుస్తుంది. అవమాన భారంతో, కోపం వల్ల, తనతో తానే గొడవ పడుతుంటాడు. ప్రపంచంలో అందరు ఎంతోకొంత అహంకారాన్ని పోషిస్తుంటారు. అయితే అహం కారానికి ఉన్న లక్షణం ఏమిటంటే ఇతరుల అహంకారాన్ని సహించలేదు. అందుకే మనుష్యులలో తగాదాలు ఏర్పడుతుంటాయి, ఎవరికి వారు తానే గొప్ప అని నిరూపించు కోడానికి దెబ్బలాడుతుంటారు. నిజానికి అహంకారం ఎక్కువ ఉండడం గొప్పతనం కాదు, గొప్ప వ్యక్తిత్వం ఉన్నవాళ్ళే శ్రేష్టులు. అనంతమైన శక్తి, విభూతులు, ప్రతిభతో పాటు ఎవరి వ్యవహారంలో వినమ్రత ఉట్టిపడుతుందో వారే అందరికన్నా శ్రేష్టులు.

వినమ్రత అంటే స్వీకరించడం, తలవంచి నమస్కరించడం. పేరులోనే అందులోని కోమలత్వం, మృదుత్వం, సమర్పణ స్పష్టంగా కనిపిస్తుంది. పళ్ళతో నిండిన చెట్టు వంగి ఉంటుందే కాని తిన్నగా ఉండదు. పళ్ళతో నిండడం అంటే సద్గుణాలతో అలంకరింపబడడం. అంటే సద్గుణాలను ఉన్న వ్యక్తి వినమ్రంగా ఉంటాడు. బలము, విభూతులు, సామర్థ్యంతోపాటు వినమ్రంగా ఉండే వ్యక్తి మట్టిలో మాణిక్యంలాంటివాడు.

**ఇతరులకు నచ్చేటట్లు మాట్లాడాలి**

అంతటి అమూల్యమైన వ్యక్తిత్వం కలిగిన మనిషిని అందరూ ఆదరిస్తారు. అలాంటి వారికి ఎవరైనా, ఏదైనా ఇవ్వడానికి సిద్ధపడతారు. ఎందుకంటే వినమ్రత మనిషిలో పాత్రతను వికసింపచేస్తుంది. పాత్రత ఉన్న వ్యక్తికి ఎవరు ఏదీ ఇవ్వక పోయినా అతనికి స్వతహాగా అన్నీ లభిస్తూ ఉంటాయి.

వినమ్రత మనిషికి పాత్రతనే కాదు, అతని వ్యక్తిత్వాన్ని కూడా ఎంతో ఆకర్షణీయంగా తయారుచేస్తుంది. దానితో సద్గుణాలు, ప్రత్యేకతలు అన్నీ వాటంతటవే అతని వశం అవుతాయి. వినమ్రుడైన వ్యక్తి యొక్క వ్యక్తిత్వం నిరంతరం గ్రహణశీలంగా, సకారాత్మకంగా ఉంటుంది. కానీ అహంకారి యొక్క వ్యక్తిత్వం ఒక బండరాయి లాంటిది. రాయి లోపలికి నీటి చుక్క కూడా చేరలేదు, పైగా రాయి మీద పడగానే ఆ నీటి చుక్క పక్కకి రాలిపోతుంది. నీటి ప్రవాహం ఎక్కువైతే బండరాయి కూడా ముక్కలైపోవచ్చు. అహంకారి జీవితంలో కూడా చాలాసార్లు అహంకారం దెబ్బ తింటుంటుంది. చివరికి తన అస్తిత్వాన్ని కూడా కోల్పోతాడు.

వేణువు లోపల డొల్లగా ఉంటుంది. దానిలో గాలి ఊదితే, మధుర ధ్వని వినిపిస్తుంది. ఆ ధ్వని మనస్సును పరవశింప చేస్తుంది. అదే విధంగా వినమ్రతతో మనిషి భగవంతుని విరాట్ అస్తిత్వాన్ని స్వీకరించి, తన సర్వస్వం అర్పించి భగవంతుని చేతిలో యంత్రంగా మారితే మధురమైన స్వరాలు వాటంతటవే పలుకుతాయి, వారి ద్వారా ఏ పని చేసినా అత్యుత్తమంగా ఉంటుంది. వేణువులాగానే అతను తన జీవితాన్ని నిమిత్త మాత్రంగా మార్చుకుంటాడు. భగవంతుని చేతిలో యంత్రంగా మారతాడు, భగవంతుడు స్వయంగా అతని ద్వారా పనులు చేసుకుంటాడు.

ఈ ప్రపంచంలో ఎందరో మహాపురుషులు పరమాత్మ చేతిలో యంత్రాలుగా మారారు. వారి జీవితాలను ఆయన పనుల నిమిత్తం సమర్పించుకున్నారు. శ్రీరామ భక్తుడైన హనుమంతుడి జీవితం అటువంటిదే. అత్యంత బలశాలి, విద్వాంసుడు, గుణవంతుడు అయినప్పటికీ శ్రీరాముడు చెప్పినట్టే చేసేవాడు. ఆజ్ఞాపరుడు, వినమ్రుడు, ధైర్యశాలి. ఆయన దారిని ఏ ఇబ్బందీ అడ్డుకోలేదు.

తులసీదాసు తన జీవితాన్ని భగవంతునికి అర్పించాక రామచరిత మానసం రచించబడింది. ఇది లెక్కలేనన్ని ప్రత్యేకతలున్న అద్భుత గ్రంథం, మహాకావ్యం. సామాన్యులెవరు ఈవిధంగా రాయలేరు. దైవకృపతోనే ఇది రాయబడింది, ఆ దైవం చేతిలో తులసీదాసు కలంగా మారాడు.

అదే విధంగా సూరదాసు, రైదాసు, రహీమ్, కబీర్, సంత్ జ్ఞానేశ్వర్ మొదలైన మహాపురుషులెందరో మానవీయ జీవితాన్ని సర్వోచ్ఛ స్థాయికి తీసుకెళ్ళారు. వీరందరు భగవంతుని శక్తిని వారిలో ధరించారు, ఆయన చేతిలో యంత్రాలుగా మారారు. వీరి మాధ్యమంగా పరమాత్మ తన పని చేసుకున్నాడు. ఈ కృపను సాధించడానికి జాతి, లింగభేదాలతో పని లేదు.

ఈ విధంగా భగవంతుని కృపను పొందడానికి, యంత్రంగా మారడానికి వినమ్రత, పరిశుద్ధ భావాలే తప్ప అహంకారం ఉపయోగపడదు. అహంకారమనే అడ్డంకి వల్ల భగవంతుడి నుండి దూరంగా వెళ్తాము. భగవంతుడికి దగ్గరగా వెళ్ళాలంటే అహంకారాన్ని తొలగించుకోవాలి. ఏ విధంగా అయితే అర్జునుడు తనను తాను శ్రీకృష్ణుడికి అప్పగించుకుని, నిమిత్త మాత్రుడు కాగానే ప్రాధాన్యతను సంతరించుకున్నాడో, అదేవిధంగా మనందరము భగవంతుని చేతిలో యంత్రాలుగా మారి, ఆయన పనులకు నిమిత్తమాత్రులం కావాలి.

*– అఖండజ్యోతి, డిశంబరు 2013*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## స్వామి రామతీర్థ

*స్వామి రామతీర్థ జ్ఞానంలోను, వేషభాషలలోను ఇతర సాధువుల వలెనే ఉండేవాడు. కానీ ఆయన జీవిత విధానం, భావాలు ఎంత ఉత్కృష్టంగా ఉండేవంటే ఈయన సంపర్కం లోనికి వచ్చిన ఏ వ్యక్తి అయినా ఉత్కృష్టుడుగా మారకుండా ఉండలేకపోయేవాడు. దశదిశలా వ్యాపించిన వీరి కీర్తి గురించి విని ముగ్ధుడైన అప్పటి అమెరికా రాష్ట్రపతి రూజ్‌వెల్ట్ స్వయంగా వచ్చి పాదస్పర్శ చేసి ధన్యుడనయ్యానని ఆనందాన్ని వ్యక్తపరుస్తాడు. అనేకమంది క్రైస్తవమతాచార్యులు స్వామి రామతీర్థ సజీవంగా ఉన్న యేసుప్రభువే కానీ అన్యుడు కాడని పేర్కొనడం జరిగింది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**ఇతరులను కష్టపెట్టేలా మాట్లాడకూడదు**

# అహింస - వీరుల ఆభరణం

భారతీయ ధర్మశాస్త్రాలు అహింస చాలా గొప్పదని పేర్కొన్నాయి. ఎవరిని హింసించకుండా ఉండడం, నిరపరాధ ప్రాణులను ఇబ్బంది పెట్టకుండా ఉండడం, ఎలాంటి బాధ కలిగించకుండా ఉండడం అనేది అహింస గురించి సాధారణంగా చెప్పుకునే అర్థం. అయితే, చాలామంది నేరస్తుల పట్ల, హింసాత్మక ప్రాణులపట్ల కూడా ఇలాగే వ్యవహరించడం అహింస అని భ్రమపడుతుంటారు. కానీ నిజానికి ఆ అర్థం అక్కడ రాదు. ఎవరిని కష్టపెట్టకూడదు అంటే నేరస్తులను, ఇతరులను ఇబ్బంది పెట్టేవారిని శిక్షించకూడదని అర్థం కాదు. అకృత్యాలను అణిచిపెట్టడానికి అవలంబించే శిక్షలను వైదికీ హింస అని మనీషులు ప్రకటించారు. 'వైదికీ హింస హింస న భవతి'. ఆలోచనాత్మకంగా, వివేకవంతంగా అవాంఛనీయ తత్త్వాలను అణిచివేయడం వైదికీ హింస.

ఈ యుగంలో ఆవిర్భవించిన విశ్వబంధువు, మన జాతిపిత మహాత్మాగాంధీగారు అహింసతోనే విదేశీయుల బారి నుండి దేశాన్ని విడిపించారు. అహింస మన కళ్ళ ముందు కనిపించే స్థూల వస్తువు కాదు. ఒకరిని చంపడం కాదు కదా అటువంటి చెడు ఆలోచనలు రావడం కూడా హింసనే. అబద్ధాలు చెప్పడం హింసే. ప్రపంచమంతటికీ ఉపయోగపడే ఏ వస్తువునైనా అనధికారికంగా, స్వార్థంతో స్వాధీనపరచుకోవడం హింస." అని హింస గురించి విశ్లేషించారు.

భారతీయ మనీషులు అహింస యొక్క సూక్ష్మ అర్థాన్ని తెలిపారు. అన్ని ప్రాణులలో మన ఆత్మను దర్శించడం, ఆత్మ భావాన్ని కలిగి ఉండుటను అహింస అన్నారు. నేరస్తులు, అనాచారులు చేసే అత్యాచారాలను సహించడం కూడా అహింస అని ఎక్కడా చెప్పబడలేదు. అవాంఛనీయ తత్త్వాలను దృఢంగా ఎదుర్కోవడాన్నే అహింస అని గాంధీగారు స్వయంగా చాలా చోట్ల చెప్పారు. గాంధీగారి ఆధ్వర్యంలో ఎన్నో అహింసాత్మక ఉద్యమము కొనసాగుతున్న రోజులవి. విదేశీ రాజ్యాన్ని అహింసాత్మక ఉపాయాలతో ఎలా తరిమేయాలో చెప్పారు. అప్పట్లో గుజరాత్ విద్యాపీఠంలో చదువుతున్న కొంతమంది విద్యార్థినులు వారి దగ్గరకొచ్చారు. కొంతమంది అబ్బాయిలు మమ్మల్ని విసిగిస్తున్నారు, మేమేంచేయాలి, వారికి ఎలా బుద్ధి చెప్పాలి అని కిశోరీలాల్ గారిని అడిగారు.

ఖచ్చితంగా వారు అహింసాత్మకంగా ప్రతీకారం ఎలా తీసుకోవాలో తెలుసుకోవడానికి వచ్చారు. 'మీ కాళ్ళకు చెప్పులు వేసుకుంటారుగా. ఒక దానిని తీసి ఆ అబ్బాయిల భరతం పడితే పోయే' అని జవాబిచ్చారు.

ఈ జవాబు విని అమ్మాయిలు ఆశ్చర్యపోయారు. 'అది హింస కదా. మేము అహింసతో బుద్ధి చెప్పడం ఎలాగో తెలుసుకోవాలనుకున్నాం.' 'మీకు అనుమానం ఉంటే మీరే స్వయంగా వెళ్ళి గాంధీగారిని అడగండి' అన్నారు కిశోరీలాల్.

అమ్మాయిలు గాంధీగారి దగ్గరకెళ్ళి జరిగిందంతా చెప్పారు. 'అంతేనా కిశోరీలాల్ చెప్పింది! నన్నడిగితే మీరందరు కలిసి వాళ్ళని తాడుతో కట్టేసి, జీవితాంతం గుర్తుండిపోయేటట్టు బాదండి. అత్యాచారులను ఎదుర్కోవడానికి అహింసాత్మక ఉపాయాలు ఏముంటాయి? వారి అత్యాచారాలను సహించడం అహింస కాదు, పిరికితనం. ఇంకా చెప్పాలంటే చేతులో కత్తి ఉంటే అలాంటి వారిని పొడిచేయాలి. ఆ సమయంలో అదే అహింస.

అహింస వీరుల ఆభరణం, పిరికివారిది కాదు అనే వారు గాంధీగారు. అది వీరులు నడిచే దారి అన్నారు ఆయన. అహింసాత్మక ప్రతీకారం అంటే ఎవ్వరినీ కష్టపెట్టకుండా నైతికంగా ఒత్తిడి తీసుకొస్తే అత్యాచారి ఓటమిని అంగీకరించి సరైన మార్గంలోకి వచ్చేటట్లు చేయడం. అలా చేయడానికి ధైర్యం, సాహసం, సంయమనం ఖచ్చితంగా కావాలి. అహింస అనే శస్త్రంతో పోరాడి స్వాతంత్ర సంగ్రామంలో చాలామంది సైనికులు లాఠీలు, కొరడా దెబ్బలు తిన్నారు, తుపాకీ గుండ్లకు బలయ్యారు కానీ ఉద్యమాలను వదలలేదు.

1923 సంవత్సరం. గుజరాత్‌లోని పంచ్‌మహాల్, గోధ్రా జిల్లాలలో భీషణ సాంప్రదాయిక ఉపద్రవం తలెత్తింది. అక్కడ

**సమయాన్ని వృథా చెయ్యకుండా ఏదో ఒకటి చెయ్యాలి**

ఎక్కువ జనాభా ఉన్న వర్గం వారి ద్వారా పీడింపబడ్డ హిందువులు పరిగెత్తుకొచ్చి గాంధీగారితో ముస్లిముల అత్యాచారాలపై ఫిర్యాదు చేసారు. విషయమంతా సావకాశంగా విని గాంధీ గారు, దీనిని ఎదుర్కోడానికి మీరేం చేసారని అడిగారు. వారి ప్రతినిధి, 'ఏం చేస్తాం బాపు. మీ అహింస మా కాళ్ళు, చేతులు కట్టేసింది.' అని జవాబిచ్చాడు. ఈ జవాబు విని కోపగించు కున్న గాంధీగారు, "సరే, అదే సరైన పని అనుకుందాం, కానీ నా అహింస మిమ్మల్ని పిరికిపందల్లా పరిగెత్తుకుని నా దగ్గరకు వచ్చి, మీ పిరికితనపు రిపోర్టు ఇవ్వమని చెప్పలేదే. ధైర్యంగా చావుకి కూడా ఎదురవ్వమని చెప్తుంది అహింస. చనిపోయేంత ధైర్యం లేనప్పుడు మీ మనస్సుకు తోచినట్టు ఎదుర్కోవాల్సింది. నా ఉద్దేశాన్ని మీరు అర్థం చేసుకోలేదు, మీరనుకున్నట్టు చేయగల ధైర్యాన్ని ప్రదర్శించలేకపోయారు. అహింస పిరికివాళ్ళది కాదు, ధైర్యవంతులది. ఎలాగైనా బతికి బైటపడితే చాలు అనిపించి నప్పుడు, ప్రమాదం నుండి తప్పించుకుని, పారిపోవాలనిపించిన చోట అహింస ఉండలేదు. దీనికన్నా హింస నయం. భయాన్ని, ఆపదని, ఆక్రమణని నేరుగా ఎదుర్కొంటారు.

క్రూరత్వం, అవాంఛనీయతలను ఎలా అయినా అణిచి వేయడం, ఎదుర్కోవడం చేయవచ్చు. అది 'మన్యు' అహింస క్రిందకి వస్తుంది. శస్త్రాన్ని వాడినా, శాస్త్రాన్ని ఉపయోగించినా క్రూరత్వాన్ని, అవాంఛనీయతని ఎదుర్కోవడం హింస ఎప్పటికీ కాదు. దానిని అహింస అనే అంటారు. అలా చేయడం వలన ఎందరో అమాయకుల పీడను తొలిగించినవారవుతారు, మరెందరికో సుఖశాంతులతో జీవించే అవకాశాన్ని ఇచ్చిన వారవుతారు. అనవసరంగా సామాన్యులు కష్టాలపాలు కాకుండా కాపాడగలరు.

నేరస్థులను, అత్యాచారులను ఏ విధంగా అయినా అణచి వేయడం మానవకళ్యాణమే అవుతుంది, అహింస అంటేనే మానవ కళ్యాణం, వీలైనంత ఎక్కువమందికి మంచి జరగడం. మనుష్యులందరికీ మంచి జరగడం కోసం అహింసాత్మక స్వభావం కలిగిన వారు దృఢనిశ్చయంతో మానవజాతికి హితం చేకూర్చే విషయాలలో దృఢంగా ఉంటారు. అణువు యొక్క ఆకృతిని కనుగొని ప్రపంచానికి తెలియజెప్పిన వారిలో ప్రముఖులైన నీల్స్ భోర్ తన బౌద్ధిక సామర్థ్యాన్ని లోకహితం కోసమే ఉపయోగిస్తానని నిశ్చయించుకున్నారు.

రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులలో హిట్లర్ సైనికులు నీల్స్ భోర్‌ని అణుబాంబు తయారు చేయమని ఒత్తిడి చేసారు. కాని ఆయన దానికి ఒప్పుకోలేదు. ఆయనకు అణువు యొక్క వినాశకర శక్తి గురించి తెలుసు. అణుబాంబు తయారు చేయబడితే అది భూమిని నాశనం చేస్తుందని తెలుసు. ముందు ఎన్నో రకాలుగా ప్రలోభపెట్టడానికి ప్రయత్నించారు. లోక కళ్యాణానికి పూనుకున్న ఆ మనీషిని ప్రలోభాలు ఎలా లొంగ దీసుకుంటాయి? ఆ తరువాత ఆయన్ని బెదిరించారు. వారి ప్రాణం తప్ప మరేదీ మిగల్చలేదు. ఎన్నోసార్లు మృత్యుముఖానికి తీసుకెళ్ళి తిరిగి తెచ్చారు. ఆ భయానికైనా లొంగిపోతారను కున్నారు. కాని అదీ కుదరలేదు. ఆయన భయపడలేదు, తన నిశ్చయాన్ని మార్చుకోలేదు, ఎలాగో కష్టపడి అమెరికాకు పారి పోయారు. అక్కడ జీవితాంతం మానవసేవ చేసారు. అహింస సాహసానికి పర్యాయపదం, శౌర్యవంతులకు ఆభరణం. తీవ్రవాదం, అణచివేతలను ఎదుర్కోవడం కూడా అహింసలోనే వస్తుంది. ఈ పదాన్ని తప్పుగా ఉపయోగించకూడదు. ఈ ముసుగులో పిరికితనాన్ని దాచుకోకూడదు. నూతనయుగంలోని కొత్త పరిస్థితులకు అణుగుణంగా ఈ ఆధ్యాత్మిక గుణానికి సరైన వ్యాఖ్యానాన్ని అందివ్వడం చాలా అవసరం.

*– అఖండజ్యోతి, జులై 1981*

*అనువాదం: ఎం.వి.ప్రసాద్, శ్రీమతి జయలక్ష్మి*

## గాయత్రీ పరివార్ సభ్యులందరికీ విన్నపము

2014 సంవత్సరము సామూహిక గాయత్రీ జపసాధనా సంవత్సరమని శాంతికుంజ్ పెద్దలు సూచించుట జరిగింది. కావున యావన్మంది గాయత్రీ పరివార్ సభ్యులు ఈ క్రింది సమయాల్లో గాయత్రీ మంత్ర జపాన్ని సామూహికంగా చేపట్టవలసినదిగా మరియొక మారు కోరడమైనది.

**సామూహిక జపవేళలు:**


ప్రతిరోజు ఉదయం 6 గం॥ల నుండి 6.30 గం॥ల వరకు
మధ్యాహ్నం 12.30 గం॥ల నుండి 1 గంట వరకు
రాత్రి 7 గం॥ల నుండి 7.30 గం॥ల వరకు

**సమయాన్ని వృథాచేస్తే అది జీవితాన్ని వృథా చేస్తుంది**

**చేతనత్వ విజ్ఞానం**

# అచేతన గర్భంలో దాగి ఉన్న భాండాగారం

మానవ శరీరంలో అన్నింటికన్నా అద్భుతమైన, ఆశ్చర్య జనకమైన అంగం మస్తిష్కం. ఇది తన భాండాగారంలో ఎన్నో రహస్యాలను పదిలపరచుకుని ఉన్నది. ఈ కారణం చేతనే మస్తిష్కం పెద్ద పొడుపుకథవలె ఉంటుంది. జీవశాస్త్రవేత్తలు దీనిని గురించి తెలుసుకోవటానికి ఎంతగా ప్రయత్నిస్తుంటే అది అంతే నిగూఢమైనదిగా తోస్తున్నది. అయినప్పటికీ వైజ్ఞానికుల ద్వారా దీనియొక్క అనేక రహస్యములు వెలుగులోకి వచ్చాయి. కానీ ఇంత జరిగినప్పటికీ మస్తిష్కం ఎటువంటి జటిలమైన అవయవం అంటే ఇప్పటికీ దీనిలోని కనీసం నాలుగవ వంతు భాగంలోని కొన్ని రహస్యాలు కూడా వెల్లడి కాలేదు.



మస్తిష్క రహస్యములు అద్భుతమైనవి. వీటి గూఢత బహులోతైనది. ఈ రహస్యములు తెలుసుకోవాలి అన్న జిజ్ఞాస ఉన్న కారణంగానే ఇది పరిశోధకులకు అన్వేషణా వస్తువుగా, ఆకర్షణకు కేంద్ర బిందువుగా నిలుస్తున్నది. జీవశాస్త్ర వేత్తలందరు కలిసి దీని విభిన్న ప్రయోగాలలో, పరీక్షలలో మునిగి పోయారు. ఈ పరిశోధనాక్రమంలో అమెరికాకు చెందిన తంత్ర వైజ్ఞానికుడు డా॥ఇవాన్ స్నాయిడర్‌కు ఒక మహత్వ పూర్ణమైన సూత్రం బోధపడినది. అతను దెబ్బతిన్న మస్తిష్కమును బాగుచేసి సువ్యవస్థితం చేయుటకు ఒక నూతన ప్రయోగమును, ప్రణాళికను కనుగొన్నాడు. అతని తీవ్ర పరిశోధన వలన 'మస్తిష్కమునకు చెందిన కణాలను ప్రయోగ శాలలో పంట విత్తనములవలె నాటి పంటను పండించ వచ్చును' అన్న ఒక తథ్యము వెలుగులోకి వచ్చినది.

ఈ ప్రయోగం విజ్ఞానజగత్తులో ఒక పెనుమార్పును తీసికొచ్చింది. ఎందుకంటే శరీరంలోని ఇతర అంగాల కణాలకు స్వాభావికంగానే పునర్నిర్మాణం చేసే సామర్థ్యం ఉన్నట్లు, మస్తిష్కమందలి కణాలకు ఆ సామర్థ్యం లేదని ఇప్పటి వరకు భావిస్తున్నారు. దారపు ఉండ మీద చుట్టబడిన అత్యంత సూక్ష్మమైన, పొడవైన దారపు పోగులవలె ఉండే మస్తిష్క కణాలకు ఈ స్వాభావిక గుణం లేదని భావించబడినది. వీటిని తీయటానికి ప్రయత్నిస్తే అవి దెబ్బతింటాయి. తునా తునకలై చెదరిపోయిన తరువాత అవి తిరిగి అతుక్కోవు. అంతేకాదు మస్తిష్కం భయంకరమైన రోగాలబారిన పడుతుంది. తత్ఫలితంగా మనిషి తన మస్తిష్కం మీద నియంత్రణ కోల్పోతాడు. ఈ కణాలు నశించిపోతూ ఉంటాయి. 50 లేక 52 సంవత్సరాలున్న మధ్య వయస్కులలో వీటి సంఖ్య సగమే ఉంటుంది. సామాన్యంగా ఈ వయస్సులో జ్ఞాపకశక్తి మందగించుటకు ఇదే కారణమై ఉండవచ్చు.

డా॥ ఇవాన్ ప్రయోగం ఈ రంగంలో అత్యంత లాభదాయకమని, ఉత్తమమైనదని చెప్పవచ్చును. అతను గర్భస్థ శిశువు యొక్క మస్తిష్కంలో ఒక ప్రత్యేకరకమైన కణాలను కనుగొన్నాడు. అవి స్వజాతికి చెందిన అటువంటి అనేక కణాలను ఉత్పన్నం చేయగలవు. అతను వాటికి 'న్యూరల్ స్టెమ్‌సెల్' అని పేరు పెట్టాడు. ఇవే ముఖ్యకణములు. డా॥స్నాయిడర్ తన పరీక్షాక్రమంలో ప్రయోగశాలలో వీటిని పంటవలె పెంచాడు. అతని ఈ ప్రయోగం ఇంకా కొనసాగుతూ ఉన్నది. అతని అభిప్రాయమును అనుసరించి ఈ కణాలను పెద్ద సంఖ్యలో వికసింపజేసి వాటిని ఇంజెక్షన్ ద్వారా మస్తిష్కంలో నాట వచ్చును. ఈ కణాలు మస్తిష్కంలో చనిపోయిన లేక దెబ్బతిన్న కణాల స్థానాలను భర్తీచేస్తాయని ఆశిస్తున్నారు. దీనివలన మనిషి జ్ఞాపకశక్తి పెరుగవచ్చు. అంతేకాక మరచిపోయే లక్షణమును దూరం చెయ్యవచ్చును. ఈ ప్రయోగం వలన మానసిక సంతులనను నియంత్రించుట సంభవమౌతుంది.

**శ్రమించండి, మీ ప్రగతికి అడ్డువచ్చే ఎటువంటి సాకులను దరిచేయనీయకండి**

మరిన్ని రహస్యాలు వెలుగుచూసే అవకాశం కూడా ఉన్నది. అయితే ఈ కార్యం అత్యంత కఠినమైనది, ప్రమాదకరమైనది.

విజ్ఞానవేత్తలు మస్తిష్కం యొక్క జటిలత్వమును చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈనాటికి కూడా వారికిది ఒక దుర్గమమైన ప్రాంతంలోకి ప్రవేశించుటతో సమానమైనదిగా తోస్తున్నది. ఇప్పటివరకు ఎవ్వరు దీనిలో ఒకే లక్షణం కలిగి, పలుచోట్ల విస్తరించి ఉన్న కణాల యొక్క సారూప్యతలను ఏకసూత్రంలోకి తేలేకపోతున్నారు. దీనికి కారణం ఈ కణాలు సాలెగూడు వలె చిక్కుముడులతో అల్లుకుని ఉండుట. ఈ సాలెగూటిలోనే చేతన, భాష, బుద్ధి, స్మృతి మరియు తార్కికశక్తి మొదలైనవి చెల్లాచెదరుగా పడి ఉన్నాయా? లేకపోతే వీటి కేంద్రబిందువు మరెక్కడైనా ఉన్నదా? అసలు ఎవరైనా ఎందుకు ఇతరుల కోసం మరణిస్తున్నారు? లేదా ఎవరినైనా అంతమొందించ టానికి లేదా ఇతరులను పాశవికంగా హింసించేవానిగా ఎందుకు మారుతున్నారు? వీటికిగాను మస్తిష్కంలోని ఏ కణం లేదా భాగం కారణమౌతున్నది? ఈ ప్రశ్నలకు ఇప్పుడు సరైన సమాధానం చెప్పలేము.

జిజ్ఞాసువుల మనస్సులు ఈ ప్రశ్నలకు సమాధానం వెతకటానికి వారిని వివశులను చేస్తున్నాయి. మనస్సు, మస్తిష్కములు రెండూ ఒక్కటేనా? లేకపోతే అవి భిన్నమైనవా? మనీషులు, వైజ్ఞానికులు తమ తమ శైలిలో దీనికి సంబంధించిన ప్రతిపాదనలు చేస్తున్నారు. మనోవైజ్ఞానికులు మస్తిష్కమును మనస్సు యొక్క ఒక యంత్రంగా భావిస్తారు. మనస్సు ఆజ్ఞాచక్రంలో ఉంటుందని యోగులు చెప్తారు. ఏది ఏమైనప్పటికీ మనస్సు బహు చంచలమైనది. సామాన్యంగా మనిషి మనస్సు వశంలో ఉంటాడు. మనస్సునకు అనురూపంగా అతని ప్రవర్తన ఉంటుంది. మస్తిష్కమును నియంత్రించే అద్భుతమైన మనోశక్తి యోగులలో నిశ్చయంగా ఉంటుంది.

మనస్సు మస్తిష్కమును ఎప్పుడు గతిశీలంగా (active) ఉంచుతుంది. వైజ్ఞానికులు కూడా ఈ అభిప్రాయమును బలపరుస్తున్నారు. వారి ప్రకారం మనమీదనే కాక, మన ఆలోచనల మీద కూడా మస్తిష్కం నిరంతరం తన పట్టును బిగిస్తూ ఉంటుంది. మస్తిష్కంలోని బ్రైన్‌స్టెమ్‌లో (brain stem)) నెలకొని ఉన్న రెటిక్యులర్ ఫార్మేషన్ (reticular formation) అచేతన మస్తిష్కముతో సంబంధమున్నదిగా భావించబడు తున్నది. ఇందులో జన్మ జన్మాంతరాల సంస్కారాలు, అలవాట్లు, ప్రవృత్తి మొదలగునవి ప్రోదిచెంది ఉంటాయి. ఇది మస్తిష్కం లోని సమస్త కదలికలను గుర్తుపెట్టుకునే ఒకరకమైన బ్లాక్‌బాక్స్. దీని ప్రభావం ఎంత ప్రబలంగా ఉంటుందంటే మనిషి దీని నిర్దేశములో యంత్రం వలె ప్రవర్తిస్తూ ఉంటాడు. ఈ రహస్యం కారణంగానే మస్తిష్కములోని కేవలం 10-13 శాతం భాగం వివరాలు లభించాయి. మిగిలిన భాగం శాస్త్రీయ పరిధికి బహు ఆవల ఉన్నది. పరామనోవైజ్ఞానికులు దీన్ని ప్రపంచం లోని అన్నింటినీ మించిన పెద్ద రహస్యమయ, అద్భుత మరియు శక్తివంతమైన యంత్రంగా చెపుతారు. అధునాతన శాస్త్రమైన సైకోసైబర్నెటిక్స్ శాఖకు అంతర్గతంగా దీని అధ్యయనం, అన్వేషణ సాగుతున్నది.

ప్రాచీన భారతీయ యోగులు అచేతన యొక్క జ్ఞానమును మరియు దాని మర్మమును తెలిసినవారు. దీని సూక్ష్మత మరియు లోతులతో వారికి పరిపూర్ణంగా పరిచయమున్నది. వారు స్వయంగా అచేతనను అధిగమించి నిరంతరం చైతన్యంలో లీనమై ఉండేవారు. తమ ఈ సూక్ష్మదృష్టి కారణంగా వారు అచేతనను చక్కబరచగలిగే సఫల మరియు కుశలురైన చికిత్సకులుగా ఖ్యాతిగడించారు. వారు ఈ విద్యమీద పలు ప్రయోగములు చేసి లెక్కలేనంతమందికి లాభాన్ని చేకూర్చారు. అయినప్పటికీ ఈ విద్యను వర్తమానంలోని అత్యాధునిక విజ్ఞానం సరిగ్గా అర్థం చేసుకొనలేక పోతున్నది.

మనిషి తన చేతనా మస్తిష్కం యొక్క గందరగోళ స్థితికి ఎంతగా వ్యాకులపడుతున్నాడంటే అతనికి అచేతన మనస్సు యొక్క పొరల క్రిందన అణచిపెట్టబడి ఉన్న దివ్యతత్త్వములను దర్శించే అవకాశం కూడా కలగటంలేదు. దీనిని ఒక సిగ్గుపడ వలసిన విషయంగానే చెప్పాలి. ఇందులోనే మనిషి తన సమస్త శక్తిని, ప్రతిభను నష్టపరచుకుంటూ జీవిస్తున్నాడు. సముద్రం లోని అట్టడుగున పడి ఉన్న ముత్యపుచిప్పలలో ఉన్న ముత్యం వలె అచేతన యొక్క ప్రతిబింబమును, దృశ్యమును, దాని కాంతిని మనిషి చూడలేకపోతున్నాడు. ఎందుకంటే అతని ఆలోచనలు ఆవిరివలె చెల్లాచెదరైపోతున్నాయి. ఆలోచనలను శాంతం, శీతలం కావించలేకపోతే అచేతన రూప మస్తిష్కం యొక్క ప్రతిబింబమును దర్శించుట సంభవం కాదు అన్న తథ్యమును వైజ్ఞానిక పరిశోధనలు కూడా అంగీకరిస్తున్నాయి.

**ఇష్టమైన లక్ష్యం కొరకు అలుపుసొలుపు లేకుండా పని చేస్తుంటే సిరిసంపదలు వచ్చి చేరుతాయి**

మస్తిష్కం యొక్క విద్యుత్తరంగాలను లెక్కించే ఈ.ఈ.జి.తో (Electroencephalograph) కేవలం చేతనా మస్తిష్కం యొక్క బాహ్య కదలికలను మాత్రమే అధ్యయనం చేయవచ్చును. మస్తిష్కం గురించి మరిన్ని వివరాలను తెలుసుకోవటానికి ఆలోచనలను అదుపు చేసుకోవలసి ఉంటుంది.

సత్యమేమిటంటే మస్తిష్కం అనేది మనస్సు యొక్క ఒక జటిల యంత్రం. ఇది మనస్సు వలన ప్రభావితమై దానిద్వారా నియంత్రించబడుతుంటుంది. ఈ యంత్రం యొక్క చక్కని గ్రహణశక్తి మనస్సు మీద ఆధారపడి పనిచేస్తూ ఉంటుంది. మనస్సు ఎంత శాంతంగా, సంయమనంతో ఉంటుందో మస్తిష్కం కూడా అంతగా వికసిస్తూ ఉంటుంది. మనస్సు శాంతగా ఉన్నప్పుడే ఈ యంత్రం సార్థకతను సంతరించుకుంటుంది. లేకపోతే జీవితం సమస్యలకు నిలయంగా మారుతుంది. ఈ విషయానికి సంబంధించి ప్రసిద్ధ మనోవైజ్ఞానికుడు క్లైస్టన్ అభిమత మేమనగా 'బయటినుండి చూడటానికి తేలికగా, సరళంగా కనిపించే మనిషి లోపల చాలా జటిలంగా ఉంటాడు. మనిషి సమస్యలు చాలా లోతైనవి, చిక్కులతో కూడుకున్నవిగా ఉంటాయి'. ఆయన అభిప్రాయం ప్రకారం 'మస్తిష్కరూప నిర్మాణంలో ఆ సమస్యలకు సమాధానమును వెతకుట అనేది ఇసుకనుండి తైలం తీయుట వంటిది. మనస్సు లోపలి పొర అయిన అచేతన మనస్సులోనే వీటికి తగిన సమాధానములు దాగి ఉంటాయి. వాటిని తట్టి లేపి పైకి తీసుకురాకుండా ఆ సమస్యల నుండి బయటపడుట సంభవం కాదు. వీటి బీజం మనస్సులో అణచిపెట్టబడి ఉన్నది. బహుశా ఈ కారణంగానే వర్తమాన యుగంలో చలామణిలో ఉన్న చికిత్సాపద్ధతుల ద్వారా వీటికి ఉపచారం చేయుట సాధ్యపడుటలేదు.

మనోవైజ్ఞానికుడు క్లైస్టన్ అభిప్రాయం ప్రకారం చేతనా మస్తిష్కం నుండే వ్యక్తి సామాన్య జీవనచర్యలన్నీ నిర్వహించ బడుతుంటాయి. చూడటం, వినటం, ఆహారపానీయాల స్వీకరణ వంటి దైనిక క్రియాకలాపాలు జరగటానికి ఇది కేంద్రంగా ఉంటుంది. కానీ మానవుని యొక్క కొన్ని పరిస్థితులు మరియు దశలను చేతనా మస్తిష్కం అర్థం చేసుకోలేనివిగా కూడా ఉంటాయి. అవన్నీ దాని అవగాహనకు మించి ఉంటాయి. దీనిని ప్రభావితం చేసినట్లయితే మనిషి ప్రవర్తన కూడా మారుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో లూసియానా విశ్వ విద్యాలయానికి చెందిన మెడికల్ ఎలక్ట్రానిక్స్ విభాగపు వైజ్ఞానికుడు డా॥ హాల్‌బ్రోకర్ చేసిన ప్రయోగం ఇక్కడ చెప్పుకోతగినది. దీనికొరకు టెక్టోస్కోపిక్ ప్రొజెక్షన్ అను పేరుగల ఉపకరణం రూపొందించబడినది. శాస్త్రవేత్త తన దగ్గరకు వచ్చే రోగులమీద పలు ప్రయోగాలు చేశాడు. వాటి లోని ఒకానొక ప్రయోగంలో అతను కొంతమంది వ్యక్తుల మీద 'నేను నిజాయితీ పరుడిని, నేను దొంగతనం చెయ్యను, దొంగతనం చేయుట పాపం' అనే సందేశమును ప్రసారం చేశాడు. ఈ ప్రయోగ పరిణామము అత్యంత ఉత్సాహభరిత మైనదిగా వచ్చింది. ఆ మనుష్యులలో అద్భుతమైన రీతిలో పరివర్తన రావటం మొదలు అయ్యింది. అప్పటి నుండి వారి నడవడిక కూడా మారింది.

మానవుని క్రియాకృత్యముల ముఖ్య క్షేత్రం అచేతన మస్తిష్కం అని హాల్‌బ్రోకర్ ప్రయోగం ద్వారా నిరూపించబడినది. దీనిని కుశలతతో జాగ్రత్తగా సంబాళిస్తే జీవితంలోని లోతైన మరియు సమాధానం తెలియని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఈ విషయానికి సంబంధించి శ్రీఅరవిందాశ్రమములోని శ్రీమాత ఇలా అనేవారు. 'మనోవికారాలను కలిగించే గ్రంథులు అచేతనా మస్తిష్కంలో వంపులు తిరిగి కుండలిని ఆకారం వలె చుట్టలు చుట్టుకుని లోతుగా బిగుసుకుని ఉంటాయి.' ఈ రంగానికి చెందిన నిపుణుడైన శస్త్రచికిత్సకుడే వీటికి శస్త్ర చికిత్స చేసి సమస్యలకు తగిన సమాధానం చెప్పగలడు. శ్రేష్ఠులైన యోగులే అప్పుడప్పుడు అలా చేస్తారు. ఒకసారి శ్రీఅరవిందులు తలనొప్పితో బాధపడుతున్న ఒక వ్యక్తిని చూస్తూనే అతనిని ఆరోగ్యవంతునిగా చేశారు. ఈ సంఘటన గురించి శ్రీమాత ఇలా అన్నారు. 'అచేతనా మస్తిష్కంలో అణచబడిన ఒక గ్రంథి ద్వారా బాధపడుతున్న ఆ వ్యక్తి తలలోని ఆ గ్రంథిని శ్రీఅరవిందులు సూక్ష్మహస్తముతో సరిచేశారు. దానిని సరిచేసిన వెంటనే ఆ మనిషి మామూలుస్థితికి వచ్చాడు.'

అమెరికాకు చెందిన ప్రసిద్ధి మనోవైజ్ఞానికుడు కేంప్‌బెల్ విభిన్న దృశ్యాల యొక్క ప్రభావం కూడా అచేతన మస్తిష్కం మీద పడుతుంది అనే తథ్యమును తన పరిశోధనలు– ప్రయోగముల ద్వారా నిరూపించి చూపించాడు. అతను ఒక ప్రయోగంలో కొంతమంది వ్యక్తులను వెలుగుతున్న దీపం వద్ద కూర్చోబెట్టి దాన్ని ఏకాగ్రతతో చూడమని నిర్దేశించాడు.

**నొప్పించేలా మాట్లాడితే మనస్సులు విరుగుతాయి, స్నేహాలు చెడిపోతాయి**

వారంతా తమ తమ సామర్థ్యానుసారం ఈ సాధనను చేశారు. ఇలా చేయటం వలన వారు పలులాభాలను పొందారు. వారి ఏకాగ్రత పెరిగింది. జ్ఞాపకశక్తి ఇనుమడించినది. ఇదే క్రమంలో అమెరికాకు చెందిన లెస్లీ క్రాన్ యొక్క ప్రయోగం కూడా చాలా గొప్పదనే నిరూపితమైనది. అతను త్రాటక రూప యోగ ప్రక్రియకు గల గొప్పతనమును అంగీకరించాడు.

దీపపుశిఖను ఏకాగ్రతతో చూడటం లేదా చర్చిలో క్రొవ్వొత్తులను వెలిగించి ఉపాసించటం వెనుక ఈ మనోవైజ్ఞానిక తథ్యమే పనిచేస్తూ ఉంటుంది. దీని ఆధారంగానే మన ప్రాచీన ఋషులు, మునులు దూరదర్శనం, దూరశ్రవణం, ఆలోచన ప్రసరణ, భవిష్యజ్ఞానం, అదృశ్యముగా ఉన్నదానిని ప్రత్యక్ష్యం గావించుకొనుట వంటి అనేకానేక అద్భుతశక్తులను సాధించారు.

ఈ ప్రక్రియలో ముఖ్య విషయమేమిటంటే మన మనో–మస్తిష్కములను శాంతంగా ఉంచుకుని, మన లోపల సుషుప్తావస్థలో ఉన్న దివ్యశక్తులను గుర్తించుట. ఈ అమూల్య సంపదకు మనస్సు, మెదడు అనేవి ఖజానాలు. ఆధునిక విజ్ఞానవేత్తలు ఎవ్వరు ఇప్పటివరకు తెలుసుకోలేకపోయిన ఆ దివ్యశక్తుల యొక్క సమస్త రహస్యాలను, సూత్రాలను శాంత, ఏకాగ్ర మనోమస్తిష్కాలతో హస్తగతం చేసుకొనవచ్చును. తత్ఫలితంగా జీవితం కనిపించని రిద్ధి–సిద్ధులతో సంపూర్ణంగా నిండిపోతుంది. అందువలన మనమందరం మన మనస్సును శాంతింపజేసుకుని అచేతన యొక్క వెలుగును దర్శించే రీతిలో మన అంతఃకరణలోకి తొంగిచూసే ప్రయత్నం చేయాలి.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2002*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## బ్రహ్మజ్ఞాని

*జనక మహారాజు భవనం ప్రాకారం మీద నిద్రిస్తూ ఉండగా బురుజు మీద వాలిన ఒక హంసల జంటలో ఆడహంస భర్తతో బ్రహ్మజ్ఞానులందరిలోకి జనకమహారాజు ఉత్కృష్టుడని పలికింది. ఆ మాటను మగ హంస ఖండిస్తూ, రైక్వుడనే అతను జనకుని మించిన బ్రహ్మజ్ఞానియని తెలియచేస్తాడు. ఇద్దరి మధ్య వాదోపవాదం జరిగింది. బండిలాక్కొని బరువులు మోస్తూ, ఆ యాచక వృత్తి ద్వారా జీవనయాత్ర సాగించే రైక్వుడు జనకుని మించిన బ్రహ్మజ్ఞాని అంటే జనకుడికి కుతూహలం కలిగింది. ఆతృత, ఆకాంక్ష జనకుని వేధించసాగింది. సమర్థులైన వ్యక్తులను నియమించి అతడిని వెదకి తీసికొని రమ్మని ఆదేశిస్తాడు. చాలాకాలం అన్వేషణ సాగిన మీదట అతికష్టం మీద రాజభటులు అతని ఆచూకీ తెలుసుకొంటారు. జనక మహారాజు ఆహ్వానాన్ని తెలియచేసి రాజసభకు రావలసిందిగా రాజభటులు కోరతారు. కానీ ఆయన నిరాకరిస్తూ నా ప్రస్తుత కర్తవ్యాన్ని వదలిపెట్టి సమయాన్ని, వృథా చేసి రాజువద్దకు వచ్చి నేను ఇచ్చేదిగానీ, పుచ్చుకొనేది గానీ ఏమిలేదని తెలియజేస్తాడు. సమాచారం విన్న జనకమహారాజు స్వయంగా రైక్వుడి వద్దకు వచ్చి అతిపెద్ద భారాన్ని మోస్తూ బండిలాగటం చూసి హృదయం ద్రవించగా స్వామీ! ఇంత గొప్ప బ్రహ్మజ్ఞానివై ఉండి, ఇలా కష్టపడటం నేను చూడలేను. స్వీకరించండి" అంటూ అతని జీవిత నిర్వహణ నిమిత్తం ధనరాశులను అతని ముందు కుమ్మరిస్తాడు. రైక్వుడు ఆ ధనరాశుల వంక నిర్లిప్తభావంతో చూస్తూ, "రాజా! ఇంత గొప్పవాడివై ఉండి నావద్ద నీవు దర్శించేది దరిద్ర్యాన్నా? ఇది బ్రహ్మజ్ఞాని యొక్క అపరిగ్రహమేగాని దారిద్ర్యం కాదు. నీవు ఇచ్చిన సంపదకు ఆశపడి, నేను ఈ దారిద్ర్యాన్ని వదులుకోవటానికి ప్రయత్నిస్తే తక్షణం నా చేతినుండి బ్రహ్మతేజస్సు కూడా జారిపోతుంది. దయ వుంచి నీ ధనాన్ని తీసికొని వెళ్ళమని కోరుతాడు. అతని పాదాలపై వ్రాలి జనకుడు అతని వద్ద తత్వజ్ఞానానికి సంబంధించిన అనేక గూఢ రహస్యాలను తెలుసుకొంటాడు. విలాసపరుడైన సంపన్నుడు ఎట్టి పరిస్థితులలోను బ్రహ్మజ్ఞాని కాలేడని, అపరిగ్రహం మాత్రమే వ్యక్తిని బ్రహ్మజ్ఞానిగా మార్చగలదనే సత్యాన్ని అతని ద్వారా గ్రహించి అప్పటి నుండి జనకుడు తన జీవనోపాధికోసం వ్యవసాయాన్ని చేయ సంకల్పించి నాగలిచేత పట్టడం జరిగింది.*

– ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**యోగః కర్మసు కౌశలం - చేసే పనిని బాగా చేయడమే యోగం**

# దైనందిన జీవితంలో క్రియాశీల టెలీపతి

ఆలోచనలన్నింటినీ ఏకీకృతం కావించే అభ్యాసం చేయగలిగితే అద్భుతమైన మానసికశక్తిని సంపాదించుకోవచ్చు. నిత్య జీవితంలో కూడా ఇటువంటి అభ్యాసం చేసుకోవటంతో దాని నుండి లభించే లాభం తక్కువ ఏమీ కాదు. దీనివలన వచ్చే పెద్ద ప్రయోజనం ఏమిటంటే ఆంతరిక హృదయంలో తలచే దానిని దూరంగా ఉన్న మరొకరి మనస్సులోకి చేరవేయగలదు. ఈ విధానంలో టెలిఫోను, టెలివిజన్ వంటి ఉపకరణాల అవసరమేమి ఉండదు. ఆంతరికమైన సన్నిహిత్వం ఈ పనిని సహజంగానే నిర్వర్తిస్తుంది.

ఇది ఉత్తర ఇంగ్లాండులోని కానిస్టన్ వాటర్ నగరంలో జరిగిన ఒక సంఘటన. శ్రీమతి జాన్ స్నేవర్స్ 1880లో ఒక తెల్లవారు ఝామున గాఢనిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా ఉలికి పాటుతో నిద్రమేలుకొన్నది. తన ముఖం మీద ఎవరో గట్టిగా కొట్టినట్లు అనిపించింది. ఆ దెబ్బవల్ల తన క్రింద పెదవి పంటి క్రింద నలిగి చీరుకుపోయి రక్తం వస్తున్నట్లు అనిపించి, కంగారులో కళ్ళు నులుముకొంటూ రుమాలు వెదికి తీసుకొని పెదవి నుండి కారుతున్న రక్తాన్ని తుడుచుకొంటూ, రుమాలును చూడగా దాని మీద రక్తపు మరకలు కనిపించనందున, మరీ కంగారుపడి, అద్దంలో తన ముఖాన్ని చూసుకొంటే పెదవి తెగినట్లుగాని, రక్తం గాని ఏదీ కనిపించలేదు. దీనితో ఎంతో ఆశ్చర్యపోతూ తన భర్త పడుకున్న మంచాన్ని గమనించగా అది ఖాళీగా ఉన్నది. గడియారాన్ని చూడగా అది ఉదయం 6 గంటలు చూపిస్తున్నది. అందువల్ల తన భర్త ఉదయపు నౌకావిహారం కొరకు వెళ్ళినట్లు అనుకొన్నది. ఉదయం ప్రతిరోజు నౌకావిహారం చేయటం తన భర్తకు అలవాటే కాబట్టి పెద్దగా ఆలోచించకుండా, అన్య మనస్కంగా ఇంటి పనులలో మునిగిపోయింది.

ఆమె భర్త ఇంటికి వచ్చిన తరువాత ఉదయపు ఉపాహారాన్ని బల్ల మీద సర్దుతూ యథాలాపంగా భర్తను చూసింది. అతను ఆమె వదిలిన రుమాలును పదే-పదే తన ముఖానికి తాకించు కోవటం చూసి, ఆమె చిరునవ్వుతో భర్తతో ఏమిటి ఈరోజు తమరు నా రుమాలును తెగ ముద్దులు పెట్టుకొంటున్నారని హాస్య ధోరణిలో ప్రశ్నించింది. దానికి అతను ఎంతో విషాదముఖంతో "ఈరోజు నాకు క్రొత్తజన్మ లభించిందని" అంటూ జరిగిన విషయాలనన్నింటిని తన భార్యకు ఇలా వివరించాడు – "ఈరోజు నౌకావిహారం చేసే సమయంలో ప్రశాంతంగా ఉన్న సముద్రంలో అకస్మాత్తుగా గొప్ప సుడిగాలి భయంకరంగా ఏర్పడేటప్పటికి, ఆ వేగానికి నావ సుడులు తిరుగుతున్న ఝంఝూ మారుతంలో చిక్కి, భయంకరమైన అలల తాకిడికి, అపార జలరాశి భీభత్సం మధ్య నావ అదుపుతప్పి తల్లక్రిందులవబోయింది. ఈ విపత్కర స్థితిలో నావ నడిపేవాడు ఎగిరిపడగా అనుకోని రీతిలో అతని చెయ్యి విసురుగా నా ముఖానికి తగిలింది. నా క్రింది పెదవి పళ్ళ క్రింద నలిగి బాగా చిట్లిపోయి రక్తం కారటం మొదలైంది. అప్పుడు నేను నిన్నే తలచుకొంటూ బాధతో అల్లాడిపోయాను. మరి కొంత సేపటికి సుడిగాలి తీవ్రత తగ్గి మా నావ ఆధీనంలోకి వచ్చింది. బ్రతుకుజీవుడా అనుకొని ఇలా ఇంటికి చేరాను. ఇది విన్న ఆమె ఎంతో ఆశ్చర్యానికిలోనై, తనకు ఏర్పడిన స్థితిని గురించి అతనికి వివరించి ఆ దెబ్బ తనకు తగిలినట్లు అనుభూతి కలిగిందని తెలిపింది. ఇటువంటి ఘటన వారి ఇరువురిలో ఉన్న దృఢమైన అనుబంధం కారణంగా జరిగిందని అనుకొంటూ ఆ దంపతులు ఇద్దరూ ఎంతో ఆనందానికి లోనయ్యారు.

ఇటువంటి ఆత్మిక చమత్కారపు భావాలతో ఏకీకృతమైన అనేక సంఘటనల గురించి 'కానిస్టన్ వాటర్ ఎపిసోడ్' అనే శోధనా పత్రంలో వ్రాయబడి ఉన్నది. ఇందులో వ్రాయబడిన వేలకొద్దీ సంఘటనలన్నీ నిజంగానే జరిగినట్లు పరిశోధనలలో తేలింది.

కొంతమంది ఇటువంటి ఘటనలను అతీంద్రియ క్షమతల వికాసమని నమ్ముతున్నారు. ఫ్రాన్స్‌లోని సుప్రసిద్ధ వైజ్ఞానికుడైన 'ఫ్లైమేరియన్' తన ప్రసిద్ధ పరిశోధన గ్రంథం "లినకోను"లో దీనికి "టెలిపతీ" అనే పేరు పెట్టాడు. ఈ టెలీపతి అనేది అంతర్గతమైన ఇరువురి హృదయాలలో ఏర్పడే గాఢమైన భావసంవేదనల కారణంగా మనస్సు యొక్క నిర్దేశాలతో ప్రభావితం చెందిన ఒక హృదయగతమైన అద్భుతవిద్య అని, దీనికి దూరాభారాలతో సంబంధం లేదని, ఎంతోదూరంలో ఉన్నప్పటికి ఒకరి భావ సంవేదనలు, మరొకరికి అందుతాయని ఆయన తన గ్రంథంలో వ్రాశాడు. దీనిని నిరూపించుటకు ఒక సంఘటనను ఉదాహరణగా చూపాడు. ఒకసారి ఇంటియజమాని లేని సమయంలో ఒక గృహిణి తన మిత్రులతో కలసి తన ఇంటిలో విందు ఆరగించేందుకు

**తప్పనిసరై నచ్చని పని చేస్తున్నారా? చేసేదేదో ఇష్టంతో చెయ్యండి**

ఏర్పాటు చేసుకొని అందరికీ ఆహ్వానాలు పంపింది. ఆ రోజు ఆమె భర్త వేట కొరకు అరణ్యానికి వెళ్ళాడు. అదీగాక ఈరోజు వాతావరణం కూడా ఎంతో శాంతంగా, ఆహ్లాదభరితంగా ఉన్నది. ఎందుకనో తెలియదు. తటాలున డైనింగ్ రూములోని ముందే తెరచి ఉంచిన కిటికి తలుపులు తీవ్ర శబ్దం చేస్తూ కొట్టుకుని ప్రశాంతతను భగ్నపరచాయి.

ఈ ఇల్లాలి హృదయంలో ఏదో తెలియని అపూర్వ స్పందన కలగడం మొదలై, ఏదో కీడుని శంకించుట ప్రారంభించింది. ఆమె తన మిత్రులను వీడ్కోలు ఇస్తూ 'ఈ రోజు ఏదో ఒక అప్రియ సంఘటన జరగబోతుందని నా మనస్సు శంకిస్తున్నది. అది నాకు ఎంతో దుఃఖానికి కారణమవవచ్చు. అందుచేత మీరంతా నన్ను క్షమించి వెళ్ళిపోండి. మరలా ఎప్పుడైనా కలుసుకొందాము" అని అందరిని పంపించి ఇంటిలో భర్త రాకకై ఎదురుచూస్తూ ఉన్నది. ఇంతలో పావుగంట కూడా గడవకముందే ఆమె భర్త శవమై ఇంటికి చేర్చబడ్డాడు. ఎవరో వ్యక్తి తుపాకితో అతనిని కాల్చి హత్య చేశాడు.

ఈవిధంగా తెలుపుతూ డా॥ ఫ్లైమేరియన్ 'టెలీపతి' అనేది ఎక్కడో దూరంగా జరగబోయే విపత్తుని ముందుగానే సూచిస్తుందని, ఇటువంటి సంఘటనలు వేలసంఖ్యలో ఉన్నట్లు తన గ్రంథంలో వివరంగా వ్రాశాడు. అటువంటి సంఘటనలలో ఒక ప్రామాణిక సంఘటన గురించి ప్రతిచోట చర్చించుకొన్న విషయం ఫ్రాన్స్‌లో జరిగింది.

ఫ్రాన్స్ మిలటరీకి చెందిన కెప్టెన్ సెనెగల్ అనే ఆయన 1889లో ఒక రాత్రి తన గదిలో 11.30 గంటలకు గాఢనిద్రలో ఉన్నాడు. ఈ సంఘటన గురించి అతను వివరిస్తూ "నేను గాఢ నిద్రలో ఉన్నప్పుడు నా గుండెల మీద ఏదో ఒక భయంకర ఒత్తిడి జరగుతున్నట్లు అనిపించింది. ఎవరో నా గుండెల మీద కూర్చొని నొక్కుతున్నట్లు, దానితో నా ఊపిరి ఆగిపోగలదనే భయంతో ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. కళ్ళు నులుముకొంటూ ప్రక్కమీద నుండి లేచి అటు ఇటూ చూడగా మా అమ్మమ్మ నాకు కనిపించి ఇలా అన్నది – "నా ప్రియ మున్నా... నిన్ను ఆఖరిసారిగా చూసి 'గుడ్ బై' చెప్పటానికి వచ్చాను.. ఇక ఎప్పుడు నన్ను చూడలేవు" నేను వెంటనే మంచం దిగి ఆ ఛాయాప్రకాశం వైపుకు చూస్తూ స్తంభించిపోయాను. ఇది కల మాత్రం కాదు. అతను ఇంకా ఎంతో విస్మయంతో ఇలా చెప్పాడు – "నాకు ఉదయాన్నే అందిన టెలిగ్రాము ద్వారా మా అమ్మమ్మ రాత్రి 11.30 గం॥లకు చనిపోయినట్లున్న విషయం చదివి ఎంతో విస్మయానికి గురైనాను. ఆమె చనిపోయే ముందు మా ఇంట్లో అందరితో నా మున్నాని ఇక ఎప్పుడూ చూడలేను" అని అన్నది. ఈ విషయాలన్నీ శ్రీ ఫ్లైమేరియన్ వివరిస్తూ ఇవన్నీ నిజాలేనని తన గ్రంథంలో వ్రాశాడు.

'బియాండ్ టెలిపతీ' గ్రంథ ప్రసిద్ధ రచయిత ఆండ్రిజా పుహారిక్ అనే ఆయన బోస్టన్‌లోని బిల్డింగ్ పనిచేయు కార్మికుడైన జెక్ సులేవన్ జీవితంలో జరిగిన ఒక విస్మయాన్ని గొల్పే సంఘటనను తన గ్రంథంలో ఇలా వ్రాశాడు. ఒకసారి వాషింగ్‌టన్ నగరంలోని వీధిలో అతను పనిచేస్తూ ఉన్నప్పుడు అతనితో పనిచేయు సహాయకులు ఎవరు ఆరోజు రాలేదు. దురదృష్టావశాత్తు అతని కాలుజారి క్రింద ఉన్న ఒక పెద్ద మురికి కాలువలో పడిపోయాడు. ప్రాణభయంతో వణికిపోతూ, కొట్టుకుంటూ తన ప్రాణమిత్రుడు టామి విట్టేకర్‌ని తలచుకొంటూ ఆఖరిసారిగా చూడాలని మనస్సులో గాఢంగా తలచుకోసాగాడు. ఆ మిత్రుడు ఇతనిని ఎన్నోకష్టాలలో, విపత్తుల్లో ఆపద సమయాలలో ఎన్నోసార్లు ఆదుకున్నాడు. ఇప్పుడు చనిపోబోయే ముందు అతడిని ఒక్కసారి చూడాలనే కోరిక బలంగా కలిగింది. టామి విట్టేకర్‌కి వాషింగ్టన్ నగరంలోని ఒక వీధిలో తెలియని ఒక అప్రియ సంఘటన జరుగ బోతున్నట్లు అనిపించి అతనికి తెలియకుండానే ఆ దిశవైపుకు ఎవరో లాక్కెళుతున్నట్లు పోసాగాడు. అతడు తాను చేయుపనిని అలాగే వదిలి వాషింగ్‌టన్‌లోని బజారుకు చేరాడు. అక్కడ ఒక బిల్డింగ్ పని జరిగేచోట ఒక జనరేటర్ మిషన్ నడవటం చూశాడు. కాని అక్కడ ఎవరు లేకపోవడం గమనించాడు. అత్యంత గాభరాతో కంగారుపడుతూ అతడు అటు ఇటూ చూడగా అతనికి ఆ మురికి కాలువ దుర్గంధం తగలటంతో అటు చూడగానే ఎవరో ఆ మురికి కాలువలో ప్రాణభయంతో అల్లాడుతున్నట్లు కనిపించింది. ఎవరో చేయి పైకెత్తి సహాయం కొరకు సంకేత మిస్తున్నట్లుగా ఉన్నది. దగ్గరకు చేరి చూడగా తన ప్రియమిత్రుడు బురదలో కూరుకొని పోయి అచేతనా స్థితిలో ఉన్న సులేవన్‌ని ఆ బురద నుండి బయటకు తీశాడు.

ఇటువంటి సహజంగా జరిగే సందర్భాలన్నీ ఆంతరిక ఏకాత్మ సంబంధం మీద అకస్మాత్తుగా జరిగిపోతూ ఉంటాయి. అభ్యాసం ద్వారా వీటిని ఇంకా ఎంతో ఎక్కువగా వికసింపచేసుకోవచ్చు.

*– అఖండజ్యోతి, ఆగస్టు 1985*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**ఇష్టం లేని పని చేస్తూ అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకోకండి**


పూజ్య గురుదేవుల అమృతవాణి

# గాయత్రీ పరివార్ ఉద్దేశ్యం - పీడ, పతనముల నివారణ-3

*'గాయత్రీ పరివార్‌లోని ప్రతి ఒక్క సభ్యుడి యొక్క ఒకే ఒక్క లక్ష్యము సమాజములోని దుఃఖము, పతనములను నివారించడమే' అని పరమపూజ్య గురుదేవులు తమ యొక్క ప్రేరణాత్మకమైన ప్రబోధన ద్వారా గాయత్రీ పరివార్ యొక్క లక్ష్యమును నిర్వచిస్తూ చెప్పి ఉన్నట్లు గత సంచికలో మీరు చదివారు. ఈ ఆధ్యాత్మిక లక్ష్యమును సాధించటానికే శాంతికుంజ్ స్థాపించబడినదని, ఇచ్చటినుండి శిక్షణను పొందిన వారు సమాజానికి సేవ చేయటానికై బయలుదేరవలసి ఉంటుందని పూజ్యగురుదేవులు ప్రవచిస్తున్నారు. ఆధ్యాత్మికత అంటే మాలను త్రిప్పుతూ జపము చెయ్యటము కాదని, జీవితమును సమర్థవంతముగా, శక్తివంతముగా తయారుచేసుకోవటమేనని వారు తెలియజేస్తున్నారు. మనుష్యుల ఆలోచనలు, వ్యక్తిత్వము, ప్రవర్తనలను సంస్కరించటమే తమ లక్ష్యమని, జనాన్ని గుంపులు గుంపులుగా కూడగట్టడము ఎంతమాత్రము సరికాదని వారు ప్రవచిస్తున్నారు. వాసియే తమకు కొలబద్ధకాని, రాశి ఎంతమాత్రము కాదని, ఆధ్యాత్మికత యొక్క, గురుపరంపరల యొక్క, గాయత్రీపరివార్ యొక్క 'సందేశము' ఇదేనని వారు ప్రవచిస్తున్నారు. రండి! గురువర్యుల అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!*

**అంతరంగములోని విశేషత**

ప్రజల స్వభావము పైన చెప్పబడిన విధముగానే ఉన్నదా? ఆలోచనా విధానము వారిని ప్రభావితము చెయ్యగలుగుతున్నదా?' అన్న విషయము పైన దృష్టిసారించండి. అదేవిధంగా మీ యొక్క శ్రద్ధ, నిష్ఠ ఈ నమ్మకము పైన లగ్నమైనదా లేదా అన్న అంశముపైన కూడా దృష్టిని కేంద్రీకరించండి. మీ నమ్మకము దృఢముగా నాటుకొని ఉన్నట్లయితే ఇక ఆలోచించవలసిన పనిలేదు. మీ మాటలను ఎవరు విన్నావినకపోయినా, ఎవరు మీపైన దృష్టిసారించినా-సారించకపోయినా ఇబ్బంది ఎంతమాత్రము లేదు. మీకు మీరే చాలు. మీరు మీ వ్యక్తిత్వము, క్రియాకలాపములు, భావనలు అన్నవి మస్తిష్కము, అంతరంగముల ద్వారా వాయుమండలములో ఒక అద్భుతమైన వాతావరణమును నిర్మించగలవు. మీరు నిశ్శబ్దముగా కూర్చుని ఉన్నప్పటికి అది వాతావరణములో స్వయముగా అనుకూల పరిస్థితులను సృజించగలదు.



మా గురుదేవులు ఇలాగే ఉండేవారు. మానవులు ప్రవేశించటానికి సాధ్యము కానటువంటి సుదూర ప్రాంతములో ఉండేవారు. వారు తమ నాలుకనుగాని, వాక్కునుగాని ఎన్నడు ఉపయోగించలేదు. శక్తి వంతులైనప్పటికీ తమ జీవితములో ఎటువంటి వ్యాఖ్యానాలు చెయ్యలేదు. ఎప్పుడైనా మమ్మల్ని పిలిచినా నాలుగు రోజులకు మించి వారితో ఉండనిచ్చేవారుకాదు. అదీ మౌనంగానే సమయము గడిచిపోయేది. నోటితో ఒక్కగానొక్క శబ్దము ఉచ్చరించకపోయినప్పటికీ వారి పుణ్యప్రభావము వలన, శక్తి వలన, బ్రహ్మ వర్చస్సు, తేజస్సు వలన వారి సామీప్యములోకి వచ్చిన ఏ మనిషైనా సరే ప్రభావితులు అవుతుండేవారు. ఇదే వారి అంతరంగము యొక్క ప్రత్యేకత.

**యోగి ఎవరు? తపస్వి ఎవరు?**

ఇక్కడినుండి వెళ్ళిన పిదప మీరు ఒక యోగివలె, తపస్వివలె జీవించాలి. యోగి అంటే, తపస్వి అంటే ఏమిటో మీకు నిన్ననే చెప్పాము. మరచిపోవద్దు. 'మీరు ఏదో ఒక వ్యక్తి యొక్క విశేషమైన సంపద కాదు, ఒక ప్రత్యేకమైన

**ఆధునికతను స్వాగతించాలి, కానీ ప్రకృతికి దూరంగా వెళ్ళకూడదు**

కుటుంబానికి చెందిన ఆస్తికాదు. మీ మనస్సు ఏదో ఒక కుటుంబానికి చెందినదో, వంశానికి సంబంధించినదో కాదు' అన్న విషయమును మీరు బాగా గుర్తుంచుకోవాలి. అలాగని మీరు మీ బాధ్యతలను విస్మరించమని మేము చెప్పటం లేదు. **వానప్రస్థాశ్రమములో ప్రవేశించినప్పటికీ మీరు ఇంట్లో ఉంటూనే, కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే మీరు మీ మానసికస్థితిని మార్చుకొనవలసి ఉంటుంది.** 'ఇప్పుడు నేను ఏదో ఒక ప్రత్యేక కుటుంబానికి చెందిన మనిషిని కాను. నా జీవితానికి కాయకల్పము జరిగింది, క్రొత్త దిశ ఏర్పడినది. ఇప్పుడు నేను భగవంతునికి, ధర్మమునకు, సంఘమునకు, సంస్కృతికి సంబంధించినవాడిని' అన్న అంశములను పదే పదే మీ మనస్సుకు గుర్తుచేస్తుండాలి. మీ మనస్సుకు ఈవిధంగా చికిత్స చెయ్యటంలో సమర్థులైతే కనుక మీ మానసికస్థాయిని అభివృద్ధిపరచటములో మీరు విజయము సాధించినట్లే! ఇప్పుడు మీరు నిజమైన బైరాగి, అసలైన సన్యాసి అని చెప్పగలము.

## గృహస్థజీవితములో ఉంటూనే సన్యాసి కావటం ఎలా

గృహస్థుగా ఉంటూనే మీరు సన్యాసిగా, విరాగిగా జీవించటంలో ఎటువంటి అభ్యంతరము లేదు. సాక్షాత్తు శంకర భగవానుడే కుటుంబసమేతముగా ఉన్నాడు. కాబట్టి గృహస్థ జీవితము మీ మార్గములో అడ్డంకి కాకూడదు. మేము కూడా స్వయంగా గృహస్థులమే! 'గృహస్థుగా ఉన్నంత మాత్రాన ఆధ్యాత్మికమార్గములో చెడిపోయేదేమీ లేదు' అని మేము మీకు హామీ ఇస్తున్నాము. గృహస్థుగా ఉండటములో మనిషికి వచ్చిన కష్టమేమీ లేదు. మనిషి లోభి అయితేను, మోహగ్రస్థుడైతేను కష్టం కలుగుతుంది. కుప్పలుకుప్పలుగా డబ్బు ప్రోగుచేసి ఆశ్రమాల మీద మోహం పెంచుకునే సాధుసన్యాసులను గృహస్థులని చెప్పకూడదు. అదేవిధంగా గృహస్థ జీవితం సాగిస్తూనే తమ పిల్లలను, ఒక తోటమాలి మొక్కలను పెంచినవిధంగా పెంచి పోషించిన వారెందరో ఉన్నారు. తోటమాలి మొక్కలను పెంచేటప్పుడు 'ఈ మొక్క నాదికాదు, దీని యజమానిది. పెంచి పోషించడం వరకే నా బాధ్యత!' అని భావించిన రీతిలోనే సన్యాసి తన కుటుంబమును నిర్వహించవలసి ఉంటుంది.

## యజమానిగా కాదు, సంరక్షకుడిగా జీవించండి!

మీరు ఎక్కడికి వెళ్ళినా, ఎక్కడ ఉన్నా యజమానిగా కాక, సంరక్షకుడిగా మెలగండి. ఇలా చెయ్యటం వలన మీ అహంకారం తొలగిపోతుంటుంది, మీ ప్రభావం పెరుగుతూ ఉంటుంది. మీరు ఇలాంటి మానసికస్థితి తెచ్చుకొని, మీ సంపర్కంలోకి వచ్చే ప్రజలను వీలైనంత ఎక్కువగా ప్రభావితం చెయ్యగలగాలి. మీరు శాంతికుంజ్ నుండి మీకు ఇవ్వబడిన మార్గదర్శనాలు, ప్రేరణల సహాయముతో మీ గౌరవమును, మా గౌరవమును, మన సంస్థ గౌరవమును ఇనుమడింప జెయ్యాలనేదే మా అభిమతం. మీరు ఎక్కడకు వెళ్ళినా, ఘర్షణపడకుండా, మధురవాక్కులతో వారిని ప్రభావితం చెయ్యగలిగితే మాకు ఎంతో సంతోషం కలుగుతుంది. మీరు వాక్కును సరియైన రీతిలో ఉపయోగించాలి. శక్తివంతులుగా మీరు మేము పంపించే ప్రదేశములకు వెళ్ళవలసి ఉంటుంది. ప్రజల అజ్ఞానమును, లోభమోహములను తొలగించడములో ఎంత సమర్థులు కాగలరో, ఎంతమేరకు విజయం సాధించ గలరో అది మీ సామర్థ్యమునకు గీటురాయి వంటిది.

## మనను జగద్గురువులని ఎందుకు అంటారు?

మీరు మీ సమయమును, శ్రమను కేటాయిస్తామని వాగ్దానము చేసిన ఈ సంస్థ మీది. దీని ఔన్నత్యము, ప్రాముఖ్యతల మీద మీకు ఎంతటి శ్రద్ధావిశ్వాసములున్నవో అటువంటి శ్రద్ధను, నమ్మకమును మీరు ప్రజలలో కలిగించ గలగాలి. ఈనాటి ప్రజలలో శ్రద్ధ, భావనలు అనేవి లుప్తమై పోయాయి. ఋషుల వారసత్వముగా మనకు లభించిన ఉన్నత స్థాయి సిద్ధాంతములు, ఆదర్శములు ఏమైపోయాయో అంతు చిక్కటం లేదు. భారతదేశము యావత్ ప్రపంచమునకే జగద్గురువుగా చెప్పబడింది. కానీ ఈ ప్రత్యేకతలన్నింటిని మనము చేజార్చుకున్నాము. ఒకానొక సమయములో మనము ఈ భూమండలానికే చక్రవర్తులం కాగలిగిన అమూల్యమైన విలువలను, స్వర్ణసంపదలను, ఇక్కడ ప్రతి ఒక్క వ్యక్తి దేవతా సమానులుగా భాసిల్లగలిగిన శ్రేష్ఠత్వమును, ఆధ్యాత్మిక విలువలను కలిగి ఉండేవారము. ఈనాడు అవన్నీ పోగొట్టు కున్నాము. ఆనాటి ప్రత్యేకతలన్నీ నశించిపోయినాయి. భౌతికమైన సుఖములు పెరిగేకొద్దీ మనిషి పతనమునకు చేరువ

**ప్రకృతికి విరుద్ధంగా సాగే జీవనంలో వికృతి విలయతాండవం చేస్తుంది**

కావడం మినహా సాధించగలిగినదేమీ లేదు. పెరిగిపోతున్న భౌతిక సంపద, వనరుల కారణముగా అమెరికా పౌరులలో ఎక్కువశాతం మంది నిర్వీర్యులుగా అయిపోతున్నారు. అక్కడ కుటుంబపరమైన సంబంధబాంధవ్యములకు ఏమాత్రము స్థానం లేదు. నిద్రమాత్రలు వేసుకుని మత్తులో జోగుతుంటారు. అన్నింటికన్నా పెద్ద కష్టము ఒంటరిగా బ్రతకడము. వాళ్ళకు ఎవ్వరు ఉండరు, వాళ్ళు ఎవ్వరికీ చెందరు. భౌతికవాద సంపన్న దేశాలలోని అత్యధిక జనాభా యొక్క పరిస్థితి ఇదే. ఈవిధమైన జీవనమును గడపటం వల్ల మనిషి క్లేశములో చిక్కుకుపోతాడు. ప్రపంచం వినాశనం వైపు పరుగులు తీస్తూ సాగిపోతుంటుంది.

## మానవత్వమును సంరక్షించడం గురించి గాయత్రీ పరివార్ మీద ఎన్నో ఆశలు

మన మనస్సులను, శరీరములను, భావనలను ఛిన్నాభిన్నం చేసే వ్యక్తులను దెబ్బకొట్టడానికి మీరు బయలు దేరుతున్నారు. మానవుడి సమస్తమైన విశ్వాసాలను, నమ్మకాలను త్రుంచివేసిన వ్యక్తులపై యుద్ధం ప్రకటించడానికే మీరు బయలు దేరుతున్నారు. మీకు అప్పగించబడిన పని సామాన్యమైనది కాదు. మిమ్మల్ని మీరు అసామాన్యులుగా భావించుకుంటూ, మీకు అప్పగించబడిన బృహత్కార్యమును పూర్తి నిజాయితీతో, బాధ్యతతో నిర్వహించటానికి అడుగు ముందుకు వేస్తున్నారు.

మీరు వెళ్ళిన ప్రతి ప్రదేశంలోను కొన్నిరోజులపాటు శిబిరమును నిర్వహించవలసి ఉంటుంది. మొదటి మూడు రోజులు కేవలం అక్కడి వ్యక్తుల రూపురేఖలు, వారి వ్యవస్థా విధానములను అర్థము చేసుకోవాలి. కార్యకర్తలకు హవనము చేసే విధివిధానం మాత్రమే తెలుసు. వారిని ఆ పని చేయనివ్వండి. అయితే కేవలం **హవనం మాత్రమే మన లక్ష్యం కాకూడదు. 'జ్ఞానయజ్ఞం' చెయ్యటమే మన ముఖ్యమైన లక్ష్యముగా ఉండాలి.** జ్ఞానయజ్ఞం ఎంతో పూజనీయమైనది. హవనం చెయ్యటం ద్వారా, యజ్ఞం నిర్వహించడం ద్వారా ప్రజలలో సత్ప్రవృత్తులను ఉత్పన్నం చేయాలి. మన క్రియాకలాపములన్నీ కూడా వాతావరణమును కల్మషరహితం కావిస్తూ, సత్ప్రవృత్తులను అభివృద్ధి చేసేవిధంగా ఉండాలి. అందుకోసమై మీరు ప్రజల వద్దనుండి శ్రమను, సమయమును దానం చెయ్యమని అడగాలి.

డబ్బుకన్నాకూడా శ్రమ, సమయం ఎంతో విలువైనవి. డబ్బులేకపోవటం వల్ల మన పని ఆగిపోదు. అందుచేత మీరు ప్రతి ఒక్క కార్యకర్తను శ్రమశీలురుగా, కర్తవ్యనిష్ఠులుగా తయారుకావటానికి తగిన ప్రేరణ నివ్వండి. 'శ్రమ-శ్రద్ధ' ఇవి రెండే అసలైన విలువ కలిగినవి. ఇవిరెండూ పరస్పరం అనుసంధానమై ఉంటాయి. వీటిపైన ఆధారపడే మన కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఇవి లేనప్పుడు ఇక కార్యక్రమాలుండవు, సంస్థ ఉండదు, పూజ, భజనలు ఉండవు.

## శ్రమ-సమయము వెలకట్టలేనివి

మీరు ఇవ్వగలిగే శ్రమ, సమయం మాకు చాలా అవసరము. మీరు శ్రమ, సమయం ఇవ్వడం ప్రారంభించగానే మీ శ్రద్ధావిశ్వాసములలో ఎంతో పరిపక్వత గోచరిస్తుంది. సంస్థ యొక్క క్రియాశీలతను, ఔన్నత్యమును అర్థము చేసుకున్న వ్యక్తికి 'శ్రమ-సమయం' సమర్పించడమనేది ఒక గీటురాయి వంటిది.

సంస్థ కార్యకలాపాలలో పరిజనులు ఎంత శ్రమ చెయ్యటానికి ముందుకువస్తారో, అంత సాఫల్యము కలిగినట్లు మేము భావిస్తాము. మీరు గొప్పవారైనా, అల్పులైనా, అధికులైనా మాకు సంబంధం లేదు. మాకు కావలసినది 'శ్రమ!' శ్రమ చేసినవారికే కీర్తి లభిస్తుంది. సంస్థ పట్ల మీకు ఉన్న శ్రద్ధా విశ్వాసములు డబ్బుతో కాదు, శ్రమతో నిర్ణయించబడతాయి.

ఆలోచనలను సంస్కరించడమనే మన మూల సిద్ధాంతమును దృష్టిలో ఉంచుకోండి. ఆ ప్రయత్నములో ఎంతవరకు కృతకృత్యులైనారు అనేదానిని బట్టి మీ సఫలత నిర్ణయించ బడుతుంది. అందుచేత మీ ఆలోచనలు, భావనలు, శ్రద్ధ, కర్తవ్యపరాయణత్వము మొదలైనవన్నీ కూడా బ్రహ్మవాదము, సాధుపుంగవుల స్థాయిలో ఉండవలసిన అవసరము ఎంతైనా ఉన్నది.

మీరు బ్రాహ్మణత్వమునకు, సాధుసంతులకు, శాంతి కుంజ్‌కు ప్రతీకలు; నవయుగనిర్మాణ ప్రణాళికకు ప్రతీకలు. మీరు ఈ బాధ్యతలను చక్కగా అర్థం చేసుకుని సరిగ్గా నిర్వహించాలి. మీ క్రియాశీలతను బట్టే ప్రజలు మన సంస్థను గురించి అంచనావేస్తారు. మీ వ్యక్తిత్వం, స్వభావం, క్రియాశీలత, గుణగణాలనుబట్టి సంస్థ యొక్క కార్యకలాపాలను గుర్తిస్తారు.

**వృత్తిని బట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వెయ్యవద్దు**

అందుచేత ముందుగా మీరు ఎక్కడికి వెళ్ళినా ఉత్సాహముతో అడుగు ముందుకు వెయ్యండి. మీ వ్యక్తిత్వమును ఖచ్చితమైన రీతిలో సంస్కరించుకోండి. ప్రజలతో ఆత్మీయతను పెంపొందించుకోండి. వారి భావనలను ఔన్నత్యపరచి, వారిలో శ్రమశీలతను ఉత్పన్నం చేయటానికి ప్రయత్నించండి. సంస్థ మీ వెనుకనే నిలబడి మీకు సహాయసహకారములను అందిస్తుంది. మా గురుదేవులు మాతో ఉన్న విధముగానే మేము మీ వెన్నంటి ఉంటాము.

### ప్రామాణికత ఆధారముగా విజయము సిద్ధిస్తుంది

చిన్నవైనా, పెద్దవైనా అన్నిరకాల ప్రణాళికలలో మాకు సంపూర్ణమైన సహకారం లభించింది. ఒకసారి సహస్రకుండీ యజ్ఞము చెయ్యటానికి సుమారు 30 లేదా 40 వేల రూపాయలు ఖర్చవుతాయి. యజ్ఞం ప్రారంభించాలనుకున్నప్పుడు మా వద్ద ఒక్క కానీ కూడా లేదు. కానీ ఎక్కడినుండి ఏర్పాట్లు జరిగాయో తెలియదు. అంత డబ్బు సమకూరింది. ఏదో ఒక మహాశక్తి మా వెనుక కూర్చుని ఉన్నట్లు అనిపిస్తుంది. అలాగే విదేశాలకు వెళ్ళవలసివచ్చినప్పుడు కూడా సుమారు 5000 రూపాయలు ఖర్చయింది. ఆ సమయములో మా వద్ద ఒక్క రూపాయి కూడా లేనప్పటికీ ప్రయాణమునకు సమస్తం సమకూరాయి. మేము ఒంటరిగా లేము, మా చెంత చక్కటి బ్యాంకింగ్‌వ్యవస్థ ఉన్నది అన్న విశ్వాసం అప్పుడు మాకు కలిగినది.

మీ కోసం ఇవన్నీ సురక్షితముగా ఉన్నాయి. మీకు కూడా అన్నీ లభిస్తాయి. కానీ అందుకు ఒక్కటే షరతు ఉంది. మిమ్మల్ని మీరు ఖచ్చితముగా ఉన్నట్లు నిరూపించుకొనగలగాలి. మీకు మీరు ఖచ్చితముగా ఉన్నట్లు నిరూపించుకొనలేకపోతే 'ఎక్కడి నుండో మాకు సహాయం తప్పకుండా లభిస్తుంది' అన్న అంశము పైన మీరు ఆశపెట్టుకొనవద్దు. మీరు ఖచ్చితముగా ఉండి నిజాయితీతో పనిచేస్తుంటే, మీరు సమర్థులై అన్నింటినీ పొందగలరు. మీకు ఇతరుల సహకారం కూడా అవసరం లేదు. మేము ఇక్కడినుండే మీకు సహాయాన్ని అందించి, మీరు ముందుకు సాగేలా చేస్తాము.

మీకు అన్నివిధాలా సహాయమును అందిస్తాము. అన్ని వైపుల నుండి విజయం లభించేలా చూస్తాము. కానీ అందుకు ఒక్కటే షరతు. మీరు మీ స్థానంలో నిజాయితీగా, ఖచ్చితముగా పనిచేసితీరాలి. మీరు కనుక అలా చెయ్యకపోతే మేము అందించే సహాయం వెనక్కుతిరిగి మా వద్దకు వచ్చేస్తుంది. మేము మీకు అప్పగించిన బాధ్యతలు ఏవైతే ఉన్నాయో, మీరు నిర్వహించ దలచిన పనులేవైతే ఉన్నాయో ఇంక వాటిని మీరు నిర్వహించ వలసి ఉన్నది. విజయం లభించినదా? లేదా? అన్న విషయమును పట్టించుకోకుండా మీరు మీ బాధ్యతను నిర్వహిస్తే మాకు సంతోషం. మీ జీవాత్మకు కూడా సంతోషం కలుగుతుంది.

వాస్తవానికి మేము మిమ్మల్ని ప్రజలలో శ్రద్ధాసక్తులు పెంపొందించటానికే, వారి మానసికస్థితిని మార్చటానికే పంపిస్తున్నాము. పెద్దపెద్ద ప్రణాళికలు, ఉత్సవాలు నిర్వహించమని పంపించటం లేదు. ప్రజలు ఈనాడు ఆస్తికత, శ్రద్ధ, ఆధ్యాత్మికత మొదలైనవన్నీ నశించిపోతున్నాయి. మీ చేతిలోని దీపంతో ఒక్కొక్క దీపమును వెలిగించుకుంటూ ముందుకు సాగిపొండి. ఇదే మీకు మా శుభాకాంక్షలు! ఎంతోప్రేమతో, ఆశతో మీకు వీడ్కోలు చెప్తున్నాము. తిరిగి మరల మిమ్మల్ని కలుస్తాము.

*– అఖండజ్యోతి, ఏప్రియల్ 2014*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

### పరస్పర సహకారంతో జీవన ఔన్నత్యం

*చెఱువులో కమలములు, చెఱువు గట్టున గులాబీలు విరబూచి అందాలు చిందిస్తూ ఉన్నాయి. గులాబి గర్వంగా అంది – "కమలమా! నీవు చూడటానికి చాలా పెద్ద దానివిగా కనిపిస్తావు! కానీ సువాసన అతి తక్కువగా కలిగి ఉన్నావు. నన్ను చూడు! నా శరీరం నీ అంత పెద్దదిగా లేదు కానీ నా సువాసనలు సుదూర ప్రాంతాలలోనున్నవారిని కూడా అలరిస్తాయి. జవాబుగా కమలం ఇట్లు పలికింది. గులాబీ సోదరా! నీవు నీ సుగంధంతో మనస్సుకు ఉల్లాసాన్ని ఇస్తే, నేను నా సౌందర్యంతో కనువిందు కలిగిస్తాను. మనమిరువురం కలిసి అందించే ఆనందాన్ని ఒంటరిగా ఏ ఒక్కరము చేయజాలం. కావున జీవితంలో ఔన్నత్యం పరస్పర సహకారంతో, సహయోగంతో మాత్రమే సాధ్యపడుతుంది. ఏకాకిగా అహంకారంతో సాధ్యపడదు.*

*– అఖండజ్యోతి, జనవరి 2014*
*అనువాదం: ఎ.వేణుగోపాలరెడ్డి*

**కుటుంబానికి తగిన సమయం కేటాయించాలి**

నా వారితో నా మాట

# ఆరోగ్యంగా ఉండాలి



### తన అంగ అవయవాల గురించి గురుదేవుల ఆందోళన

తమ పరిజనులు గొప్ప జీవితం జీవించాలని గురుదేవులు ఎప్పుడూ కోరుకునేవారు. అలాగే వారి ఆరోగ్యం గురించి కూడా ఎంతో ఆలోచిస్తారు. ప్రతి సంవత్సరం, శీతాకాలం రాగానే ఒక మాట అనేవారు. ఈ కాలంలో ఎవరు తమ ఆహారపు అలవాట్లను జాగ్రత్తగా పాటిస్తారో వారు సంవత్సర మంతా ఆరోగ్యంగా ఉండే ఏర్పాటు చేసుకున్నట్టే. వాత్సల్యంతో తండ్రి లాగా ఎన్నో విషయాలు చెప్పేవారు. ఇటువంటి చర్చల్లో చాలాసార్లు వందనీయ మాతాజీ కూడా పాల్గొని తమ సలహాలు ఇస్తూండేవారు.

గురువుగారు చెప్పేవారు, "శరీరానికి రెండు కారణాల వలన భోజనం అవసరం. మొదటిది – శరీరవృద్ధికి, మరమ్మత్తులకు. రెండవది – శరీరానికి తగిన వేడి, శక్తి కలిగించడం కోసం. మనిషి శరీరం నిరంతరం నిర్మించబడుతూ, అభివృద్ధి చెందుతూ ఉండే ప్రవృత్తి కలిగి ఉండే విలక్షణమైన సంరచన. ఒక భవనం నిర్మించడానికి ఏ విధంగా ఇటుకలు, సున్నం, సిమెంటు, చెక్క, ఇనుము మొదలైనవి అవసరమో, అదే విధంగా శరీరానికి విభిన్న పోషక తత్త్వాలు అవసరం. అవి ఆహార పదార్థాలలో మాత్రమే దొరుకుతాయి."

### శరీరాన్ని శక్తివంతంగా ఎలా ఉంచుకోవాలి?

శరీరం నిరంతరం ఉత్సాహంగా, చురుకుగా ఉండాలి. అందుకు బలం కావాలి. రైలు నడపాలంటే డీజిల్ కానీ, కరెంటు కానీ కావాలి. మిగిలిన యంత్రాలు, కర్మాగారాలు కూడా ఇలా ఇంధనంతోనే నడుస్తాయి. శక్తి అందకపోతే యంత్రాలన్నీ ఆగిపోతాయి. శరీరం కూడా ప్రకృతి సృష్టించిన ఒక విధమైన యంత్రమే. దానికి కావలసిన ఇంధనం అన్నపానీయాల ద్వారానే లభిస్తుంది. మనం తినే ఆహారం నుండి జీర్ణ వ్యవస్థ అవసరమైన పౌష్టిక పదార్థాలను ఎన్నుకుని వాటిని రక్తంలో కలిపి, రక్తప్రవాహ సంస్థానాన్ని దృఢ పరుస్తుంది. అక్కడ్నుంచి ఏ అవయవాలకు అవసరమైన పోషకతత్త్వాలను వాటికి రక్తం ద్వారా అందిస్తుంటుంది.

భోజనం ద్వారా లభించిన పోషక తత్త్వాలే శరీరానికి శక్తిని ఇస్తాయి. ఇది కాక శరీరం జీవించి ఉండడానికి వేడి అవసరం. దానినే మనం జీవన ఉష్ణం అని కూడా అంటాం. భోజనం లోని పోషకాలు శరీరానికి శక్తిని ఇచ్చేటప్పుడే జీవితానికి కావలసిన ఈ వేడి కూడా దానంతట అదే ఉత్పన్నమవుతుంది. అందుకే మనం ఏం తిన్నా అందులో సరిపడా పోషకతత్త్వాలు ఉండే విధంగా చూసుకోవాలి. వైజ్ఞానికుల ప్రకారం సరైన ఆరోగ్యానికి ప్రొటీన్లు, ఖనిజ లవణాలు, పిండి పదార్థాలు (carbohydrates), పీచు పదార్థాలు, విటమినులు చాలా అవసరం. ఇవన్నీ భోజనంలో సరిపడా పరిమాణాలలో లభిస్తే శరీర అభివృద్ధి, ఈ విలక్షణమైన ఈ యంత్రం యొక్క మరమ్మత్తులు అన్ని సక్రమంగా కొనసాగుతాయి.

సాధారణంగా వీటన్నిటికోసం డ్రై ఫ్రూట్లు, ఖరీదైన కూరలు కావాలని చెప్తుంటారు. బాదం, అక్రూట్, పిస్తా, జీడిపప్పు, నెయ్యి, పళ్ళు, పాలు, పెరుగు అంటూ పెద్ద చిట్టానే ఉంది. వీటిలో చాలా వస్తువులు ఖరీదు ఎక్కువ కాబట్టి సామాన్యులకు అందుబాటులో ఉండవు. అందుకే అనారోగ్యంగా ఉన్నవారిలో పోషకాహార లోపం బాగా తెలుస్తుంది. పౌష్టికాహారం గురించి మాట్లాడగానే ఖరీదుకి బెదిరిపోయే సామాన్యుల పరిస్థితి గురుదేవులకు తెలుసు. మన గాయత్రీ పరివార్‌లో మధ్యతరగతి సాధారణ మనుషులే ఎక్కువ. అయినా గురువుగారెప్పుడు సగటు భారతీయ స్థాయి జీవితాన్నే ప్రోత్సహిస్తారు.

### వనరులు కాదు, సరైన విజ్ఞానం ఉండాలి

వనరులేవీ లేకపోయినా, వాటి లేమి తీర్చగల సామర్థ్యం వివేకానికి ఉంటుంది అనేవారు. అన్న పానీయాల విషయంలో కూడా ఇది వర్తిస్తుంది. సాధారణ భోజనం కూడా సరైన విధానంలో వండితే పోషకతత్త్వాలు కావలసిన స్థాయిలో

మనస్సు లగ్నం చేసి శ్రద్ధగా పనిచేసినప్పుడు ఆ పనికి సార్థకత చేకూరుతుంది

అందుతాయని చాలాసార్లు చెప్పారు. గోధుమలు, జొన్నలు మొదలైన ధాన్యాలు; బంగాళదుంపలు, చామదుంపలు, ముల్లంగి వంటి దుంపలు; పాలు, పెరుగు, నిమ్మకాయ, బెల్లం లాంటి వాటిల్లో కూడా సరిపడా పోషకతత్వాలు ఉంటాయి. ఖరీదైన పదార్థాలువలె ఇవి కూడా పోషకాలను శరీరానికి అందిస్తాయి. చెరుకుగడలు, తేనె, ఖర్జూరం వంటి వాటిల్లో కూడా కిస్‌మిస్ లాంటి డ్రై ఫ్రూట్లలో ఉండే విటమిన్లు, ఖనిజాలు ఉంటాయని వైజ్ఞానికులు తెలుపుతున్నారు.

## ఆహార పదార్థాలలో పోషకాలు అవసరం

సాధారణంగా లభించే ఆహార పదార్థాల్లో కూడా ఖరీదైన డ్రై ఫ్రూట్లు, పళ్ళతో సమానమైన విటమిన్లు, ఇతర పోషకాలు ఉంటాయి. గోధుమలు, జొన్నలు, సజ్జలు మొదలైన వాటిల్లో కూడా కావలసినన్ని పోషకాలున్నా కూడా మనుషులకు అవి అందట్లేదు అంటే అర్థం వారు పాటించే అవైజ్ఞానిక భోజన పద్ధతులు. పాలు, నెయ్యి వంటివి చాలా ఖరీదైనవి అని చాలా మంది అంటుంటారు. ఖరీదు ఎక్కువ కాబట్టి విరివిగా దొరకవు అన్న విషయం కొంత వరకు నిజమే. పాలు, నెయ్యికి సమానంగా పోషణనిచ్చే వస్తువులు చాలా ఉన్నా, వాటిని సరైన విధానంలో వాడకపోవడం వల్ల లాభం పొందటం లేదు.

ఆహారానికి సంబంధించి కొనసాగే పరిశోధనల వివరాలు ఈ కొత్త యుగంలో ఇంకా అందరికి చేరలేదు. ఈ విషయాలన్నీ తెలుసుకుని, పాటించి, అందరికీ తెలియచేయడం మన పరిజనుల కర్తవ్యం. పాత పద్ధతులను కొత్త విజ్ఞానం ఒప్పుకోవట్లేదు. పాలు, నెయ్యి పరిశుద్ధంగా ఉంటే బలవర్ధకమైనవే. కాని కల్తీల వల్ల ఈ మాటలన్నీ కల్లలైపోయాయి. అయితే, ఇవికాక మరెన్నో ఆహారపదార్థాలతో సంపూర్ణ పోషణ సాధించవచ్చు అన్నది మాత్రం ఇప్పటికీ నిజమే. వివేకంతో, తెలివిగా ఆహారాన్ని ఎన్నుకుంటే ఈ ఖరీదైన యుగంలో కూడా కుటుంబానికి మంచి, పోషక విలువలున్న భోజనాన్ని అందించవచ్చు.

పాల విషయాన్నే గమనిద్దాం. సాధారణంగా లీటరు రూ.40 లేదా ఇంకా ఎక్కువే ఉంటుంది. ప్రతి రోజూ నలభై కన్నా ఎక్కువ రూపాయలు పాల మీద ఖర్చు పెట్టలేక ఏ పావు లీటరో తీసుకుని రెండు పూటల టీ పెట్టుకుని పని కానిచ్చేస్తారు. కానీ 50 గ్రాములు మొలకెత్తిన శనగలలో పావు లీటరు పాలకు సమానమైన పోషకాలుంటాయి.

మొలకెత్తిన శనగలను బాగా నమిలి తినడం వల్ల వాటి రసం నోట్లో నిండుతుంది. పాలంత బలాన్నిస్తాయి. కానీ రుచి గురించి ఫిర్యాదు చేస్తారు. వాటికంటూ ఒక రుచి ఉన్నా చప్పగా ఉంటాయి, తినాలని అనిపించదు అంటుంటారు. అయినా ఇందులో చిటికెడు ఉప్పు చల్లి, నిమ్మకాయ పిండుకుంటే రుచి తెలుస్తుంది. ఉప్పు, నిమ్మకాయలు కూడా వాడడం వల్ల కావలసినన్ని ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలను మొలకెత్తిన శనగలలో ఉత్పత్తి చేయవచ్చు. వీటి ధర కూడా తక్కువే.

పండ్లు అనగానే అందరి దృష్టికి వచ్చేవి దానిమ్మ, ద్రాక్ష, ఆపిల్. అన్నీ ఖరీదైనవే. కాలానుగుణంగా పెరిగే పళ్ళను ఎన్నుకోవాలి. జామ, బొప్పాయి, నేరేడు వంటివి సులభంగా దొరుకుతాయి. సాధారణంగా అందరి ఇళ్ళల్లో సాయంకాలం టీ పెడతారు. దానితో పాటు ఏ వేయించిన చిరుతిళ్ళో నోట్లో వేసుకుంటుంటారు. వాటిని ఆపి ఈ కాలానుగుణమైన పళ్ళను తింటే ఆ పూటకు సరిపడా పోషకాలు దొరుకుతాయి. ఏ ఋతువులోనైనా, ఏ కాలమైనా ఈ విధంగా అప్పుడు పండే పళ్ళను ఎన్నుకుని ఆహారంగా తీసుకుంటే సులభంగా, తక్కువ ధరకే అవసరమైన పోషకాలు దొరుకుతాయి.

## ఈ కాలంలో అవసరమయ్యే ప్రత్యేక పౌష్టిక పదార్థాలు

శీతాకాలంలో పౌష్టికత గురించి మాట్లాడేప్పుడు కీరా, దోసకాయలు, క్యారెట్ గురించి చెప్పుకుని తీరాలి. నిజానికి పాలు, కోవాలతో కలిపి చేసే క్యారెట్ హల్వా వల్ల ఇది ఖరీదైనది గానే కాక పౌష్టికంగా పనికిరానిదిగా కూడా మారింది. పౌష్టికత కోసం పచ్చి క్యారెట్లే చాలు. వీటిలో నిండుగా ఎ విటమిన్, ఖనిజాలు, లవణాలు ఉంటాయి. ఇది కాక టర్నిప్, బీట్‌రూట్, ముల్లంగి వంటి కాయకూరలు కూడా చాలా పోషకాలను అందిస్తాయి.

ఇదే విధంగా ఉసిరి కూడా చాలా పనికొస్తుంది. పండ్లకి, రక్తానికీ అవసరమయ్యే విటమిన్ సి ఉసిరిలో పుష్కలంగా లభిస్తుంది. తాజాగా దొరికినన్నాళ్ళు ఉసిరి పచ్చిగానే తినాలి. పచ్చివి తినలేకపోతే దాంతో పచ్చళ్ళు చేసుకోవచ్చు. ఉసిరి

**మనఃస్ఫూర్తిగా నిష్ఠతో, నిజాయితీగా బాధ్యతలను నిర్వహించడం యోగాభ్యాసమే**

దొరకని కాలంలో ఎండబెట్టిన వాటిని వాడచ్చు. రాత్రంతా నానబెట్టి రుబ్బి పచ్చళ్ళు చేసుకోవచ్చు. ఉసిరి దొరికే కాలంలో దాంతో చ్యవనప్రాష్ తయారుచేసి సంవత్సరమంతా వాడచ్చు. ఇలా ఎన్నో విధాలుగా వాడచ్చు. ఏదో ఒక విధానాన్ని ఎన్నుకోవాలి. విటమిన్ సి, ఖనిజాలే కాక మరెన్నో ముఖ్య పోషకాలు వీటిలో ఉంటాయి కాబట్టి ఆయుర్వేదంలో ఇది ముసలివారికి యవ్వనాన్ని కలిగించగల ఔషధిగా పేర్కొంటారు.

### ఆహార పదార్థాలు చౌకగా ఉన్నా, పోషకాలుండాలి

ఇప్పటి వరకు చర్చించిన పదార్థాలన్నీ చౌకవే. సామాన్యులు కొనగలిగినవే. వీటిని అందరు సులభంగా వాడుకోగలరు. వీటితో పాటు వండే విధానాల్లో మార్పు తెచ్చుకుంటే చాలా విటమినులు ఖనిజాలు నష్టపోకుండా కాపాడుకోవచ్చు. బియ్యాన్ని బాగా పాలిష్‌చేస్తే చాలావరకు విటమినులు కోల్పోతాము. చాలా కూరగాయలకు తినే వీలున్నా పొట్టు తీయడం వల్ల విటమినులు కోల్పోతాము.

వైజ్ఞానికుల ప్రకారం కూరలను చాలాసేపు ఉడకపెట్టడం, చాలా మసాలాలు కలపడం వల్ల కూడా పోషకాలు కోల్పోతాం. ఈవిధంగా చాలా విషయాలు గమనించుకోవడం వల్ల, తెలుసుకుని, ఉపయోగించడం వల్ల చౌకగానే పోషకాలను సాధించవచ్చు. ఈ విషయమై వీలైనంత ఎక్కువ సమాచారం తెలుసుకుని, పాటించి, ఇతరులకి తెలియజేయడం చాలా పెద్ద సమాజ సేవ, దేశ సేవ. చాలాసార్లు దేశంలో పోషణ సమస్య గురించి ఐక్యరాజ్యసమితి వైజ్ఞానికులు విశ్లేషించారు. ముఖ్యంగా పసికందులు, పిల్లలు, గర్భవతుల విషయంలో ఆందోళన చెందుతారు. ఈ చర్చ, ఆందోళన పూర్తిగా సబబే. ఈ కారణాలవల్లే సామాన్య ప్రజలు ఆరోగ్యాన్ని కోల్పోతున్నారు.

### సగటు భారతీయ స్థాయిలో జీవితాన్ని గడపాలి

పరమపూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీ మనకు సగటు భారతీయ స్థాయిలో జీవించాలనే నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన, "నాయనా! నాకు మిమ్మల్ని బీదవాళ్ళని చేయాలని లేదు. మీరంతా దేశంలోని సామాన్య, సగటు వర్గం వారి జీవితంతో కలవాలి. వారి సమస్యలు తెలుసుకుని, కష్టసుఖాలను అనుభవించండి. మీ అనుభవాన్ని బట్టి వాటికి సమస్యలను వెతికి, వాటిని అమలుపరచాలి. మీ అనుభవాల ఆధారంగా సమస్యలను పరిష్కరించడానికి వారి దగ్గరకు వెళ్ళండి." వారు నేర్పిన ఈ పాఠాన్ని మనం, మనలో ప్రతి ఒక్కరూ పాటించాలి.

నిజానికి చాలా సమస్యలున్నాయి. కానీ పోషణ సమస్య సర్వసాధారణమైనది. దీని గురించి లోతుగా ఆలోచించాలి. సగటు భారతీయుని జీవిత సమస్యను పరిష్కరించే మార్గంలో వెళ్ళాలి. అవసరాన్ని బట్టి నిపుణుల సలహాలు, సహాయాలు తీసుకుని పాటించాలి. నా వారితో నా మాటలలో కేవలం ఆహారం గురించిన సామాన్య విషయాలు చెప్పటం లేదు.

ఇవన్నీ సాధారణ పత్రికల్లో చాలానే దొరుకుతాయి. ఏ విషయాల గురించి అయితే జ్ఞానం, మార్గదర్శనం సగటు భారతీయునికి లభించక బాధపడుతున్నాడో, ఆ బాధను పంచుకునే ఉద్దేశంతో చెప్పబడుతున్న మాటలివి. ఈ బాధను అనుభవించి నిజంగా చౌకగా లభ్యమయ్యే పోషక పదార్థాలను అందుబాటులోకి తెచ్చే ఏర్పాటు చేయాలి. అందుకు సరైనా మార్గదర్శనాన్ని సేకరించాలి. ఈ విధంగా గురుదేవులు ఊహించిన గొప్ప ఆరోగ్య జీవితమనే ఆశయాన్ని సాకారం చేయడంలో సమర్థవంతంగా సహకరించిన వాళ్ళమవుతాం.

*– అఖండజ్యోతి, నవంబరు 2014*
*అనువాదం: శ్రీ ఎం.వి. ప్రసాద్*

## రఘువంశ పరంపర

*రఘువంశపు రాజులు సదా అవినీతిని అణగద్రొక్కుతూ సత్పురుషులకు సహాయం చేస్తూ ఉండేవారు. దేవతలకు సహకరిస్తూ అసురులను ఓడించటానికి ఎంత కష్టాన్నైనా ఎదుర్కొనేవారు. విశ్వామిత్రుడు స్వయంగా వచ్చి రాక్షసులు యజ్ఞంలో విఘ్నం కలిగిస్తున్నారని చెప్పినప్పుడు దశరథుడు స్వయంగా బయలుదేరటానికి సిద్ధమైనాడు. వంశపారపర్యంగా అలవడిన ఈ లక్షణాలే కిశోరావస్థలో ఉన్న బాలకులైన రామలక్ష్మణులను సైతం అవినీతిని అంత మొందించటానికి, మహర్షి వెంట వెళ్ళటానికి వివశుల్ని చేశాయి.*

– ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**తెలివికి నిదర్శనం తప్పులు వెతకడం కాదు, పరిష్కారాలు సూచించగలగడం**

# 5 రోజుల వ్యక్తిత్వ పరిష్కార సాధన శిబిరంపై నివేదిక

గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లో 2014 అక్టోబరు 7-11 తేదీలలో వ్యక్తిత్వ పరిష్కార సాధనా శిబిరం తెలుగు వారికై తెలుగు భాషలో నిర్వహించారు.

ఈ శిబిరంలో ఈ క్రింది కార్యక్రమము చేపట్టారు. 07.10.2014 మంగళవారం ఉదయం 8.30 గం॥లకు దీప ప్రజ్వలనతో పాటు యుగ సంగీతంతో శిబిరం ప్రారంభించారు.

శాంతికుంజ్ వరిష్ఠ ప్రతినిధి గాయత్రీ పరివార్ దక్షిణ భారత ప్రధాన సంచాలకులు శ్రీ అశ్విని సుబ్బారావు, శిబిరాన్ని ప్రారంభిస్తూ అత్యంత శ్రద్ధాసక్తులతో శిబిరంలో అందించెడి సందేశాలను ఆకళింపు చేసుకొని, తద్వారా సాధకులు తమ తమ వ్యక్తిత్వాలను పెంపొందించుకొనుటకు ఇది చక్కని అవకాశమని ప్రబోధించారు. క్రమశిక్షణతో మెలగవలసిందిగా కోరుచూ సమయపాలనను పాటించవలసిందిగా కోరారు.

### డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్‌గారి ప్రవచనం

అటు తరువాత శాంతికుంజ్‌లోని దక్షిణ విభాగ ప్రధాన సంచాలకులైన డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్‌జీ గారు ప్రవచిస్తూ, పూజ్యగురుదేవులు, వందనీయ మాతాజీల అనుగ్రహంతో ఈ సాధనా శిబిరంలో పాల్గొనుచున్న మీరు నిశ్చయంగా అభినంద నీయులు మరియు భాగ్యశాలురు. వ్యక్తికి విలువ ఈ సమాజంలో అతని వ్యక్తిత్వం ద్వారా మాత్రమే లభిస్తుంది. అందరిలో చక్కని వ్యక్తిత్వ నిర్మాణానికై ఈ సాధనా శిబిరాన్ని ఇచ్చట ఏర్పాటు చేయడమైనది. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మీరంతా ప్రభావశాలురయ్యేదరని ఆశించుచున్నాము.

### 07.10.2014 - శ్రీ కాళీచరణ్‌జీ గారి ప్రసంగం

జీవిత లక్ష్యం మరియు దానిని ప్రాప్తించుకొనుట అనే దానిని వివరించారు. మానవ జీవన లక్ష్యాన్ని గురించి స్వామి వివేకానందుడు "భగవంతుని నుండి ఉద్భవించిన మనిషి తిరిగి ఆ భగవంతునిలో చేరి పోవుటే మానవ జీవన లక్ష్యం" అని చెప్పారని తెలిపారు. విద్యుత్తు తన ఉత్పత్తి కేంద్రము నుండి ప్రయాణాన్ని ప్రారంభించి తిరిగి అదే కేంద్రాన్ని చేరి సర్క్యూట్‌ను పూర్తి చేస్తుంది. తన లక్ష్యాన్ని వెలుగునిచ్చుట, యంత్రాల నడుపుట మున్నగువానిని పూర్తి చేసి తిరిగి తన పుట్టుక స్థానాన్ని చేరుతుంది. ఇదే రీతిలో మనిషి కూడా ఈశ్వరుని నుండి వెలికివచ్చి, తన మానవ జన్మ సాఫల్యాన్ని పూర్తి గావించుకొని తిరిగి ఆ ఈశ్వరుని చేరుట మానవ జీవన లక్ష్యమని తెలియ జేశారు. మనమంతా ఈశ్వరుని చేరే మార్గంలో పయనిస్తూ దారి తప్పాం. భట్ కా దేవతా - అనగా దారితప్పిన దేవతలగా మారాం. పరమపూజ్య గురుదేవులు తన జీవిత కాలంలో 300 శక్తిపీఠాలను స్వయంగా ప్రాణప్రతిష్ఠగావించి చివరిగా శాంతికుంజ్‌లో భట్ కా దేవత మందిరాన్ని ఏర్పాటు చేసి, దారితప్పిన మనిషిని తిరిగి దారిలో పెట్టెడి సాధనను అందించారు. దీనికై ప్రతిరోజు 3 సంధ్యా వందనాలను చేయాలన్నారు. అట్లే స్వాధ్యాయస్మరణ్ చేయమన్నారు. కబీర్‌దాసు ఏమి చదువుకోలేదు. కాని ఆయన తన వివేకంతో ప్రపంచాన్ని చదివాడు. అట్లే సీతను కోల్పోయిన శ్రీరాముడు "అత్యంత బలశాలి, లంకారావణుని తన చంకలో 6 గంటలకు పైగా బంధించి, అతని వ్రతభంగం కావించిన వాలి సహకారాన్ని కోరక రాజ్యాన్ని, భార్యను కోల్పోయి, వాలివలన ప్రాణభయంతో నున్న సుగ్రీవుని సహకారాన్ని స్వీకరించి, రావణ సంహారం చేసి, సీతాదేవిని తిరిగి పొందాడు." దీని మర్మాన్ని వివరిస్తూ, శ్రీ కాళీచరణ్‌జీ "దుష్ట సంహార లక్ష్యసాధనకై చక్కని వ్యక్తిత్వము ఉన్న సుగ్రీవునితో స్నేహం చేశాడు." అని వివరించారు. భగవంతుని చేరే లక్ష్యసాధనకై ఎంచుకొనెడి మార్గం కూడా మంచిదై ఉండాలి అని ఉద్బోధిస్తూ స్వాధ్యాయ ప్రాశస్త్యాన్ని వివరించారు. స్వాధ్యాయ, జపధ్యానాల ద్వారా భగవంతుని చేరాలని ఉద్బోధించారు.

### శ్రీ అశరణ శరణ్ శ్రీవాత్సవగారి ప్రవచనం

"ఆత్మ వికాసానికై నాలుగు చరణాలు" అనెడి దానిపై చక్కని అవగాహన కల్పించారు. వీరు జంతుశాస్త్ర ఉపన్యాసకులు గా పనిచేస్తూ పదవీవిరమణను తీసికొని మిషన్‌లో చేరి 1984 నుండి తమ సేవలను అందించుచున్నారు.

మనిషి బాహ్యరూపానికి (పర్సనాలిటీ) ఆంతరంగిక

**ఆకలి తెలిసిన వాడికి అన్నం విలువ తెలుస్తుంది**

రూపానికి (వ్యక్తిత్వానికి) మధ్య చాలా అంతరమున్నది. బాహ్యంగా చాలా అందంగా, చూడముచ్చటగా ఉంటాడు. కాని ఆంతరంగికంగా అతి వికారంగా, అంటరానివాడిగా ఉండవచ్చు. అట్లే అష్టావక్ర ముని శరీరం బాహ్యంగా ఎనిమిది వంకరలతో కూడి ఉన్నది, కాని ఆంతరంగికంగా మహా జ్ఞానియైన జనకమహారాజునకు నిజజీవితంలో ఆధ్యాత్మిక గురువుగా వ్యవహరించారు. అట్లే మహర్షి రమణుడు బాహ్య రూపంలో నల్లగా ఉండి, మౌన ముద్రలో ఉంటూ, మామూలు వ్యక్తులకు ఒక అజ్ఞానిగా కనిపించేవాడు. కాని జ్ఞానులకు ఆంతరంగికంగా తన మౌనములోనే జ్ఞానాన్ని అందించి "నేనెవ్వరు?" అని ప్రశ్నించి కన్నులు తెరిపించాడు. విశ్వంలో ప్రతి పదార్థం దాని ప్రత్యేకతత్వం ద్వారా గుర్తింపు పొందుతుంది. ఉదాహరణకు నిమ్మకాయ రసం పుల్లదనాన్ని కలిగి ఉంటుంది. అట్లే మామిడికాయలోని రకాలు కొన్ని రసాన్ని ఇస్తాయి. తియ్యగా ఉంటాయి. మరికొన్ని గుజ్జును కలిగి పండినంతనే తియ్యదనాన్ని ఇస్తాయి. అగ్నితత్వం వేడినిచ్చుట, మంచుతత్వం చల్లదనాన్ని ఇచ్చుట. కాని సృష్టిలోని పదార్థాలన్నీ మాలెక్యూల్స్‌తో, అణువులు, పరమాణువులతో కూడి ఉన్నాయి. ప్రతి పరమాణువు ఎలక్ట్రాన్స్, న్యూట్రాన్స్, ప్రొటాన్స్‌తో కూడి ఉంటుంది. వీని మధ్యగల నిష్పత్తిని బట్టి నిర్మాణాన్ని బట్టి పదార్థగుణం లేక తత్వం మారుతూ ఉంటుంది. కాని అన్ని పదార్థాలకు మూలం, పరమాణువే. అట్లే మానవుల శరీరం దానిలోని ఆత్మ వేరు వేరు తత్వాలను కలిగి ఉంటుంది.

వివిధ మానవులతో కూడిన ఈ విశ్వం శాంతిసౌఖ్యాలతో వెల్లివిరవవలయునన్న మానవుల అంతరంగాలలోనున్న కాలుష్యాన్ని, మాలిన్యాలను తొలగించి, వారి తత్వాలలోనున్న వ్యత్యాసాన్ని కుదించాలి. క్రమక్రమంగా తొలగించాలి. వారినందరినీ పరమాత్మతత్వానికి దగ్గరగా చేర్చాలి. దీనికై మన గురుదేవులు, తపోనిష్ఠ పండిత శ్రీరామశర్మఆచార్య నాలుగు పనులను మనకప్పగించాడు. అవి

**1) సాధన:** ఉపాసించెడి మూర్తి లేక వెలుగు, ప్రతిమలోని మంచి గుణాలు మనలో ప్రవేశిస్తున్నాయని భావన చేయాలి.

**2) స్వాధ్యాయం:** మనల్ని మనం పరిశీలించుకోవాలి. ఆత్మ విమర్శ చేసికోవాలి. మంచి పుస్తకాలు చదవాలి. తద్వారా ఆత్మప్రక్షాళన జరిగి, ఆలోచనల ప్రక్షాళన జరుగుతుంది.

**3) సంయమనం:** దీనిలో నాల్గింటిని నియంత్రించాలి. (ఎ) సమయం (బి) ఆలోచనలు (సి) అర్థ సంయమనం (డి)ఇంద్రియ సంయమనం. వీనిని పెంపొందించుకొని దేవ మానవునిగా ఎదగాలి.

**4) సేవ:** దీనిని రెండు విధాలుగా ఆచరించాలి. *(1) పీడన నివారణ:* ఆకలిగొన్న వారి ఆకలి తీర్చుట, జబ్బు పడ్డవారి జబ్బును తగ్గించుటకై సేవ, అజ్ఞానులకు జ్ఞానాన్ని అందించుట, నిత్యావసరాల తీర్చుటకై పోరాటం సల్పెడివారికి తోడ్పాటు నందించుట వగైరా. *(2) పతన నివారణ:* చెడు అలవాట్లకు బానిసలైన వారికి తగిన జ్ఞానోదయాన్ని కల్గించి వారిని కాపాడి వారికి తిరిగి గౌరవప్రదమైన జీవితాన్ని వారు జీవించుటకై తోడ్పాటును అందించుట.

పైరీతిగా గాయత్రీపరివార్ సమాజానికి తగిన సేవలను అందిస్తూ ఎదగాలి.

### 08.10.2014 - డా॥ గౌడ్‌జీగారి ప్రసంగం

గౌడ్‌జీగారు ప్రసంగిస్తూ ఇలా అన్నారు "మిత్రులారా! ఒకనాడు ఈ దేశంలో 33 కోట్లమంది దేవీదేవతలు ఉన్నారు. ఆనాటి దేశ జనాభా అది. అనగా ప్రజలంతా ఆనాడు దేవీదేవతల్లా జీవించారు. వారి మార్గాన్ని అనుసరించారు. సుఖశాంతులతో, పరస్పర ప్రేమానురాగాలతో, సహకారంతో జీవించి ప్రగతి పథాన నడిచారు. దీనితో ఆనాడు భారతావని జగద్గురు పీఠాన్ని అలంకరించింది. జ్ఞాన సముపార్జనకై దేశ విదేశీయులను ఆకర్షించింది. సిరిసంపదలతో తులతూగింది. విదేశీ దండ యాత్రలకు, దోపిడికి గురి అయింది. నేడు అట్టి జ్ఞానానికి, జీవన విధానానికి దూరమై అనైక్యతతో, స్వార్థంతో, నిష్కామ కర్మను విడనాడి, భోగానికి బానిసయై, ఇంద్రియ లాలసతతో పతనమార్గంలో పడింది. దీనితో అనేక దుర్నీతులు, దుష్ట సంస్కృతులు, ఈ దేవసంస్కృతిలో ప్రవేశించి చక్కని సంస్కృతి బీటలు వారింది.

ఇట్టి దుస్థితిలోనున్న ఈ సమాజాన్ని సంస్కృతిని సంస్కరించి అలనాటి గౌరవాన్ని పునరుద్ధరించుటకై పూజ్య గురుదేవులు చూపించిన మార్గాన్ని మనం అనుసరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అగాథ సముద్రంలో ఉన్న రత్నాలను వెలికితీసినట్లుగా, సమాజంలో ఉన్న నిష్ఠాగరిష్టులను వెతికి వారిని కార్యోన్ముఖుల గావించాలి. దీనికై వ్యక్తిత్వ నిర్మాణంతో

**ఉన్నదానిని ఇతరులతో పంచుకోవాలి**

పాటు సమాజ నిర్మాణం జరుగవలసి ఉంది. ఈ క్రింది కార్యాచరణ ప్రణాళికను ఆచరణలో పెట్టవలసి ఉంది.

మన ఆశ్రమ ధర్మాల పునరుద్ధరణ జరగాలి.

**1) బ్రహ్మచర్య ఆశ్రమం:** బాల్యం నుండి 25 సం॥ల వరకు దీనిని పురుషులు పాటించాలి. గృహస్థాశ్రమంలో ప్రవేశించుటకు కావలసిన శారీరిక శక్తిని, జ్ఞానాన్ని, ఆత్మబలాన్ని, మనోబలాన్ని పొందాలి. స్వావలంబన దిశగా ఎదిగి బరువు బాధ్యతలను స్వయంగా చేపట్టే అడుగులు వేయాలి. వ్యక్తుల వ్యక్తిత్వాన్ని సంస్కరించనిదే, చేసిన చట్టాలు, ఆశించిన ఫలితాలనివ్వవు.

మిత్రులారా! మీ ముందు కొన్ని వాస్తవిక సంస్కార ప్రాధాన్యతల తెలిపే విషయాలను ఉంచుతాను. ఒక పిల్లవాడు బాల్యంలోనే అడవిలో తల్లిదండ్రుల నుండి విడిపోయి ఒక తోడెళ్ళ గుంపులో చేరిపోయాడు. అతని పోషణను ఆ తోడేళ్ళు చేశాయి. దీనితో అతడు వాని మధ్యే పెరిగి, వాని అలవాట్లను, వాని భాషను, చేష్టలను చేయసాగాడు. ఇది ఒకనాడు అడవి అధికారుల కంటబడింది. వలపన్ని ఆ బాలుని ఆ మృగాల నుండి వేరు చేసి ఉత్తరప్రదేశ్ లక్నోలోని మ్యూజియంలో పెట్టి సంస్కరించుటకై మిగుల ప్రయత్నించారు.

రెండవ ఉదాహరణ శ్రీహరిమోహన్‌జీ ఒక ఇంజనీర్. బాధ్యతగల ప్రభుత్వ అధికారి – ప్రభుత్వ పనులు చేయించే సందర్భంగా ఒక కంట్రాక్టరు (గుత్తేదారు) నుండి రెండు లక్షల రూపాయిలు లంచాన్ని అందుకుని దానిని తీసికొని ఇంటికి వెళ్ళారు. ఈ ధనాన్ని అతని అర్థాంగి చూచి ఈ ధనం ఎలా వచ్చింది అని భర్తను ప్రశ్నించింది. యదార్థాన్ని తెలిసికొని, ఆ ధనాన్ని గుత్తేదారుకు ఇచ్చి వేయవలసిందిగా భర్తను అర్థించింది. ఆఖరి అస్త్రంగా, తన మాటను మన్నించనిచో, భర్తను వీడిపోయెదనని తీవ్రంగా హెచ్చరించింది. దీనితో ఆమె భర్త శ్రీహరిమోహన్‌జీ ఆ ధనాన్ని తిరిగి గుత్తేదారునికి ఇచ్చి వేశారు. ఈ రీతిగా ఆసాధ్వీమణి తన భర్తలో సంస్కారాన్ని జాగృతం గావించింది.

మిత్రులారా! మన సంతతి యొక్క జీవితాలను సుఖసమృద్ధి గావించుటకై సంపదలను (డబ్బు, బంగారం, స్థిరాస్తులు) ఇచ్చినచో వారు పెద్దవారైన తరువాత అత్యంత సుఖంగా జీవిస్తారనెడి భ్రమలో ఉన్నాం. ఇది చాలా తప్పు.

ఒక పెద్దమనిషి రెండు చేతులా ధనాన్ని, వెండి, బంగారాన్ని ఆర్జించి గాదెలకు నింపి, తన ఒక్కగానొక్క కుమారుని సుఖ సంతోషాలకై ఇంటిలో దాచాడు. పిల్లవాడు పెరిగి పెద్దవాడయ్యే సరికి పెద్దమనిషి తనువు చాలించాడు. చుట్టుప్రక్కల వారంతా, ఆ పిల్లవాని సంపదల వారసత్వాన్ని చూసి ఈర్ష్య చెందారు, అతని అదృష్టాన్ని పొగిడారు. ఆ యువకుని చేతికి అందిన వారసత్వ సంపద అచిరకాలంలోనే అందరూ చూస్తుండగానే హారతి కర్పూరంలా కరిగిపోయింది. దీనితో బికారియై యాచనకు దిగాడు.

మిత్రులారా! చూశారా! సంస్కృతి విహీనతతో వ్యక్తికి సంప్రాప్తించెడి ఫలితం, జీవనం ఎంత దారుణంగా ఉంటుందో మీరే ఊహించుకోవచ్చు. మిత్రులారా! కుసంస్కారాలతో, దుర్నీతులతో కూడిన గృహస్థ జీవనం, సమాజం, ఆటంబాంబు ప్రేలితే వచ్చెడి ప్రమాదం కన్నా అత్యంత భయంకరమైనది, ఫలితాలు దారుణంగా ఉంటాయి. కావున సరియైన సంస్కారాలను అందించి మన గృహస్థవ్యవస్థను కాపాడుకొనుట మనందరి బాధ్యత. దీనికై గాయత్రీ పరివార్ నడుం బిగించాలి.

## 08.10.2014 - డా॥ ఓ.పి.శర్మగారి ప్రవచనం

వీరు ఉత్తరప్రదేశ్ లక్నో మెడికల్ కాలేజి నుండి 1967లో ఎం.బి.బి.ఎస్. మరియు రేడియాలజి కోర్సులలో ఉత్తీర్ణులు అయ్యారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలో జాయింట్ డైరెక్టరు, డిపార్ట్‌మెంటు ఆఫ్ మెడిసిన్‌గా పదవీ విరమణ చేసి శాంతి కుంజ్‌లో చేరి, పూజ్యగురుదేవుల సందేశాన్ని వినిపించుటకై దేశవిదేశాలలో పలుమార్లు పర్యటించారు. దేవసంస్కృతి విశ్వ విద్యాలయం మరియు వేదమాత గాయత్రీ ట్రస్టు యాజమాన్య బాధ్యతలలో పాలుపంచుకొనుచున్న బుద్ధిశాలి. వీరు గాయత్రీ మంత్ర విశిష్టతను, మంత్రసాధన గురించి ప్రవచించారు.

మిత్రులారా! పరమపావన ఋషి తపోస్థలి, గాయత్రీతీర్థ్, శాంతికుంజ్‌లో అడుగిడిన మీరంతా అత్యంత భాగ్యశాలురు. గాయత్రీమాత, వేదమాత అన్ని మంత్రాలకు మూలమంత్రం. వేదాలలో 20,000 మంత్రాలున్నాయి. వీటన్నింటికి మూల మంత్రము గాయత్రీ మంత్రము. అధర్వణ వేదములో గాయత్రీ మంత్రాన్ని వివరిస్తూ, ఇది స్వచ్ఛమైనది, పవిత్రమైనదిగా పేర్కొనుట జరిగింది. “ఓం! స్తుతా! మయా! వరదా! వేదమాతా! ప్రచోదయంతాం! పావమాని ద్విజానాం ఆయుః ప్రాణం,

**మన ఇంటికి వచ్చిన వారిని ఎవరినీ ఆకలితో పంపకూడదు**

ప్రజాం, పశుం, కీర్తి, ద్రవిణం, బ్రహ్మవర్చస్సు, మహ్యం, దత్వ వ్రజత బ్రహ్మలోకం" – అని అధర్వణ వేదంలో గాయత్రీ మంత్రాన్ని కీర్తించుట జరిగింది. అనగా గాయత్రీ మంత్ర సాధకునికి పవిత్రతతోపాటు, ద్విజత్వం, ఆయువు, ప్రాణశక్తి, సంతతి, పశుసంపద, కీర్తి, సంపదలు, బ్రహ్మజ్ఞాన ప్రాప్తి తద్వారా వర్చస్సు, సురదుర్లభమైన బ్రహ్మలోక ప్రాప్తి లభిస్తాయి.

మిత్రులారా! గాయత్రీమంత్ర సాధకుడు సంయమం కలిగిన సేవకునిలా ఎదగాలి. ఒక నిత్యకర్మయోగిలా రూపుదాల్చాలి. ఇతడు సేవకునిగా కర్తవ్యపాలనాతత్పరునిలా, ప్రసన్నమైన మోముతో సదా జీవించాలి. ఇట్టి సాధకుడు నిగర్విలా, నిరహంకారిలా వినమ్రతతో కూడిన వ్యక్తిలా రూపొందాలి. గాయత్రీ పారస్! (మట్టిని మాణిక్యంగా మార్చేసి), అమృత తుల్యం (అల్పాయుష్కుని చిరంజీవిలా), శక్తిప్రదాయిని, కామధేనువు (కోరినంతనే కోరిన వానిని అందించేది) కల్పవృక్షం (తన నీడన చేరిన వారి కోర్కెలను తీర్చి కాచి కాపాడుతుంది). వీనికి తోడు గాయత్రీ, సర్వ దేవతలకు మూలదేవత కావున సర్వదేవి దేవతాశక్తుల అందిస్తుంది. గాయత్రీ ఉపాసకునికి ఋషిగుణ గణాలు అద్భుతాలు. అనగా ఋషిలా భూత భవిష్య వర్తమానాల దర్శించగలడు. గాయత్రీ మంత్రం, ఛందస్సుతో కూడి దివ్యశక్తి ప్రదాయిని. గాయత్రీ స్థూలరూపం సూర్యుడు–సవితాశక్తి. గాయత్రీ ఉపాసనతో విశ్వామిత్ర మహర్షి వశిష్ఠునిలా, బ్రహ్మర్షిలా రూపుదాల్చాడు. విశ్వామిత్రుడు ఈ రీతిగా విశ్వానికి మిత్రుడయ్యాడు.

మిత్రులారా! పరమపూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య తన 15వ యేట నుండి 40వ యేట వరకు నిత్యము 7 గంటల గాయత్రీ మంత్రోపాసన చేసి తానే గాయత్రీలా మారారు. ఈ శక్తితో చదివింది 5వ తరగతి అయినా చతుర్వేదాలకు భాష్యం వ్రాశారు. దీనితోపాటు 108 ఉపనిషత్తులకు వ్యాఖ్యానం చేశారు. అరణ్యాలకు వ్యాఖ్య చేశారు. దీనికి తోడు 3200 పై చిలుకు గ్రంథాలు రచించి, మానవుడు, మహామానవునిగా, దేవమానవునిగా ఎదుగుటకు కావలసిన జ్ఞాన భాండాగారాన్ని అందించారు. గాయత్రీ సాధనను సరళతరంగావించి, జాతి, మత, కుల, వర్ణ, వయోలింగ భేదాలకు అతీతంగా చేసి మానవజాతికందించిన అపర కలి యుగ విశ్వామిత్రుడు, జబ్బు పడినవారు, పరిపూర్ణ విశ్వాసంతో నియమబద్ధంగా, గాయత్రీ మంత్రోపాసన చేసినచో వారి మనోబలం, బుద్ధిబలం, సంకల్పశక్తి బలోపేతమై నూతన జవ సత్వాల పొందుతారు, మందులు కాదు పనిచేసేది వారిలోని విశ్వాసం, సంకల్పశక్తి, మనోబలం పనిచేసి రోగ విముక్తులు అవుటకు మార్గం సుగమం అవుతుంది. ఒక వైద్యునిగా నా అభిప్రాయాలను, అనుభవాన్ని మీ ముందుంచుతున్నాను.

మిత్రులారా! పూజ్య గురుదేవులు ఈ రీతిగా ప్రకటించారు. మీరంతా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గాయత్రీ ఉపాసనలో ఇట్టి మీకు కావలసిన శక్తిని, తాను ఆర్జించి కూడబెట్టిన తపస్సులోనుండి, తండ్రి తన సంతానానికి తన ఆస్తిలో భాగమిచ్చిన రీతిలో మీకు మీ అర్హతానుసారం అందించెదను. కావున మనమంతా ఆయన లక్ష్యమైన యుగనిర్మాణ సాధనలో మనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించి ఆయన తపశ్శక్తిని పొందుటలో తగిన అర్హతను పొందుట తప్పనిసరి. దీనికై నిత్యం మూడు మాలలు జపసాధన తప్పనిసరి. ఒక మాల మనకు, రెండవది పరివారానికి, మూడవది సమాజానికి. జపమాలగా తులసి మాలను ఉపయోగించుట ఉత్తమము. రుద్రాక్షమాలను వాడవలదు. దానినుండి వెలువడెడి శక్తితరంగాలను మీ శరీరము అందిపుచ్చుకొనగల్గెడి శక్తిని కలిగి ఉండనిచో అనర్థము కలుగుతుంది. కావున తులసిమాల ఎల్లవేళల అందరికీ శ్రేష్ఠము.

నిత్యం ఒక గంట గాయత్రీమంత్ర జపం ద్వారా రోగ పీడితులు, మనఃశాంతిని పొందుట ద్వారా వారిలోని భయ భ్రాంతులు కోపం, దుర్భలత్వము నశించి, శాంతచిత్తులు అవుతారు. దీనితో క్రమక్రమంగా వారిలో మనోబలం పెరిగి ఆత్మవిశ్వాసం పెరిగి, రక్తపోటు సాధారణ స్థితికి వచ్చి, రోగవిముక్తులవుతారు. పై వానికి గాయత్రీ చాలీసా పఠనము, సద్గ్రంథ పఠనము (స్వాధ్యాయం) సత్సంగములో పాల్గొనుట మున్నగునవి అత్యంత సహాయకారులుగా నిలుస్తాయి. వానికి తోడు వారంలో ఒకరోజు ఉపవాసం చేయుట మంచిది. అట్లు ఉండలేనివారు ఉప్పుకారం లేని భోజనం, పెరుగు, మజ్జిగ, ఇడ్లీ తినవచ్చు. నీరు ఎక్కువగా త్రాగాలి. సాధ్యమైనంత ఎక్కువసేపు ఆ రోజు మౌనాన్ని పాటించాలి. దీనికి మహాత్మా గాంధీ జీవితము ఒక చక్కని ఉదాహరణ. మౌనంలో చాలా శక్తి దాగి ఉన్నది. దీనివలన మనోబలంతో, సంకల్పశక్తి కూడా

**మీకు నచ్చిన పనే చేయండి కానీ అది ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదు**

పెరుగుతుంది. ఈ ఉపవాసకాలమందు బ్రహ్మచర్యాన్ని తప్పక పాటించాలి. బ్రహ్మచర్యమనగా, ఆ దినమంతా మనస్సు బ్రహ్మ మందు చరిస్తూ ఉండేలా చూసుకోవాలి. గాయత్రీమాత ఒడిలో సేద తీరుతున్నామనెడి భావనలో ఉండండి. పవిత్ర ఆలోచనలతో గడపండి.

ప్రతిరోజు కనీసం 2 గంటల సేపైనా సమయదానం ఇవ్వండి. సేవా కార్యక్రమాలలో తప్పనిసరిగా పాల్గొనండి. జ్ఞానఘటాన్ని వ్యాప్తిలోనికి తెచ్చి, ప్రజలలో దాని ఉపయోగాన్ని తెలిపి, దీనివలన వచ్చెడి ఫలితాలను తెలుపుతూ పూజ్య గురుదేవుల "నాటుకోండి-కోసుకోండి" అనెడి ప్రబోధానికి కార్యరూపాన్ని ఇవ్వండి, ఇది యుగ పరివర్తనలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

మిత్రులారా! ప్రతిరోజు త్రికాల సంధ్యను పాటించుట అలవరచుకోండి.

సూర్యోదయానికి $1^1/_2$ గంటల ముందు మధ్యాహ్నం 12 గం॥ల నుండి 2 గం॥ల మధ్యలో, సాయంత్రం సూర్యాస్తమయానికి గంట ముందుగా జపంచేసి అర్ఘ్యం ఇవ్వండి. గాయత్రీమంత్రజపంతో, శబ్దోచ్ఛారణతో మెదడులోని నాడీ వ్యవస్థలో మరియు కండరాల మధ్య ఒక విధమైన ఒత్తిడితో కూడిన రాపిడి జనిస్తుంది. దానితో అచ్చటి నాడీవ్యవస్థ తేజోవంతమై భావోద్వేగాలను పెంపొందించి సదాలోచనలకు, సత్కర్మలకు దారిని సుగమం చేస్తుంది. వీనికి తోడు రచనాత్మక శక్తి అనగా సృజనాత్మక శక్తి నిర్మాణాత్మక శక్తి పెంపొంది దేవమానవునిగా ఎదిగెడి క్రమంలో పయనిస్తాడు. చందన లేక తులసిమాల జపానికి శ్రేష్టము. నిత్యము క్రమంతప్పక గంటసేపు చేయుట ద్వారా సాధకుని భావోద్రేకాలు నియంత్రించబడి అతని రక్తపోటు, మనస్సులోని ఆలోచనలు సంస్కరింపబడుతూ సంయమనం పెంపొందుచూ అన్ని విధాలా శాంతి మార్గాన్ని అనుసరిస్తాడు. క్రోధ అహంకారాల నుండి విముక్తుడు అవుతాడు.

పైవానికి తోడుగా స్వాధ్యాయం చేయుట ద్వారా, సద్గ్రంధ పఠనంతో వ్యక్తిలోని వివేకం జాగృతమై విచక్షణాశీలిగా మారి, శాంత చిత్తంతో పయనించుట జరుగుతుంది. గాయత్రీ చాలీసా నిత్యం పారాయణ, భావయుక్తంగా చేసినచో మరిన్ని సత్ఫలితాలను ఇస్తుంది. తదుపరి సాధనగా వారంలో ఒకరోజు ఉపవాసం ఉండుట మంచిది. ఉపవాసమున్న రోజు నిమ్మరసంతో నీటిని త్రాగుతూ ఉండుట చక్కని ఫలితాలను ఇస్తుంది. అట్లే అస్వాదు భోజనము చేయుట చాలా మంచిది. అనగా ఉప్పుకారంలేని చప్పిటి ఆహారాన్ని తినాలి. తీపి పదార్థాలను తినరాదు. దీనివలన వ్యక్తిలోని భావోద్రేకాలు నియంత్రించబడి, ఆలోచనాపరునిగా మారి, ఆత్మవికాసానికి దారి తీస్తుంది. నిరహంకారిలా, నిగర్విలా మారగలడు. అంతర్గతంగా శాంతి నెలకొంటుంది. ముఖ వర్చస్సుతోపాటు, మనోవర్చస్సు కూడా పెంపొంది, ప్రకటీకృతమవుతుంది.

వారానికి ఒకరోజు మౌనవ్రతాన్ని అనుసరించుట అత్యంత లాభదాయకం. ఈ రీతిగా వాక్‌శక్తి, ప్రోది చేసికొని తద్వారా వాక్ నియంత్రణను క్రమక్రమంగా పెంపొందించుకొంటూ నిగ్రహ శక్తిని పెంపొందించుకొనగలము. బ్రహ్మచర్య దినాన్ని పవిత్ర ఆలోచనలతో దినమంతా గడపాలి.

తదుపరి సమయదానం మరియు అంశదానాలు చేయుట నిత్య జీవితంలో ఒక అంతర్భాగంగా మారాలి. సమయదానాన్ని ప్రజ్ఞాపీఠం / మహిళామండలి / శక్తిపీఠం రూపొందించిన లేక చేపట్టిన కార్యక్రమాల ఆచరణకై వినియోగించుట సాధకుని కర్తవ్యం. సమాజ కళ్యాణానికి పాటుపడాలి నిస్వార్థ బుద్ధితో, నిష్కళంక మనస్సుతో. అట్లే వ్యక్తి తన రోజువారి సంపాదనలో కొంత భాగాన్ని ప్రజ్ఞాపీఠం / శక్తిపీఠం మరియు సమాజ కళ్యాణానికై వెచ్చించాలి. సామూహిక కార్యక్రమాలకు చేయూతను ఇవ్వాలి. జ్ఞానదానం చెయ్యాలి. విద్యనేర్పుట ద్వారా, సాహిత్యపంపిణీ ద్వారా, పై రీతిలో సాధకుడు తన రోజువారి జీవితాన్ని తీర్చిదిద్దుకుంటూ పూజ్యగురుదేవుల మార్గంలో వారి అడుగుజాడలలో నడచిన, ఆ గాయత్రీమాత కృపకు పాత్రుడు కాగలడు.

## ఆదరణీయ శ్రీ పరమానంద ద్వివేదిగారి ప్రవచనం

### వ్యక్తి నిర్మాణం - సమాజ నిర్మాణం:

మిత్రులారా! దేవతా స్వరూపులారా! నాతోపాటు గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించండి.

గాయత్రీ మంత్రార్థం మీ అందరికి తెలుసు. ప్రాణ స్వరూపం, సుఖస్వరూపం, పాపనాశకం, దుఃఖనాశకం, కష్ట నివారణ అయిన ఆ పరమాత్మను మా హృదయంలో

**మిమ్మల్ని మీరు ప్రగాఢంగా విశ్వసించండి**

ధరించెదముగాక. ఆ ప్రేమ స్వరూపి మమ్ముల సన్మార్గం వైపు నడిపంచుగాక.

గాయత్రీ జపం ద్వారా మనుజుల హృదయాలలో సదాలోచనల పెంపొందింపజేసి సత్ప్రవర్తన ద్వారా సమాజంలో సుఖశాంతులు ఏర్పడి పరస్పర ప్రేమ, సహకారాలు వెల్లి విరుస్తాయి. వ్యక్తి ప్రగతి, కుటుంబ ప్రగతితోపాటు సమాజ ప్రగతికి దారితీస్తుంది. నేటి కలియుగ సమాజంలో వీటి అవసరం ఎంతైనా ఉన్నది. వ్యక్తులమధ్య, కుటుంబాల మధ్య, తెగల మధ్య, కులాల మధ్య, ప్రాంతాల మధ్య, దేశాల మధ్య అసమానతలు పెరిగి, ప్రేమతత్వం నశించి, ఒరిమి నశించి, అవగాహన నశించి, స్వార్థపరత్వం పెరిగి, ధనాకాంక్ష పెరిగి, వ్యక్తి విలువ నశించి, ధనానికి విలువ పెరిగి అనేకానేక సంఘర్షణలు నిత్యకృత్యములయ్యాయి. పై సమస్యలనన్నింటికి పరిష్కారం, వ్యక్తి నిర్మాణంతో లభిస్తుంది. దీనికై సామూహికంగా వ్యక్తి నిర్మాణం జరిపించాలి. కలియుగ ధర్మాన్ని అనుసరించి, సామూహిక శక్తియే ఈ యుగశక్తిగా శాస్త్రాలు తెలుపు తున్నాయి. పురాణకాలమందు దేవతల మధ్య అనైక్యత చోటు చేసికోగా, రాక్షసశక్తులు విజృంభించి రక్తబీజుడు, మహిషా సురుడు మున్నగు రాక్షసులు ఆవిర్భవించి, భూమిపై అశాంతిని నెలకొల్పారు. వీరిని నిర్జించుట దేవతలలో ఎవ్వరికీ సాధ్యపడలేదు. అప్పుడు దేవతలంతా తమ తప్పిదాల గుర్తించి, తమ శక్తులనన్నింటిని ఒకచోట చేర్చి, దుర్గావతరణకు శ్రీకారం చుట్టారు. అప్పుడు సామూహిక శక్తిగా దుర్గాదేవి అవతరించి రాక్షసుల సంహరించి, తిరిగి దైవీశక్తులకు రక్షణ కల్పించింది. అట్లే త్రేతాయుగంలో చిన్న రాజ్యాలపై దండయాత్రలు చేస్తూ ఖర-దుషాణాదులు మిక్కిలి భయోత్పాతాన్ని కలిగించారు. అప్పుడు రామావతారంలో దైవీశక్తి అవతరించి రాక్షస సంహారం జరిపి శాంతిని నెలకొల్పించి, తదుపరి వానర భల్లూక సేనలతో కలసి రావణ సంహారం చేశారు. ద్వాపరయుగంలో రాక్షస భావాలకు ప్రతీకలైన కౌరవ సంహారం కృష్ణుడు చేయించాడు. 7 అక్షేహిణుల చేతిలో 11 అక్షౌహిణుల సేన పరాజయాన్ని చవిచూచింది. నేటి కలియుగంలో వెయ్యి సంవత్సరాలకు వెనక్కి వెళితే చిన్న చిన్న రాజ్యాలు యువసేన చంద్రగుప్తుని నాయకత్వంలో ఒకచోట చేర్చి బలీయమైన మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించి హిందూ ధర్మాన్ని, ఆర్ష సంస్కృతిని పునర్జీవింప జేశాడు. సికిందర్ కుమార్తెకు చంద్రగుప్తునితో వివాహం జరిపించి గుప్త సామ్రాజ్యానికి శత్రు భయం లేకుండా చేసి, గుప్త సామ్రాజ్యాన్ని అజేయమైన శక్తిగా తీర్చిదిద్దాడు.

భారతీయులు, భారతీయ సంస్కృతి వసుధైవ కుటుంబకమ్, పశుపక్ష్యాదులు (గోవు, గరుడపక్షి) వృక్షాలను (వేప, రావి, తులసి) సైతం మనం మన పరివారంగా చూచెడి సంస్కృతి మనది. ఇట్టి విలక్షణతో కూడిన విశిష్టమైన మన సంస్కృతి నేడు మసిబారిపోయి, కుల, మత, వర్ణ, ప్రాంతీయ, భాష బేధాలతో చిందరవందరగా వంచింది. ఇట్టి స్థితిలో అల్లావుద్దీన్ ఖిల్జీ మనపై దండయాత్ర చేశాడు.

పూజ్యగురుదేవులు తన వాఙ్మయంలో వ్రాశారు. మనం కేవలం పేరుకు హిందువులుగా జీవిస్తున్నాం, అంతేగాని నిజమైన హిందూ వారసులుగా జీవించుట లేదు. వృత్తుల ఆధారంగా జీవించుట మానివేశాం. బ్రాహ్మణులుగా అనగా బ్రహ్మజ్ఞానులుగా, క్షత్రియులుగా అనగా సమాజ రక్షకులుగా, వైశ్యులుగా అనగా సమాజ అవసరాలు తీర్చేవారిలా, చివరకు శూద్రులుగా అనగా సమాజానికి కావలసిన సేవలు అందించే వారిలా జీవించుట మరచాం. కేవలం వృత్తులు కాస్త కులాలుగా రూపాంతరం చెంది, సమాజాన్ని అగ్ర-నిమ్న జాతులుగా విభజించి, కుమ్ములాటలకు, వర్గపోరాటాలకు తెరతీసింది. తద్వారా దేశసుస్థిరతకు భంగం కలిగించింది. దీనికంతటికీ కారణం ప్రజల్లో, సమాజంలో నైతిక, బౌద్ధిక, సామాజిక ధర్మాలు అడుగంటాయి. వీనిని తిరిగి ధర్మాధారంగా నెలకొల్పవలసి ఉంది. జిమ్మేదారి, బహదూరి, సంయమనం, సేవాగుణాలు తిరిగి మనిషిలో పాదుకొల్పబడాలి. సంఘం, బుద్ధం, ధర్మం, శరణం గచ్ఛామి ఆవిర్భవింపబడాలి. నైతిక క్రాంతి, బౌద్ధిక క్రాంతి, సామాజిక క్రాంతి పునర్జీవింపబడాలి. బ్రాహ్మణత్వంమనెడిడి జన్మతో కాక, వృత్తితో, కర్మతో గుర్తింపబడాలి, జోడింపబడాలి.

ప్రేమ, కరుణ, దయ, ఆదరణ, జ్ఞానం, తపస్సు, మున్నగు తత్వాలు, బ్రాహ్మణ లక్షణాలు కావాలి. మంత్రజపం, క్రతువులు, యజ్ఞయాగాలు మున్నగునవి ఒక కర్మకాండలుగా కాక, జ్ఞానమార్గాలుగా రూపుదాల్చాలి. మరుగునపడిన సత్య ప్రకటన సత్యవ్రతం, శ్రమశీలత తిరిగి వ్యక్తిత్వం తిరిగి సక్రమ మార్గంలో నడవాలి. సమాజానికి కావలసిన సన్మార్గదర్శనం

**ఇష్టంలేని పనిలో మగ్గిపోకండి**

చెయ్యాలి. ఆత్మబలం క్షీణించి, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి, సరియైన మార్గ నిర్దేశనం లభించక యువత అపమార్గాన్ని పట్టి సమాజానికి మోయలేని భారంగా రూపుదాల్చింది. అశాంతికి భయానికి లోనైన యువత మాదకద్రవ్యాల వెంట మత్తు పదార్థాల వెంట పడి, వానిని సేవించి మనశ్శాంతిని పొందుచున్నామనెడి భ్రాంతికి, ఆత్మవంచనకులోనై నిర్వీర్యంగా మారింది. శ్రమించుట ఆత్మన్యూనతగా భావించెడి దశలో జీవిస్తూ యాచనకు, దొంగతనాలకు, మోసాలకు పాల్పడుతూ సమాజ విచ్ఛితికి, అశాంతికి కారణమగుచున్నది. స్వార్థం ప్రబలి, ధనార్జనే ధ్యేయంగా పెట్టుకుని అనుసరించెడి పద్ధతులు, చరించెడి మార్గాన్ని మంచిచెడుల వివేకాన్ని త్రోసిరాజని జీవితాలను కొనసాగించుట నేటి మానవ నైజంగా మారింది. కర్మ సిద్ధాంతాన్ని వీడి భోగసిద్ధాంతాన్ని నమ్మి సంస్కార విహీనంగా నడచుచున్నది. సంత్ కబీరు సమాజ స్థితిని వర్ణిస్తూ "జ్ఞాని దుఃఖితునిగా, సంసారి మరియు భోగాల వెంటపడి పరుగులిడుచున్నారు" అన్నారు. పునర్జన్మ ఉన్నదనెడి సత్యాన్ని మరచి మరుజన్మలో ప్రారబ్ధకర్మను తప్పనిసరిగా చక్రవడ్డీతో సహా అనుభవించి తీరక తప్పదనెడి సత్యాన్ని మరచాం. పాశ్చాత్య సంస్కృతి ఒరవడిలో కొట్టుకొనిపోతూ భౌతిక ఆనందమే. సర్వస్వమని, శాశ్వతమనెడి భ్రాంతిలో పడి పోవుచున్నది సమాజం. ఆధునిక విద్యా విధానం ద్వారా నేటిబాలలు (రేపటి భావిభారతపౌరులు) మన ప్రాచీన విద్యావిధానాన్ని మాతృభాషకు దూరమై పరాయి సంస్కృతీ సంప్రదాయాల పట్ల వ్యామోహితులై, జీవంలేని, సృజనాత్మకత నివ్వని ఆంగ్లభాషా బోధనకు బానిసలై, మూసపోసిన రీతిలో తమ విద్యార్థి దశను పూర్తిగావించుకొని సమాజంలో అడుగిడు చున్నారు. ఇట్టి వీరు చదివిన చదువును లభించిన లేశపాటి జ్ఞానాన్ని ఎట్లు తమ నిత్యజీవితంలో వినియోగించు కోవాలో తెలియక తమకాళ్ళపై నిలచి, జీవనభృతిని సంపాదించు కొనజాలని అత్యంత దైన్యస్థితిలో, చాలీచాలని వేతనాలతో, బ్రతుకుబండి బ్రతుకును లాగుచున్నారు. ఈవిధంగా దేశంలోని యువశక్తి 70% నిర్వీర్యంగా పడి ఉండుట మిగుల శోచనీయం, తీవ్రంగా ఆలోచింప వలసిన విషయం కూడా.

పై సమస్యలన్నింటికి పరిష్కారం పూజ్యగురుదేవులు తమ సాహిత్యం ద్వారా సమాజానికి అందించారు. అదే వ్యక్తిత్వ నిర్మాణం కుటుంబ నిర్మాణం మరియు సమాజనిర్మాణం ద్వారా మాత్రమే సాధ్యమని విశదీకరించి చెప్పారు. దీనికై మన ప్రాథమిక మరియు మాధ్యమిక విద్యావిధానంలో తగిన మార్పులు చేసి, ఉన్నత పాఠశాల విద్యను పూర్తిగావించుకొన్న ప్రతి విద్యార్థి, స్వావలంబన అందించెడి వృత్తి విద్యలను, తగిన నైపుణ్యాలను విద్యార్థి దశలోనే పొంది తగిన విధంగా శిక్షణను పొందాలి.

పైవానిని ఆచరణలోనికి తెచ్చి, సమాజ కళ్యాణానికి, తద్వారా విశ్వకళ్యాణానికి కృషి చేయుటకై గాయత్రీ పరివార్‌ను పూజ్యగురుదేవులు స్థాపించుట జరిగింది. దీనికై హరిద్వార్ లోని గాయత్రీతీర్థ్ శాంతికుంజ్‌ను ఏర్పాటు చేశారు.

## డా॥ విలియమ్ వారేల్

*అమెరికాలోని రోచెష్టర్ నగరం యొక్క "మేయో హాస్పిటల్" ఈనాడు సాటిలేని మేటి ఆసుపత్రిగా ఖ్యాతి చెందింది. దీనిని నాలుగు తరాల వెనుక డా॥ విలియమ్ వారేల్ తన ఇంట్లోనే తన కుటుంబ సభ్యులతోనే ప్రారంభించటం జరిగింది. రోగుల పట్ల పూర్తి శ్రద్ధ, హృదయం నిండుగా సానుభూతి, పెట్టుబడిగా పెట్టి ఈయన చేసిన చిన్న ప్రయోగం ఆశ్చర్యాన్ని కలిగించే టంతగా అభివృద్ధిని సాధించింది. ఈ ఆసుపత్రిలో ఈనాడు 900 మంది సర్జన్‌లు, 338 మంది ఫిజీషియన్‌లు, 575 మంది సాధారణ డాక్టర్లు ఉన్నారు. దేశవిదేశాల నుండి వచ్చి తమ అసాధ్య రోగాలకు వైద్యం చేయించుకునే రోగుల సంఖ్య 1,80,000 వరకు ఉంటుంది. ఆకాశాన్ని తాకేటట్టు ఉండే ఈ ఆసుపత్రి భవనాలలో ఒక మంచి మెడికల్ కాలేజి కూడా ఉన్నది. విశేషమేమిటంటే ఈ ఆసుపత్రిలో డాక్టర్ రోగిపట్ల సాధ్యమైనంత ఎక్కువ సానుభూతి కలిగి ఉండి సేవచేసేటట్లుగా శిక్షణీయబడుతూ ఉంటుంది. అంతేగాక డా॥ వారేల్ యొక్క నాలుగు తరాలవారు ఈ భావాలతో, ఇదే విధంగా జీవితాలు గడపడం గమనించ వలసిన విషయం. ఆదర్శవంతమైన ఇలాంటి సంస్థను, తరతరాలుగా నిలబెడుతూ వస్తున్నందుకు వీరు సదా స్మరణీయులు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**ఏ పని అయితే సంతోషంగా చేస్తారో ఆ పనిలో విజయం సాధించే అవకాశాలు ఎక్కువ**

# స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 8

### శ్రీమతి తిరుమలరాజు పద్మావతి



శ్రీమతి తిరుమలరాజు పద్మావతిగారు, శ్రీ గాదెరాజు సత్యన్నారాయణ రాజు, వరహాలమ్మ దంపతులకు ముంగినాపల్లి గ్రా॥, డెంకాడ మం॥, విజయనగరం జిల్లాలో 1960లో జన్మించారు. 7వ తరగతివరకు ప్రాథమిక విద్యాభ్యాసాన్ని జన్మించిన గ్రామంలోనే పూర్తిగావించి తదుపరి మెట్రిక్యులేషన్ విద్యను విజయనగరంలో పూర్తిచేశారు. బాల్యం నుండి వీరికి భగవద్భక్తి మెండు. అట్టి వాతావరణంలో పెరిగారు. తరచుగా లలితా సహస్రనామావళి, భగవద్గీత పారాయణలు చేస్తుండేవారు. దీనితో భక్తిమండళ్ళకు చేరువయ్యారు.

1978లో శ్రీలక్ష్మీపతిరాజుగారితో వివాహం జరిగింది. వీరిని అన్యోన్యదాంపత్యం. ఆదర్శ గృహిణిగా ఒక వంక తన బాధ్యతల చక్కగా నిర్వహిస్తూ మరో ప్రక్క కుటుంబ ఆదాయాన్ని పెంచుటకై తనవంతు ప్రయత్నాలను చురుకుగా కొనసాగిస్తూ ఉండేవారు. స్వగృహ పిండివంటల తయారుచేయుటలో ప్రావీణ్యాన్ని సంపాదించిన వీరు ఇంటిలోనే ఉంటూ వ్యాపారాన్ని తన స్వగృహంలో ప్రారంభించి తద్వారా కుటుంబాన్ని ఆర్థికంగా పటిష్టపరచుటలో తనవంతు కర్తవ్యాన్ని పూరిస్తున్న ధీశాలి. క్రమక్రమంగా తనవద్దకు వచ్చెడి గృహిణుల అవసరాలను గుర్తించి, వారి అవసరాల తీర్చుతూ చక్కని అనుబంధాన్ని వారితో పెంచుకొనుచున్న మాటకారి, నేర్పరి. సంక్రాంతి, ఉగాది, శ్రావణ, కార్తీకమాస పుణ్యపర్వముల సమయంలో సేలం, ఉప్పాడ, మంగళగిరి, బొబ్బిలి, ధర్మవరం మున్నగు పేరెన్నికగన్న నేత చీరల ఉత్పత్తి కేంద్రాల నుండి చీరలు తెప్పించి, వానిని ప్రత్యేక డిజైన్లలో తీర్చిదిద్ది ఖాతాదార్లకు అందిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి.

పండిత శ్రీరామశర్మ ఆచార్య "నాటు–కోసుకో" అనే సూత్రాన్ని తన నిత్య జీవితంలో ఆచరణలో పెట్టి ప్రతిఏటా కొంత ధనాన్ని అర్హులైన పేద విద్యార్థులకందిస్తూ వారి విద్యార్జనకు తోడ్పాటును అందిస్తున్న కారుణ్యశీలి–అన్నింటికన్న మిగుల ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. తన ఇంటిలో గత దశాబ్దానికి పైచిలుకు కాలం నుండి పాచి పని చేస్తున్న ఒక పేద బాలికకు తన విద్యార్జనకై ధన వస్తు సహాయాన్ని అందిస్తూ పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుటలో బహు విధాలా ఆమెకు సహకరిస్తూ పరమ వందనీయ మాతాజీకి వారసురాలిగా తన జీవితాన్ని మలచుకొనుచున్న సమర్పణశీలి.

2007 నుండి గాయత్రీ పరివార్ విజయనగరం శాఖ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటూ అనేకానేక యజ్ఞాలలో పాలుపంచుకొన్నారు. మూడు పర్యాయాలు శాంతికుంజ్, హరిద్వార్‌లో నిర్వహించిన తెలుగువారి శిక్షణా శిబిరాల్లో పాల్గొన్నారు. 2011లో పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది వేడుకల్లో పాల్గొన్నారు.

గాయత్రీ పరివార్ ప్రముఖ కార్యకర్తలైన శ్రీమతి రూపవాణి శ్రీ పండా మరియు శ్రీమతి దంతులూరి పద్మావతిగార్లతో కలసి అనేకానేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ అశ్విని సుబ్బారావు గారి ప్రేరణతో పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని దాదాపు పదిహేనువేల రూపాయల వరకు విక్రయించారు.

కొంతకాలం నుండి అనారోగ్యంతో స్థూలకాయంతో అసౌకర్యానికి గురియై ఉన్నప్పటికీ మొక్కవోని ఉత్సాహంతో, అలుపెరుగక కుటుంబ మరియు గాయత్రీ పరివార్ పనులు చేస్తూ నిండైన మనస్సుతో, భక్తిశ్రద్ధలతో పూజ్యగురుదేవులపై అచంచల విశ్వాసంతో తనవంతు యుగనిర్మాణ కార్యకలాపాలను నిర్వహించుచున్నారు. తన కుమార్తెకు కూడా పూజ్యగురుయుగ్మం పట్ల శ్రద్ధాసక్తుల కల్పించి, ఆమెను తనకు నిజమైన వారసురాలిగా పూజ్యగురుదేవుల దివ్యాశీస్సులు లభించాలని యుగశక్తి గాయత్రి కోరుతున్నది.

### శ్రీమతి దంతలూరి పద్మావతి



శ్రీమతి దంతలూరి పద్మావతిగారు, శ్రీ గణపతిరాజు వెంకటపతిరాజు–అన్న పూర్ణమ దంపతులకు దాసన్నపేట, విజయనగరం 1964లో జన్మించారు. బి.ఎ. ఆర్థికశాస్త్రం మరియు సంగీతం పట్టా పుచ్చుకొన్నారు. తదుపరి ఎమ్.ఎస్.సి. సామాజిక శాస్త్రంలో పట్టా పొందారు. 1984లో శ్రీ డి.వి.ఎస్. ఎ.ఎన్.రాజుగారితో వివాహం జరిగింది. భర్త కూడా ఎమ్.కామ్ చదివారు.

**కష్టాలు వచ్చినప్పుడు నవ్వుతూ ఉండే వారిని చూసి ఉత్సాహం తెచ్చుకోవాలి**


బ్యాంకింగ్ రంగంలో స్థిరపడి ఉద్యోగం చేస్తున్నారు. శ్రీమతి పద్మావతి గారికి రూపంతోపాటు చక్కని గాత్రాన్ని అందించారు ఆ భగవంతుడు. ఆ భగవంతుని మెప్పించేలా ఆమె పూజ్య గురుదేవుల ప్రేరణా గీతాలను వీనుల విందుగా ఆలపిస్తూ భక్తులను, సాధకులను భక్తిపార వశ్యంలోనికి తీసికొనివెళ్ళుట ఆమెకు వెన్నతో పెట్టిన విద్య.

వీరు 2005లో భీమునిపట్నంలో ఉన్న గాయత్రీ ప్రజ్ఞా పీఠం కార్యకలాపాల ద్వారా ప్రభావితులై గాయత్రీ పరివార్‌తో జోడింపబడ్డారు. తదుపరి శ్రీ పండాగారితో మరియు శ్రీమతి రూపవాణిగార్ల సహకారంతో అనేకానేక కార్యక్రమాలు విజయనగరం, విశాఖపట్నంలలో నిర్వహించారు.

శ్రీమతి తిరుమలరాజు పద్మావతిగారితో కలసి "పద్మావతి సిస్టర్సు"గా విజయనగరంలో పిలువబడుతూ గాయత్రీ పరివార్ కార్యకలాపాలను అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పణా భావంతో చేస్తూ పూజ్యగురుయుగ్మ సందేశాన్ని ఇంటింటా చేర్చుటకై తమ వంతు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా, బంధుమిత్రుల కుటుంబాలలో వివాహ సంబంధాలు కుదుర్చుకొనుటలో సహకారాన్ని అందిస్తూ కళ్యాణబంధం ద్వారా ఇరు కుటుంబాలను కలిపే పవిత్రకార్యాన్ని అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ రీతిగా గాయత్రిని, పూజ్యగురుదేవులను అనువైన, అవకాశమున్న ప్రతిచోట వీరు వ్యాప్తిగావించుట అత్యంత ముదావహం.

వీరికి వీరి కుటుంబానికి పూజ్య గురుయుగ్మం ఆశీస్సులు లభించాలని యుగశక్తి గాయత్రి ప్రార్థించుచున్నది.

## శ్రీ పులిపాటి వెంకట చలమయ్య



శ్రీ పులిపాటి వెంకట చలమయ్యగారు 1947వ సం॥ జులై 30న భారతావని స్వాతంత్ర్య సముపార్జనకు పక్షము రోజుల ముందు హాజీపురం గ్రామం, కనిగిరి తాలుకా ప్రకాశం జిల్లాలో శ్రీ వెంకటనారాయణ - అచ్చమ్మ దంపతులకు జన్మించారు.

జన్మించినగ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేస్తుండగా వ్యాపార నిమిత్తం కుటుంబం గుంటూరు జిల్లాలోని తెనాలి పట్టణానికి మారింది. తెనాలిలో 3 నుండి 4 సంవత్సరాలు ఉన్నందున అచ్చటనే 7వ తరగతి వరకు విద్యను కొనసాగించారు. అటుపిమ్మట వ్యాపార కదలికలననుసరించి కొంతకాలం తిరిగి కనిగిరి చేరి మార్కాపురం తాలూకా కంభంలో హైస్కూలు విద్యను పూర్తిగావించుట జరిగింది.

తదుపరి కుటుంబ ఆర్థిక వనరుల పెంపొందించుకొనే దిశగా, అనువైన స్థలాల వెతుక్కుంటూ తండ్రిగారి తోబుట్టువులు ఉంటున్న విజయనగరానికి మకాం మార్చారు. ఇచ్చటనే వెంకట చలమయ్యగారు తన భావిజీవితానికి కావలసిన వ్యాపార పునాదులను బలంగా వేసికొని రాబోయే గృహస్థ జీవనానికి సంసిద్ధులు కాసాగారు. ఈ రీతిగా వస్త్ర వ్యాపారంలో అడుగిడిన చలమయ్య అంచలంచెలుగా వ్యాపారంలో ఎదుగ సాగారు. చిన్ననాటి నుండి తనకు తెలియక పోయినా పూజ్య గురుదేవులు చెప్పిన జీవన సూత్రాలలోని ఆర్థిక సంయమనాన్ని (అదే పొదుపు) గట్టిగా అందిపుచ్చుకొని, దాని ప్రాధాన్యాన్ని తన జీవితంలో అడుగడుగునా ఆచరణలో పెడుతూ తనకొక ప్రత్యేక గుర్తింపును సాధించుకొన్నారు. ఈ క్రమంలో యుక్త వయస్సురాగానే చీరాల వాస్తవ్యులు, శ్రీ అశ్విని సుబ్బారావుగారి సోదరియైన సత్యవతిగారితో అక్టోబరు 1970లో చలమయ్య గారి వివాహం జరిగింది. తన బావమరిదిగారైన శ్రీ సుబ్బారావుగారి నుండి వ్యాపార ప్రేరణను అందిపుచ్చుకొన్న మన చలమయ్యగారు వస్త్ర వ్యాపారమును విడచి, వినియోగ దారుల నిత్యావసర వస్తువుల టోకుగా విక్రయించెడి వ్యాపారంలో అడుగిడినారు. ఈ వ్యాపారంలో దాదాపు రెండు దశాబ్దాలు పై చిలుకు కొనసాగారు. ఈ సమయంలో తన బావమరిది శ్రీ అశ్విని సుబ్బారావుగారి ప్రేరణతో, తన అంతః కరణలో మరుగున పడియున్న ఆధ్యాత్మిక వాసనలు వెలికివచ్చి చలమయ్యగారిలో భావసంవేదనల పురిగొల్పగా, మనో చైతన్యం ద్వారా ఆత్మవికాసం దిశగా అడుగులు వేయసాగారు. ఈ క్రమంలో 2010లో మొదటిసారి గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌ను సందర్శించి ఐదురోజులున్నారు. తదుపరి పూజ్యగురుదేవుల జన్మశతాబ్ది 2011లో 25 దినముల పాటు సమయదానమిచ్చి శాంతికుంజ్‌లో పనిచేశారు. వీనితో గురుదేవుల పట్ల సమర్పణ మరింత పెరిగి, గురుదేవుల సాహిత్యాన్ని ఇంటింటా వ్యాప్తి చేయుటలో విజయనగరం జిల్లాలో అత్యధికంగా శ్రమించుచున్న వారిలో శ్రీ చలమయ్య గారు ప్రథమస్థానాన్ని అలంకరించారు. ముఖ్యంగా యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారుల సంఖ్యను పెంచుటలో విశేషంగా కృషిచేయుచున్న వీరు మిగుల అభినందనీయులు.

వీరికి వీరి కుటుంబానికి పూజ్యగురుయుగ్మ ఆశీస్సులు సదా లభించాలని యుగశక్తిగాయత్రి ప్రార్థించుచున్నది.

**స్త్రీ పురుషులు సమానమే**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## "హుద్ హుద్" తుఫాను-సహాయక కార్యక్రమాలు

12, అక్టోబర్ 2014న "హుద్ హుద్"తుఫాను ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం వద్ద తీరాన్ని దాటి అపార నష్టాన్ని కలిగించింది. ఈ వార్త తెలిసిన వెంటనే గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లోని విశ్వగాయత్రీ పరివార్ ప్రధాన కేంద్రము స్పందించి, ఆపదల విభాగం ద్వారా సహాయక చర్యలను చేపట్టి వైద్య సహాయాన్ని, ఆహార ధాన్యాలు, అత్యవసర ఆహార పదార్థాలను బాధిత ప్రజలకు సరఫరా చేయుటకు తగిన చర్యలు చేపట్టింది. వెంటనే అదేసమయంలో శాంతి కుంజ్‌లో ఉన్న గాయత్రీ పరివార్, విజయనగరం జిల్లా ప్రతినిధులతో కలిపి ఒక తుఫాను సహాయక బృందాన్ని ఏర్పాటు చేసి తక్షణం విజయనగరం, విశాఖపట్నం జిల్లాల సర్వేకు బయలుదేర దీసింది. బృందం 17 అక్టోబరు రాత్రికి విజయ నగరం చేరింది. విద్యుచ్ఛక్తి మంచినీరు సరఫరా లేని స్థితినెలకొని ఉంది. బృందం సభ్యులు 8వ తేది ఉదయాన్నే కారులో బయలుదేరి భోగాపురం మండల తహసీల్దారుని కలుసుకొనగా ఆయా గ్రామాల్లో నెలకొని ఉన్న పరిస్థితిని వారు ఈ విధంగా వివరించారు.

జరిగిన నష్టమంతా గాలి తీవ్రతవల్ల (250 కి.మీ. వేగం) జరిగింది. 1) వరదలు రాలేదు. 2) నీటి ముంపు లేదు 3) గాలి సుడులు తిరిగి పండ్ల తోటలు జీడి మామిడి, కొబ్బరికి విస్తారంగా నష్టం కలిగించింది. ఇవి కూకటివ్రేళ్ళతో పెళ్ళగించ బడ్డాయి. 4) అట్లే పూరిపాకలకు, తాటియాకులతో కప్పిన ఇళ్ళకు సముద్రతీరం వెంట ఉన్న గ్రామాలకు కొంతమేర నష్టం జరిగింది. 5) కోళ్ళ ఫారాలకు అపార నష్టం జరిగింది. 6) ఇళ్ళలోనికి నీరు ప్రవేశించనందున ప్రజల నిత్యావసర పదార్థాలకు నష్టం కలుగలేదు. 7) అంటువ్యాధులు ప్రబలెడి అవకాశం లేదు. 8) ప్రజలకు వైద్య అవసరం అత్యంత స్వల్పం. 9) ప్రభుత్వం ముందు జాగ్రత్తచర్యలుగా ప్రజలను లోతట్టు ప్రాంతాల నుండి సురక్షిత ప్రాంతాలకు తరుముటచే ప్రాణ నష్టం లేదు. 10) కూలిన చెట్లను తొలగించి రహదార్లను వెంటనే పునరుద్ధరించుటచే సహాయక చర్యలు అందించుట సులభతరమైంది. ఆహార ధాన్యాలను త్వరితగతిన అందించారు.

పై పరిస్థితులను విశ్లేషించి ఆయన ఇలా చెప్పారు. ఈ ప్రాంతం ఆర్థికంగా ముందున్నది. మత్స్యకారుల వద్ద నుండి, వ్యవసాయమందించి తోడ్పాటునందించవచ్చు అన్నారు.

తదుపరి గాయత్రీ పరివార్ సహాయక బృందం గ్రామాలను స్వయంగా పరిశీలించుటకై వెళ్ళింది. మండల అధికారి మాటలకు, క్షేత్రంలో పరిస్థితులు చక్కగా సరిపోయాయి. కొంతమంది ప్రజలను ముఖాముఖి ప్రశ్నించింది బృందం. "మాకు ఆహార పదార్థాలు అందుతున్నాయి. మంచినీరు ట్యాంకర్లలో సరఫరా చేస్తున్నారు. (బృందం ఎదుటే ఒక ట్యాంకరు వచ్చి త్రాగునీటిని అందించింది.)

క్షేత్ర పరిశీలన గావించిన బృందం వెనువెంటనే శాంతికుంజ్, హరిద్వార్‌కు ఫోన్ చేసి, వైద్య బృందం అవసరం లేదని, వైద్య బృందాన్ని పంవలదని కోరింది. అటుపిమ్మట పేదలకు కావలసింది. చలినుండి రక్షణకై దుప్పట్లు, కొద్దిపాటి బట్టలు, వంటింటి పాత్రలు అందిస్తే సరిపోతుంది అని తెలియజేసింది. ఇదే విషయాలను, దక్షిణభారత ప్రధాన సంచాలకులైన శ్రీ అశ్విని సుబ్బారావు, హైద్రాబాదు గారికి ఫోను చేసి తెలిపింది. శ్రీ సుబ్బారావుగారి సూచనల మేరకు, అనుమతి మేరకు, బృందం అంచనా మేరకు, క్షేత్ర అధికారుల సూచనల మేరకు 1200 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఈక్రింది వస్తువులను అందించుట జరిగింది.

లబ్దిదారునకు ఒక్కొక్కరికి దుప్పటి, చీర, ధోవతి / లుంగీ, కందువా మరియు మూడు స్టీలు గిన్నెలు మూతలతో, గ్లాసు, భోజనం చేసే పళ్ళెం అందించుట జరిగింది.

33 ప్రదేశాలలో (కాలనీలు, చిన్న పంచాయితీలు, పెద్ద పంచాయితీలు) పంపిణీ చేయుట జరిగింది.

రూ. 3,90,800/-ల విలువ కలిగిన బట్టలను మరియు రూ. 2,21,500/- విలువ కలిగిన స్టీలు సామాన్లను విజయ నగర మార్కెట్టులో ఖరీదు చేసి పంపిణీ చేయుట జరిగింది.

**ప్రకృతితో మమేకమై జీవించాలి**

గాయత్రీ చేతనా కేంద్రము, మూసాపేట, హైదరాబాదు నిధుల నుండి రూ. 5,00,000/-, రూ.1,12,300/- విరాళాల రూపంలో వసూలు చేసి ఖర్చు చేయుట జరిగింది.

సహాయక కార్యక్రమాల్లో ఈ క్రింది గాయత్రీ పరివార్ సభ్యులు పాల్గొనుట జరిగింది.

1) శ్రీ ఎమ్.విశ్వేశ్వరరావుగారు, విజయనగరం 2) శ్రీ పి.వి. చలమయ్య, విజయనగరం, 3) శ్రీ అవతారం రాజు, విశాఖపట్నం 4) శ్రీ బి.బ్రహ్మానందరెడ్డి, నంబూరు, గుంటూరు జిల్లా, 5) శ్రీ లక్ష్మీపతిరాజుగారు, విజయ నగరం 6) శ్రీ బి.ఏడుకొండలు, విజయనగరం, 7) శ్రీ ఎ. వేణుగోపాలరెడ్డి, చేతనాకేంద్ర ప్రతినిధి.

గాయత్రీ పరివార్ సభ్యులను ఇంకా ఎక్కువగా చుట్టు ప్రక్కల నుండి ఆహ్వానించలేకపోవుటకు కారణం. విద్యుచ్ఛక్తి లేనందున, త్రాగునీటితోపాటు, స్నానాలకు, బట్టలు ఉతుకుటకు, చాలా కష్టంగా ఉంది. ఇట్టి స్థితిలో ఎక్కువ మందిని భాగస్వాములు చేయజాలకపోవుట జరిగింది.

## కురుపాం, విజయనగరం జిల్లాలో గాయత్రీ ప్రజ్ఞా/మహిళా మండళ్ళ ఏర్పాటు

2014 నవంబర్ 2 ఆదివారము ఉదయము గాయత్రీ ప్రజ్ఞాపీఠము కురుపాం గ్రా॥, కురుపాం మం॥, విజయనగరం జిల్లా పరిధిలోని 21 గ్రామాల్లో గాయత్రీ ప్రజ్ఞామండలి మరియు గాయత్రీ మహిళా మండలులను ఏర్పాటు చేయు దిశగా దాదాపు 500 మంది నారీమణులతో నారీ సమ్మేళనం జరిగింది. ఆరోజు ఉదయం 8 గం॥ల నుండి 21 గ్రామాల నుండి పసుపు పచ్చని చీరలు ధరించి నారీమణుల కాలినడకన, ఆటోల ద్వారా మరియు బస్సులలో, వ్యానుల్లో సభాస్థలికి విచ్చేశారు.

దీపప్రజ్వలనతో పూజ్యగురుదేవులు, వందనీయ మాతాజీల ఆవాహనతో "ఎగరాలి ధర్మ ధ్వజమా" అనే ప్రబోధ గీతాన్ని గాయత్రీ పరిజన్ ఆదరణీయ శ్రీమతి సావిత్రి నర్సింగ రావు, విశాఖపట్నం ఆలపించగా నారీమణులంతా జండాలు చేబూని జయజయధ్వానాలు చేస్తూ గ్రామంలో ప్రభాతభేరీ కార్యక్రమాన్ని కన్నుల పండువగా రెండు వరుసలలో దాదాపు 700 మందితో నిర్వహించారు. చిన్న మేరంగి పోలీసువారు, రక్షణను కల్పించారు. పరిజనులతో కూడి, గ్రామ ప్రజానీకం కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని అత్యంత క్రమశిక్షణతో నిర్వహించారు. శ్రమజీవులతోకూడిన పరివారమై నందున 2 మైళ్ళ పొడవునా అలుపెరుగని ఆసాంతం ఉత్సాహాన్ని కనబరుస్తూ చక్కగా స్త్రీలు, ఆబాలగోపాలం పాల్గొన్నారు.

అటుపిమ్మట కురుపాం గాయత్రీ పరివార్ యొక్క ప్రజ్ఞాపీఠాన్ని నిర్మించుటకై ఎన్నుకొన్న స్థలములో, చుట్టూరా రక్షణగా ఇనుప కంచెను ఏర్పాటు చేసిన స్థలములో "గాయత్రీ ప్రజ్ఞాపీఠము, కురుపాం" పేరు వ్రాసిన ఫలకాన్ని ఆవిష్కరించారు.

తరువాత షామియానాల క్రింద ఆసీనులైన పరిజనుల కార్యక్రమం, గురువందన, గాయత్రీ మంత్రోచ్చారణలతో ప్రారంభమైనది. కార్యక్రమానికి గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్ ప్రతినిధి అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రసంగాన్ని ప్రారంభిస్తూ నారీ ప్రాధాన్యతకు ప్రతీకగా శ్రీమతి సావిత్రి నర్సింగరావు విశాఖపట్నం వారు ప్రవచనంలో యుగనిర్మాణంలో మహిళా మండళ్ళ ప్రాధాన్యతను వివరిస్తూ ఇలా అన్నారు – "సమాజంలో సామాజిక వ్యసనాలైన గుట్కా సేవనము, మద్యపానం, జూదం, మోసం, దొంగతనాలు పెరిగిపోవుటను గురించి గ్రామసీమలలో, కుటుంబ పరంగా మహిళలు చైతన్యవంతులై మొదట తమ తమ కుటుంబాలను సరిదిద్దుకుంటూ తద్వారా గ్రామాన్ని సరిదిద్దవలసియున్నదని ప్రబోధించారు. దీనికై స్త్రీలు నిత్యం కనీసం 3 మాలలు గాయత్రీ మంత్రజపం చేస్తూ, తమ పిల్లల చేత తదుపరి భర్తచేత, ఇతర పెద్దలందరితో చేయిస్తూ సద్బుద్ధి, సదాచారాలు, సత్కర్మల పాదుకొల్పుటకు కృషి చేయాలన్నారు. ప్రతిరోజు కొంత సమయదానాన్ని, కొంత అంశదానాన్ని ఇచ్చి గాయత్రీ ప్రజ్ఞామండలులను పటిష్టం గావించాలి అన్నారు.

సభలో పాల్గొన్న విజయనగరం పట్టణ గాయత్రీ పరివార్ కార్యకర్త శ్రీ పి.వి.చలమయ్యగారు ప్రసంగిస్తూ ఈ గాయత్రీ మహామంత్రం నిత్యం జపించుటచేత తన జీవితంలో ఎంతో ప్రగతి లభించిందని, సుఖశాంతులు కుటుంబంలో వచ్చాయని, ఆర్థిక స్థిరత్వం తన కుటుంబానికి కలిగిందని, అందరూ తనలా చేస్తే వారికి ఇవన్నీ చేకూరుతాయని ప్రబోధించారు.

శ్రీ బి.ఎన్. రావుగారు ప్రవచిస్తూ తన పుష్కర గాయత్రీ మంత్ర జప అనుభవం ద్వారా అనేకానేక లాభాలను తాను

**ప్రకృతితో మమేకమైనప్పుడు ఆరోగ్యవంతమైన జీవితాన్ని ఆస్వాదించగలం**

పొందానని తెలిపారు. తనకున్న యోగవిద్యను, శరీర ఆరోగ్య రక్షణకై తీసికొనవలసిన జాగ్రత్తలను వివరిస్తూ, వీనినన్నింటని ఆహ్వానించినప్పుడు తగిన రీతిలో అన్ని మహిళా మండళ్ళకు అందజేసెదనని మాట ఇచ్చారు.

గాయత్రీ చేతనా కేంద్ర ప్రతినిధి, ప్రజ్ఞామండళ్ళు, మహిళామండలుల ఏర్పాటు చేయుటలోని ప్రధాన ఉద్దేశ్యాన్ని తెలుపుచూ, కుటుంబ జాగృతిలో, తద్వారా సమాజ జాగృతిలో ప్రజ్ఞామండలుల స్త్రీలు పోషించవలసిన పాత్రను, బాధ్యతలను వివరించారు. అట్లే వారి సంతానాన్ని కూడా కుటుంబానికి ప్రయోజకులగానేకాక, సమాజ ప్రయోజకులు తీర్చిదిద్దవలసిన బాధ్యతవారిపైనున్నదని విశదీకరించుట జరిగింది.

కార్యక్రమం చివరన విచ్చేసిన మహిళా మణులందరికి తిలకధారణ గావించి, అక్షతలు పూవులను సంకల్పం చేస్తూ గురుయుగ్మ పాదాల చెంత అందరూ సమర్పించుట జరిగింది. వారందరి వద్దనుండి దరఖాస్తులు నింపి, తీసికొనుట జరిగింది.

ఈ కార్యక్రమం ఈవిధంగా రూపుదాల్చి ఇందరి స్త్రీలను ఒకచోట చేర్చుటకై కృషి చేసిన గాయత్రీ పరివార్ కురుపాం శాఖలోని ప్రముఖులైన శ్రీ బత్తుల గురుమూర్తి, సున్నపు శంకర్‌రావు, శ్రీ ఆదినారాయణ, శ్రీ సత్యన్నారాయణ దంపతులు, మున్నగు వారంతా అత్యంత అభినందనీయులు.

కార్యక్రమానంతరం భోజన ప్రసాద వితరణ జరిగింది. ఆరోజు సాయంత్రం, కురుపాం గాయత్రీ పరివార్ ప్రజ్ఞామండలి కార్యవర్గం సమావేశంలో తదుపరి చేపట్టవలసిన కార్యక్రమానికి ప్రణాళిక రచన చేశారు. శాంతిమంత్రంతో ఆనాటి కార్యక్రమాలు ముగిశాయి.

## కొత్తపాలెంలో

కార్తీకమాసము ఏకాదశి పర్వదిన సందర్భంగా గాయత్రీ శక్తిపీఠము, కొత్తపాలెం గ్రామం (చెరుకూరు పంచాయతీ శివారు, బాపట్ల దగ్గర) నవకుండీ గాయత్రీ మహాయజ్ఞము నిర్వహింపబడింది. ఈ యజ్ఞంలో కొత్తపాలెం, నర్సాయపాలెం, కంకటపాలెం, వీరన్నపాలెం, జమ్ములపాలెం, బాపట్ల, రేటూరు, తోటవారిపాలెం, గార్లపాడు మున్నగు గ్రామాల నుండి నారీమణులు దాదాపు 300 పైచిలుకు పాల్గొని యజ్ఞాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

శ్రీయుతులు శ్రీమతి నాగరాజకుమారి, శ్రీ సింగారెడ్డి, శ్రీఅంజిరెడ్డి మున్నగువారి సారథ్యంలో యజ్ఞం నిర్వహింపబడింది.

## అమలాపురంలో

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం పట్టణమందు వేదమాత గాయత్రీ దివ్యభవ్యసాధనా మందిరమునందు శ్రీశ్రీశ్రీ రామానందస్వామి ఆధ్వర్యములో నవరాత్రి ఉత్సవములు అత్యద్భుతంగా నిర్వహించారు. ఉ॥ 5 గం॥లకు హారతి, ఉ॥ 6 గం॥ల నుండి 7 గం॥ల వరకు వేదపారాయణ జపం, ఉ॥ 9 గం॥ల నుండి 11 గం॥ల వరకు సహస్రనామార్చన మరియు సహస్రనామ పారాయణ ఉ॥ 11 గం॥లకు 60 మంది పరిజనులతో సామూహిక జపం (1 మాల) 2 గం॥లకు గాయత్రీ సహస్రనామ పారాయణ, మ॥ 3 గం॥ల నుండి సా॥ 4 గం॥ల వరకు సామూహిక జపం; సా॥ 4 గం॥ల నుండి సా॥ 5 గం॥ల వరకు గాయత్రీ అక్షరన్యాసంపై గాయత్రీగారి ప్రవచనం; సా॥ 5 గం॥ల నుండి తిరిగి హారతి, సహస్రనామార్చన, యుగ సంగీతం.

అక్టోబర్ 5వతేదిన పంచకుండీ హవనయజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో 500 మంది పాల్గొన్నారు. భోజన సదుపాయములు ఆకుల బాబి మరియు శ్రీదేవి (ఆలయ నిర్మాణకర్తలు) పరిజనుల సహకారంతో నిర్వహించారు. అనంతరం సా॥ 5 గం॥ల నుండి సా॥ 7 గం॥ల వరకు గాయత్రీమాతను పల్లకిలో అత్యంత రంగరంగ వైభవంగా అలంకరించి గాయత్రీ పరివారసభ్యులందరూ మరియు పరిజనులు (పచ్చ వస్త్రాలతో) జయఘోష, యుగ సంగీతం గాయత్రీ మంత్రంతో చాలా ఆనందంగా అత్యద్భుతంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

**రంగాపురంలో:** అమలాపురం మండలం, తూ.గో. జిల్లా శ్రీ గాయత్రీచరణ పీఠమునందు ఎన్.ఆర్.కె. రాజు, సుభద్రగార్ల పర్యవేక్షణలో శ్రీరామానందస్వామి ఆధ్వర్యంలో నవరాత్రి కార్యక్రమములు నిర్వహించారు. ఉ॥ 4 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు అఖండజపం, మ॥ 2 గం॥లకు గాయత్రీ సహస్ర నామ పారాయణ, దుర్గాసప్తశతి పారాయణ నిర్వహించారు. సా॥ 6 గం॥లకు సహస్ర నామార్చన, హారతి, అనంతరం అక్టోబర్ 4వ తేదిన పంచ కుండీలతో పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఎన్.ఆర్.కె.రాజు, సుభద్రగారు 400 మందికి భోజన ప్రసాద వితరణ నిర్వహించారు.

**ఇతరులను నొప్పించేలా ఎన్నడూ మాట్లాడకూడదు**

**వన్నె చింతలపూడి శ్రీ గాయత్రీ శక్తిపీఠంలో:**

25.09.2014 నుండి 04.09.2014 వరకు శరన్నవరాత్రి కార్యక్రమములు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పీఠం యొక్క కార్యకర్త నారాయణగారు, శ్రీ రామానందస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమములు నిర్వహించారు. ఉ॥ 4 గం॥లకు ప్రార్థన, హారతి, స్తవం, ధ్యానం (3 శరీరాల), ఉ॥ 5.30 గం॥ల నుండి ఉ॥ 6.30 గం॥లకు ఆరుగురు సాధకులతో సామూహిక జపం, ఉ॥ 6.30 గం॥లకు గోపూజ, ఉ॥ 8గం॥ల నుండి 9 గం॥ల వరకు గాయత్రీమాతకు సహస్రనామార్చన, ఉ॥ 9 గం॥ల నుండి 10 గం॥ల వరకు యజ్ఞం. ఉ॥ 10 గం॥ల నుండి మ॥ 12 గం॥ల వరకు సత్సంగం, మ॥ 2 గం॥ల నుండి 4 గం॥ల వరకు సత్సంగం, గాయత్రీ సహస్ర నామ పారాయణ, 6 గం॥ల హారతి, సహస్రనామార్చన మొదలైన కార్యక్రమములు నిర్వహించారు.

**సత్సంగం:** కె. నాగమణి, గురుదేవుల సత్సంకల్పములు, అక్షరన్యాసం, ఓంకార సాధన, పంచకోశ సాధన మొదలైన సాధనలు సాధకులకు నేర్పించుట జరిగింది. దీని ఫలితముగా ఆరుగురు సాధకుల నిత్యము పీఠమునకు వచ్చి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సాధనలు మరియు సత్సంగము చేయుటకు సంకల్పము తీసుకొన్నారు. సత్సంగమునకు 15 నుండి 20 మంది హాజరయ్యారు. 30 మంది విద్యార్థులతో సరస్వతీమాత పూజా కార్యక్రమము చేయించి వారికి చదువు-విద్యను గురించి తెలియజెప్పి చదువుతోపాటు విద్యనేర్చుకోవాలని తెలియజేయుటచే అందరూ చాలా శ్రద్ధగా ఉత్సాహముగా నేర్చుకొని ప్రతిరోజు గాయత్రీమంత్రం ఐదుసార్లు చేయుటకు సంకల్పము తీసుకొన్నారు. అలాగే చందనధారణ, సర్వసతీ శ్లోకములు నేర్చుకొన్నారు. అనంతరం పంచకుండీలతో పూర్ణాహుతి కార్యక్రమం శ్రీరామానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహించబడినవి.

---

## గాయత్రీ పరివార్ - 2015 వార్షిక క్యాలెండర్

గత ఐదు సంవత్సరముల నుండి గాయత్రీ పరివార్ వార్షిక క్యాలెండర్‌ను ఆదరించి, పరమపూజ్య గురుదేవులు మరియు పరమ వందనీయ మాతాజీల వాణిని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నలుచెరగులా మరియు వివిధ రాష్ట్రాలలోనున్న తెలుగువారికి అందించుటలో మీరంతా అందించుచున్న సహాయసహకారాలకు, ప్రోత్సాహానికి, గాయత్రీ చేతనా కేంద్రము తొలుత మీకు ధన్యవాదములు తెలుపుకొనుచున్నది.

ఈ సంవత్సరము 2015 వార్షిక క్యాలెండర్‌ను మరింత సందేశాత్మకంగా మనందరి హృదయాల కదిలించి, మన ఆలోచనల మథింపజేసి తద్వారా లభించెడి నవనీతాన్ని పూజ్య గురుయుగ్మం ఆశయాలకు అనుగుణంగా సమకాలీన సమాజానికి అందించి, సత్యయుగ నిర్మాణానికై చేసెడి కృషిలో మనలను మరియొక ముందడుగు వేయించుటలో మార్గదర్శనం ఇవ్వగలదని మా ప్రగాఢ విశ్వాసం. క్యాలండరు సైజు 31 సెం.మీ. (పొడవు) × 22 సెం.మీ. (వెడల్పు)

1) ఎప్పటిలాగే మీ పేర్లను / మీ సంస్థల పేర్లను గాని మీ కోరిక మేరకు ముద్రించి అందించగలం. (ప్రకటన స్థలం సైజు: 4.5 సెం.మీ. (పొడవు) × 22 సెం.మీ. (వెడల్పు)
2) మీ పేర్లు ముద్రించి అందించుటకు కనీసం 500 కాపీలను ఆర్డరు చేయవలెను.
3) 50 కాపీలకు తగ్గకుండా కొనుగోలు ఆర్డరు ఇచ్చినవారికి పోస్టు ద్వారా పంపబడతాయి.
4) కేవలం సద్వాక్యాలతో కూడిన క్యాలండర్ కాపీ ధర రూ.13/-. పేరుతో ముద్రించిన కాపీ ధర రూ. 15/-. రవాణా ఖర్చులు అదనం.

మీ ఆర్డరును డిశంబరు 10వ తేదిలోగా పంపించగలిగితే డిశంబరు 25వ తేదికి అందించగలము.

**ఇతర వివరాలకు సంప్రదించండి :**

**గాయత్రీ చేతనాకేంద్రం, అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట, హైదరాబాద్ - 500 018.**

**ఫోన్: 040-23700722, సెల్: 9949111175**

ఒక్కసారి నోరుజారితే వెనక్కు తీసుకోవడం కష్టం